
www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

## రేనాటి వీరుడా వందనం!

నేడు అధికారికంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ఓబన్న స్నేహితుడు
భరణాన్ని అధికారులు ఎగ్గొట్టడంతో మొదలైన పోరు
సైరాకు ప్రధాన అనుచరుడు.. ఏడాదిపాటు సమరం
గెరిల్లా పద్ధతుల్లో బ్రిటిష్ ఖజానాపై దాడులు
నల్లమల కేంద్రంగా పోరాట వ్యూహాలకు పదును
జగన్నాథకొండ వద్ద పట్టుబడి 39 ఏళ్లకే అమరత్వం

ప్రత్యేక కథనం 12లో..



శనివారం | 11-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 267 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి ఉ. 8.22 తదుపరి త్రయోదశి తె. 6.33 వరకు; నక్షత్రం: రోహిణి మ.12.29 తదుపరి మృగశిర; వర్జ్యం: సా.5.49-7.21; దుర్ముహూర్తం: ఉ.6.51-8.20; అమృతఘడియలు: ఉ.9.27-10.58, రా.2.59-4.31; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం:6.51; సూర్యాస్తమయం: 5.54 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

# ఆగని రచ్చ

## టీటీడీలో రగులుతున్న 'తొక్కిసలాట'



### వాడీవేడిగా పాలకమండలి భేటీ

అధికారులపై ధ్వజమెత్తిన సభ్యులు
'అంతా మీవల్లే' అంటూ మండిపాటు
గళమెత్తిన చైర్మన్, ఇతర సభ్యులు
ఈవో వ్యవహార శైలిపై అభ్యంతరాలు
సమన్వయం లేనందునే విషాదమని వెల్లడి



వైకుంఠ ఏకాదశి సందర్భంగా మాడ వీధుల్లో స్వర్ణ రథంపై స్వామి విహారం

ఒక బృందంగా పనిచేయాల్సిన చోట ఎవరి తీరున వారు పనిచేస్తున్నారు. దీనివల్లే తిరుపతిలో దుర్ఘటన జరిగింది. మీ (అధికారుల) వల్ల మేం అందరం మాటపడాల్సి వచ్చింది.
- చైర్మన్ బీఆర్ నాయుడు

టోకెన్లు జారీ చేసే కేంద్రాల వద్ద పాలక మండలి సభ్యులకు డ్యూటీ వేసినా ఆనందంగా చేసేవాళ్లం. నలుగురు బాధ్యత తీసుకొని పనిచేస్తే ఇప్పుడు తల దించుకోవాల్సిన అవసరం ఉండేది కాదు.
- బోర్డు సభ్యుల్లో ఒకరు

'సామాన్య భక్తులు అన్యాయంగా ప్రాణాలు కోల్పోయారు. సీఎం చంద్రబాబు స్వయంగా వచ్చి తప్పు జరిగిందని క్షమాపణలు కోరాల్సి వచ్చింది. ఇంత పెద్ద వ్యవస్థను పెట్టుకొని.. ఎన్నో కార్యక్రమాలు చేసిన అనుభవం ఉంచుకొని కూడా చివరికి మాటపడాల్సి వచ్చింది. తప్పులు దాచుకోవాలని ప్రయత్నించొద్దు. అహం ప్రదర్శించడమే దీనికి కారణం. ఇకనైనా అందరం కలిసి పనిచేద్దాం!
- బోర్డులో సభ్యుడైన ఒక సీనియర్ నేత

అమరావతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తొక్కిసలాట ఘటనపై టీటీడీలో రచ్చ కొనసాగుతూనే ఉంది. గురువారం ముఖ్యమంత్రి ముందే ఈవో శ్యామలరావు, చైర్మన్ బీఆర్ నాయుడు మధ్య వాగ్యుద్ధం జరగగా... శుక్రవారం, వైకుంఠ ఏకాదశి రోజున తిరుమలలో జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశం కూడా రచ్చ రచ్చగా మారింది. తిరుమల ఆలయ పాలనా వ్యవహారాల్లో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై పాలక మండలి సభ్యులు నిప్పులు చెరిగారు. అధికారుల ఏకపక్ష తీరు వల్లే టీటీడీ చరిత్రలోనే మొదటిసారిగా సామాన్య భక్తులు ప్రాణాలు కోల్పోయిన ఘటన జరిగిందని విమర్శించారు. అధికారుల తీరుతో తాము తల దించుకోవాల్సి వచ్చిందని పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. ప్రధానంగా ఈవో శ్యామలరావు వ్యవహార శైలిని పాలక మండలి సభ్యులు తప్పుబట్టినట్లు సమాచారం! తొక్కిసలాట బాధిత కుటుంబాలకు చేయాల్సిన సహాయంపై తీర్మానాలు చేసేందుకు వీలుగా తక్షణం

మిగతా 13వ పేజీలో...



### క్షమాపణలు చెప్పాల్సిందే!

మీకు మరో దారి లేదు.. ప్రజలు మిమ్మల్ని చూస్తున్నారు

టీటీడీ చైర్మన్, ఈవో, బోర్డు సభ్యులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరిక
తిరుపతి బాధితులతో మాట్లాడినప్పుడు వారు చెప్పింది విని కన్నీళ్లొచ్చాయని వెల్లడి

### డబ్బులిచ్చి చంద్రబాబును తిట్టించారు



జగన్ మనిషి ఆసుపత్రిలో 18 మందికి డబ్బులు పెట్టిన తెల్ల కవర్లు పంచారు 13
ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో ఉన్నాయి
జగన్, అనుచరులు శవాల మీద పేలాలు ఏరుకునే రాజకీయం చేశారు: మంత్రి ఆనం

### బాధాకరమైన ఘటన!



'సారీ'పై సారీ!
బేషరతు క్షమాపణ చెప్పిన చైర్మన్

ఇలా జరగకుండా ఉండాల్సింది
చిన్న పొరపాటుతో పెద్ద విషాదం
మృతుల కుటుంబాలకు 25 లక్షల సాయం
పిల్లల చదువులు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం.. క్షతగాత్రులకూ పరిహారం
టీటీడీ బోర్డు సమావేశంలో తీర్మానాలు



శుక్రవారం గుంటూరులో నరెడ్కో ప్రాపర్టీ షోను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి అభివృద్ధి చెంది ఉంటే...**

'అమరావతి రాజధానిగా అభివృద్ధి చెంది ఉంటే గుంటూరు పరిసర ప్రాంతాలు ఈపాటికే నిలదొక్కుకొని ఉండేవి. అమరావతిని నిర్వీర్యం చేసి ఎక్కడ చూసినా విధ్వంసం చేశారు. హైదరాబాద్ కంటే మిన్నగా 183 కిలోమీటర్ల పొడవునా అమరావతి అవుటర్ రింగురోడ్డు ప్లాన్ చేశాం. గుంటూరు, విజయవాడ వంటి నగరాలు దీని పరిధిలోనే ఉంటాయి. అమరావతి ఒక మహానగరం అయి ఉండేది. విశాఖ, తిరుపతి నగరాలను కూడా గణనీయంగా అభివృద్ధి చేస్తాం'
- సీఎం చంద్రబాబు

# బ్రాండ్ ఏపీ

## ఇప్పుడిప్పుడే విశ్వాసం పెరుగుతోంది

రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి
వైసీపీ పాలనలో నిర్మాణ రంగం కుదేలు
ఆదుకొని మళ్లీ అభివృద్ధిలోకి తెస్తాం
అందరూ మెచ్చుకొనేలా నూతన పాలసీ
జాప్యం చేస్తే ఆటోమేటిక్‌గా అనుమతుల మంజూరు
అలస్యం చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటాం
ఉచిత ఇసుక విధానంతో నిర్మాణ రంగానికి ఊతం
బిల్డర్లు తప్పులు చేయొద్దు.. అడ్డదారుల్లో పోవద్దు
నరెడ్కో ప్రాపర్టీ షోలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

గుంటూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్మాణ రంగం అధ్వానంగా తయారైందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ రంగానికి పెద్ద బూస్టప్ అవసరమని తెలిపారు. పడకేసిన నిర్మాణ రంగాన్ని ఆదుకొని, మళ్లీ పైకి తీసుకొస్తామని ప్రకటించారు. శుక్రవారం గుంటూరులోని చేబ్రోలు హనుమయ్య కంపెనీ ప్రాంగణంలో నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(నరెడ్కో) క్యాపిటల్ జోన్ 12వ ప్రాపర్టీ షోను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి, ప్రసంగించారు. 'ఎన్నికల సమయానికి రాష్ట్రంలో సమస్యలు విలయతాండవం

మిగతా 12వ పేజీలో...

### అనుమతుల అధికారం మున్సిపల్స్‌కే

ఆర్డినెన్సులు జారీ చేస్తూ ఉత్తర్వులు విడుదల
రెండు చోట్ల అనుమతులు, కమీషన్ల భారం తప్పిందంటున్న పట్టణవాసులు 12
భవన నిర్మాణ, రియల్ రంగాలు పుంజుకునే చాన్స్
'రియల్' బూమ్ కోసం సడలింపులు: మంత్రి
ఎన్‌బీసీకి అనుగుణంగా ఉత్తమ విధానాలు



### బతిమలాడి రప్పిస్తున్నాం

మళ్లీ జగన్ రాడనే గ్యారెంటీని పారిశ్రామికవేత్తలు అడుగుతున్నారు
కూటమి ప్రభుత్వంతో మంచి రోజులు
అనుమతులు, భూ కేటాయింపులు వేగంగా మంజూరయ్యేలా చూడాలి
20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం
మంత్రివర్గ ఉపసంఘం భేటీలో లోకేశ్

# విద్యుత్ భారం ఉండదు



## 14,683 కోట్ల లోటును ప్రభుత్వమే సబ్సిడీగా భరిస్తుంది

డిస్కంలు కూడా పెంపును ప్రతిపాదించలేదు
ఏపీఈఆర్‌సీ చైర్మన్ రామ్‌సింగ్ వెల్లడి 12
2025-26 టారిఫ్ ప్రతిపాదనలపై కర్నూలులో ముగిసిన బహిరంగ విచారణ
3 రోజులు ప్రజాభిప్రాయ సేకరణ

**సాగుకు పగలే 9 గంటల కరెంటు**
సబ్సిడీ నిధులు సమకూరుస్తాం
ఏపీఈఆర్‌సీకి ఇంధన శాఖ నివేదన
పీఎంకుసుమ్ కింద లక్ష సౌర పంపు సెట్లు

# ఆ 'భూసేకరణ'ను తేల్చండి

## ఏ సమాచారమూ దాచడానికి లేదు.. విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశాలు

ఆనాడు జగనన్న ఇంటి స్థలాలకు భూసేకరణలో భారీ గోల్‌మాల్
బీడు భూములను కారుచౌకగా కొని, రూ.కోట్లకు అప్పటి సర్కారుకు అమ్మకం
ఆనాడే కలకలం రేపిన వైసీపీ దందా
అధికారంలోకి రాగానే కూటమి దృష్టి
అవసరం ఉన్న ప్రతి రికార్డునూ విజిలెన్స్ అధికారులకు అందివ్వాలి
కలెక్టర్లకు సర్కారు దిశానిర్దేశం

జగనన్న ఇంటిస్థలాల భూ సేకరణలో నాడు వైసీపీ నేతలు చేసిన దోపిడీని బయటపెట్టేందుకు కూటమి సర్కారు చర్యలు ప్రారంభించింది. తొండలు గుడ్లు పెట్టని బీడును కారుచౌకగా కొని రూ. కోట్లకు ప్రభుత్వానికి అంటగట్టిన వ్యవహారం ఇది. ఈ దందాపై విజిలెన్స్ విచారణకు కూటమి ప్రభుత్వం ఆదేశించింది. విచారణకు అవసరం ఉన్న ఏ డాక్యుమెంట్, ఆధారం అడిగినా విజిలెన్స్‌కు అందించాలని జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది.



(అమరావతి-ఆంధ్రజ్యోతి)
గత జగన్ ప్రభుత్వంలో నవరత్నాల కింద జగనన్న ఇంటిస్థలాల పంపిణీ కార్యక్రమాన్ని ఒక తంతులా నడిపించారు. 30 లక్షల మందికి ఇంటిస్థలాలు ఇచ్చామని జగన్ గొప్పగా చెప్పుకొన్నారు. తాము ఇళ్లు కాదు...ఏకంగా కాలనీలు, గ్రామాలనే నిర్మిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఈ పేరిట 26 వేల ఎకరాల ప్రభుత్వ

మిగతా 2వ పేజీలో...

**జగనన్న కాలనీలు.. ఇకపై ఎన్టీఆర్ నగర్‌లు**
పేరు మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు 12

### రాష్ట్రానికి రూ.7 వేల కోట్లు

కేంద్ర పన్నుల్లో వాటా విడుదల 12

### ఇదే తుది గడువు

'గాలి' కేసు విచారణకు 2
మరో 4 నెలలు టైమిచ్చిన సుప్రీం





స్వగ్రామాలకు వెళ్లేందుకు హైదరాబాద్ కూకట్‌పల్లిలో బస్సుల కోసం భారీగా వేచి ఉన్న ప్రయాణికులు

# పట్నం.. పల్లె బాట

14

హైదరాబాద్ నుంచి సంక్రాంతి సెలవులకు భారీగా తరలివస్తున్న జనం
బస్సులు, రైళ్లు కిటకిట.. టికెట్ల మోత

మూడు రెట్లు పెరిగిన విమాన టికెట్ ధరలు
హైదరాబాద్ నుంచి విశాఖకు రూ.18 వేలు
రాజమండ్రి, విజయవాడకు రూ.16 వేలు



### సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణ

మంచి సేవలకు అవకాశం
ప్రతి సచివాలయంలో యాస్పిరేషనల్ కార్యదర్శి
ప్రతి ఇల్లూ జియోట్యాగింగ్ చేయాలి: సీఎం
కనీసం 2,500 మంది జనాభాకు.. లేదంటే 5 కిమీ పరిధిలో ఓ సచివాలయం
అవసరమైతే ఏజెన్సీల్లో అదనంగా పెంచాలి
సర్టిఫికెట్లపై నా ఫొటోలు వద్దు: చంద్రబాబు

అమరావతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్ ద్వారా వారి నుంచి మంచి సేవలు పొందేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఆ సిబ్బంది కొన్నిచోట్ల

మిగతా 14వ పేజీలో...

## నేనూ మనిషినే..
# భగవంతుణ్ని కాదు!

పొరపాట్లు చేసే ఉంటా.. కానీ, దురుద్దేశంతో తప్పులు చేయలేదు
'దేశం ముందు' అన్నదే నా సిద్ధాంతం
గాంధీ, సావర్కర్ మార్గాలు వేరైనా.. 'స్వాతంత్ర్యం' వారి సిద్ధాంతం
ప్రజా సేవ చేయాలన్న మిషన్‌తోనే రాజకీయాల్లోకి రావాలి



ఎన్నికల్లో అలా మాట్లాడాల్సి వచ్చింది
ఎన్నికలు ముగిశాక పాలనపైనే నా దృష్టి
జెరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్‌కు ప్రధాని మోదీ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూ

న్యూఢిల్లీ, జనవరి 10: ప్రధాని మోదీ తొలిసారి ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఇదే ఒక విశేషమైతే.. రెండు గంటల పాటు సాగిన ఈ ఇంటర్వ్యూలో ఆయన తన శైలికి విరుద్ధంగా మాట్లాడి, అందరినీ ఆశ్చర్యపరిచారు. తానూ మనిషినేనని, పొరపాట్లు జరుగుతాయని చెప్పారు. "గుజరాత్ సీఎంగా ఉన్న సమయంలో కష్టపడి పనిచేయడానికి ఉన్న ఏ అవకాశాన్నీ వదలబోనని చెప్పా. నా కోసం ఏమీ చేసుకోలేదు. నేను దురుద్దేశంతో ఎన్నడూ తప్పులు చేయలేదు. ఇదే నా జీవన మంత్రం. తప్పులనేవి అనివార్యమైనవి. నేను కూడా చేసే ఉంటా. ఎందుకంటే నేనూ మనిషినే! నేనేమీ భగవంతుణ్ని కాదు కదా?" అని మోదీ పేర్కొన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త,

మిగతా 2వ పేజీలో...



## కాంగ్రెస్ హెడ్‌క్వార్టర్స్ 15న కొత్త భవనంలోకి

న్యూఢిల్లీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయ చిరునామా ప్రస్తుత 24, అక్బర్ రోడ్ నుంచి 9ఏ, కోట్లా మార్గ్‌కు మారనుంది. ఈ నెల 15 ఉదయం 10గంటలకు కాంగ్రెస్ కొత్త కార్యాలయాన్ని సోనియా గాంధీ ప్రారంభించనున్నారు. కొత్త కార్యాలయానికి ఇందిరాభవన్‌గా నామకరణం చేశారు. మొత్తం ఏడు అంతస్తుల్లో(అండర్ గ్రౌండ్‌లో 2 అంతస్తులతో కలిపి) నిర్మించారు.

## ట్రూడో నిష్క్రమణతో కెనడా వీసాలపై ప్రభావం!

కెనడా, జనవరి 10: కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తన పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన దరిమిలా కొత్తగా ఏర్పడే ప్రభుత్వంలో ఆ దేశ వీసాలపై తీవ్ర ప్రభావం పడనుందని అంతర్జాతీయ నిపుణులు చెబుతున్నారు. ట్రూడో హయాంలో 2015-23 మధ్య అంతర్జాతీయ విద్యార్థులు, ముఖ్యంగా భారత విద్యార్థులకు వీసాల విషయంలో స్వర్ణ యుగమని తెలిపారు. స్వేచ్ఛాయుత వలస విధానాలను ఆయన అమలు చేశారని, దీంతో భారత విద్యార్థులు అధికంగా లబ్ధి పొందారని చెబుతున్నారు. 2015-24 మధ్య కాలంలో 13 లక్షల మంది భారత విద్యార్థులు చదువుకు సంబంధించిన అనుమతులు పొందినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

## 'హష్ మనీ' కేసులో ట్రంప్ దోషే

న్యూయార్క్, జనవరి 10: హష్ మనీ కేసులో అమెరికా మాజీ-భావి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (78) దోషి అని మన్‌హట్టన్ కోర్టు శుక్రవారం తీర్పు చెప్పింది. అయితే ఆయన పది రోజుల్లో అధ్యక్షునిగా ప్రమాణం చేయనున్న దృష్ట్యా ఎలాంటి శిక్ష, జరిమానా విధించలేదు. కానీ శిక్ష పడ్డ అధ్యక్షునిగా చరిత్రలో నిలిచిపోతారు. రెండు దశాబ్దాల క్రితం ఆయనకు ఓ నీలి చిత్రాల నటీమణితో సంబంధాలు ఉండేవి. 2016 అధ్యక్ష ఎన్నికల సమయంలో ఆ విషయాన్ని బయట పెట్టకుండా ఉండేందుకు 'హష్ మనీ' రూపంలో ఆమెకు 1.3 లక్షల డాలర్లు (సుమారు రూ.కోటి) ఇచ్చినట్టు కేసు నమోదయింది. మామూలుగా అయితే నాలుగేళ్ల జైలు శిక్ష విధించాల్సి ఉంది. కానీ వివిధ రాజ్యాంగపర అంశాలను పరిగణనలోకి తీసుకొని శిక్ష విధించలేదని జడ్జి జువాన్ ఎం మర్చాన్ తెలిపారు.

## పరువు నష్టం దావాలో రాహుల్‌కు బెయిల్

పుణె, జనవరి 10: పరువు నష్టం దావాలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి శుక్రవారం ఇక్కడి ఎంపీ/ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కోర్టులో జరిగే విచారణకు వ్యక్తిగతంగా హాజరుకాకుండా కూడా మినహాయింపు ఇచ్చింది. రూ.25,000 పూచీకత్తు చెల్లించాలని ఆదేశించింది. తదుపరి విచారణ ఫిబ్రవరి 18కు వాయిదా పడింది. 2023 మార్చిలో లండన్‌లో జరిగిన కార్యక్రమంలో హిందుత్వ సిద్ధాంతకర్త వి.డి.సావర్కర్‌ను కించపరిచేలా మాట్లాడారంటూ ఆయన మునిమనుమడు రాహుల్‌పై పరువు నష్టం దావా వేశారు.

## క్యాన్సర్ ముప్పు పెరుగుతోంది

» 40 ఏళ్ల పైబడిన వారిలోఎక్కువ కేసులు: మెడి అసిస్ట్

ముంబై, జనవరి 10: గత ఏడాది మన దేశంలో క్యాన్సర్ కేసులు అంతకుముందు ఏడాది కంటే 12% పెరిగాయి. క్యాన్సర్ తర్వాత.. గుండె జబ్బులు, శ్వాసకోశ సమస్యలు భారతీయులను అధికంగా వేధించాయి. 2024లో ఆరోగ్య బీమా కంపెనీలకు వచ్చిన క్లెయిమ్‌ల ఆధారంగా 'మెడి అసిస్ట్ హెల్త్‌కేర్ సర్వీసెస్' అనే సంస్థ ఈ వివరాలను వెల్లడించింది. వీటి ప్రకారం.. క్యాన్సర్ క్లెయిమ్‌లు 40 ఏళ్లకు మించిన వయస్సు ఉన్నవారిలో, మహిళల్లో పెరిగాయి. పురుషులతో పోల్చితే స్త్రీలలో క్యాన్సర్‌కు సంబంధించిన క్లెయిమ్‌లు 1.2-1.5 రెట్లు అధికంగా నమోదయ్యాయి. గుండె జబ్బుల విషయంలో మాత్రం.. మహిళలకన్నా పురుషుల్లోనే క్లెయిమ్‌లు ఎక్కువగా (1.3-1.5 రెట్లు) ఉన్నాయి.

## శంభల్ మసీదు బావిపై యథాతథ స్థితి

» జోక్యం చేసుకోవద్దు.. అధికారులకు సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ, జనవరి 10: వివాదాస్పదంగా మారిన ఉత్తరప్రదేశ్‌లోని శంభల్‌లో ఉన్న షాహీ జామా మసీదుపై శుక్రవారం సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు ఇచ్చింది. అక్కడ యథాతథ పరిస్థితిని కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వ అధికారులను ఆదేశించింది. అక్కడ ఉన్న 'ప్రయివేటు బావి' జోలికి పోకూడదని, సర్వేలు జరపకూడదని పురావస్తు సర్వే విభాగానికి సూచించింది. అక్కడి శాంతిభద్రతల పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్టు పేర్కొంది. శంభల్‌లో జిల్లా అధికారులు జరుపుతున్న తవ్వకాలను సవాలు చేస్తూ షాహీ జామా మసీదు కమిటీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. అక్కడి పరిస్థితులపై రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించింది.

### సుప్రీంకోర్టును సందర్శించొచ్చు

సామాన్యులకు సుప్రీంకోర్టు ద్వారాలు తెరుచుకున్నాయి. ఇకపై సర్వోన్నత న్యాయస్థానం ప్రాంగణంలోకి వెళ్లి అక్కడి విశేషాలను తిలకించవచ్చు. శనివారం రోజుల్లో సందర్శకులకు ఈ అవకాశం కలిగిస్తున్నామని పేర్కొంటూ సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ మహేష్ టి పట్నాకర్ గురువారం సర్క్యులర్ జారీ చేశారు. ఆసక్తికల వారు ఆన్‌లైన్‌లో పేర్లను నమోదు చేసుకొని టైమ్ స్లాట్‌ను బుక్ చేసుకోవాలి. తప్పకుండా గైడ్ సాయంతోనే ప్రాంగణంలో తిరగాలి. గంట పాటు కోర్టు హాళ్లను తిలకించవచ్చు.

### సుప్రీంకోర్టు పేరుతో నకిలీ వెబ్‌సైట్లు

సుప్రీంకోర్టు పేరిట నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి ప్రజల వ్యక్తిగత సమాచారం దొంగిలిస్తున్న సైబర్ దాడుల అంశంపై అత్యున్నత న్యాయస్థానం రిజిస్ట్రీ తాజాగా పబ్లిక్ నోటీసు జారీ చేసింది. నకిలీ వెబ్‌సైట్లను సృష్టించడంతో పాటు యూఆర్ఎల్(యూనిఫామ్ సర్వీస్ లోకేటర్)లను జనరేట్ చేస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించింది. నకిలీ వెబ్‌సైట్ల జాబితాను నోటీసులో ప్రస్తావించింది.

## జేఈఈ-అడ్వాన్స్‌డ్ అభ్యర్థులకు సుప్రీం ఊరట

న్యూఢిల్లీ, జనవరి 10: జేఈఈ-అడ్వాన్స్‌డ్ పరీక్షల విషయంలో అభ్యర్థులకు శుక్రవారం సుప్రీంకోర్టు ఊరట కలిగించింది. 2024 నవంబరు 5 నుంచి 18వ తేదీల మధ్య ఈ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోలేకపోయిన విద్యార్థులకు మరో అవకాశం కల్పించింది. ఈ సమయంలో దరఖాస్తు చేసుకోలేకపోయిన వారు మళ్లీ పరీక్ష రాయవచ్చని తెలిపింది.

## అత్యాచారం చేస్తే మరణశిక్ష

» చట్ట ముసాయిదాకు తమిళనాడు ఆమోదం

చెన్నై, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మహిళలపై అత్యాచార ఘటనలను అడ్డుకునేందుకు తమిళనాడులోని స్టాలిన్ ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. మహిళలపై అత్యాచారానికి పాల్పడేవారికి మరణశిక్ష విధించే చట్టసవరణ బిల్లును సీఎం స్టాలిన్ శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టగా అది ఆమోదం పొందింది. ఇది చట్టరూపం దాలిస్తే.. మహిళల వెంటపడినా, వారిని వేధించినా నేరంగా పరిగణించి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. 18 ఏళ్లలోపు బాలికలపై సామూహిక వేధింపులకు పాల్పడితే జీవిత కారాగార శిక్ష విధిస్తారు. యాసిడ్ దాడి వంటి కేసుల్లో నిందితులకు పదేళ్ల జైలు శిక్ష విధించేలా ఈ బిల్లును రూపొందించారు.

## ఎంపీ అవినాశ్ బంధువు వైఎస్ అభిషేక్‌రెడ్డి మృతి

పులివెందుల, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కడప వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పెదనాన్న వైఎస్ ప్రకాశ్‌రెడ్డి మనవడు (వైఎస్ మదన్మోహన్ రెడ్డి తనయుడు) డాక్టర్ వైఎస్ అభిషేక్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని పులివెందుల తీసుకురానున్నారు. శనివారం జరిగే అంత్యక్రియకు మాజీ సీఎం జగన్ హాజరుకానున్నారు.

# నేనూ మనిషినే.. భగవంతుణ్ని కాదు!

(మొదటి పేజీ తరువాయి)

జెరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ పాడ్‌కాస్ట్‌లో ప్రధాని మోదీ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇద్దరూ పలు ఆసక్తికర విషయాలపై మాట్లాడుకున్నారు. ఇంటర్వ్యూ ట్రైలర్‌ను మోదీ తన ఎక్స్ ఖాతాలో పెట్టారు. తొలుత వీడియో ట్రైలర్‌ను పోస్ట్ చేసిన కామత్.. శుక్రవారం పూర్తి వీడియోను విడుదల చేశారు. దాదాపు 2 గంటల పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో రాజకీయాలు, చిన్నతనంలో జరిగిన ఘటనలు, స్నేహితులు, ప్రధానిగా బాధ్యతలు, నాయకత్వ సవాళ్ల వంటి పలు అంశాలపై ఇద్దరూ చర్చించుకున్నారు. ఆరంభంలో నిఖిల్ కామత్ మాట్లాడుతూ.. 'ప్రధానిని ఇంటర్వ్యూ చేస్తున్నానంటే ఒకింత భయంగా ఉంది' అన్నారు. దానికి మోదీ బదులిస్తూ.. 'ఇదే నా తొలి పాడ్‌కాస్ట్. దీన్ని ప్రజలు ఎలా స్వీకరిస్తారో తెలియదు' అనడంతో నవ్వులు విరిశాయి. రాజకీయాల్లోకి రావాలనుకునే యువతకు మీరిచ్చే సూచన ఏంటి? అని నిఖిల్ కామత్ ప్రధానిని అడగ్గా.. "రాజనీతి కలిగిన వ్యక్తులు రావాల్సిన అవసరం ఉంది. ప్రజాసేవ చేయాలన్న మిషన్‌తో రాజకీయాల్లోకి రావాలి కానీ, వేరే యాంబిషన్(లక్ష్యం)తో కాదు" అని సమాధానమిచ్చారు. రాజనీతి కలిగిన నాయకులు ఉన్నారా? అని అడగ్గా.. దేశంలో అలాంటి యువ నాయకులు ఎంతో మంది ఉన్నారని మోదీ చెప్పారు. ఒకరి పేరు చెబితే మిగిలిన వారికి అన్యాయం చేసినట్లవుతుందన్నారు.



### అదే నా సిద్ధాంతం

ఆశయాలకు అత్యంత ప్రాధాన్యం ఉంటుందన్న ప్రధాని.. అదేసమయంలో సిద్ధాంతాలకు కూడా అంతే విలువ ఉంటుందన్నారు. సిద్ధాంతాలు లేకుండా రాజకీయాలు కూడా లేవని చెప్పారు. గాంధీ, సావర్కర్‌ల మార్గాలు వేరైనప్పటికీ వారి సిద్ధాంతం మాత్రం ఒక్కటేనన్నారు. అదే 'స్వాతంత్ర్యం' అని మోదీ చెప్పారు. ఇక తన విషయానికి వస్తే.. 'దేశం ముందు' అన్నదే తన సిద్ధాంతమని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా పాత ఆలోచనలను పక్కనపెట్టి, ఎప్పటికప్పుడు కొత్తవాటికి చోటిస్తానని తెలిపారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేలా ఒక బృందాన్ని రూపొందించుకోవాలన్నారు. తాను విజయవంతమవడానికి తన బృందమే కారణమని చెప్పారు.

### తప్పనిసరిగా మాట్లాడాల్సి వచ్చింది..

తాను విలక్షణ రాజకీయ నాయకుడిని కాదని మోదీ చెప్పారు. పరిపాలనపైనే తాను ఎక్కువ సమయం వెచ్చిస్తానని తెలిపారు. "ఎన్నికల సమయంలో నేను రాజకీయ ప్రసంగాలు చేశా. అది తప్పనిసరి పరిస్థితి. నాకు నచ్చకపోయినా అలా మాట్లాడాల్సి వచ్చేది. ఎన్నికలు అయిపోయిన తర్వాత నా సమయం అంతా పరిపాలన కోసమే వెచ్చిస్తా. ఇక అధికారంలో లేని సమయంలో నా దృష్టి మొత్తం సంస్థాగత పనులపైనే ఉంటుంది" అని మోదీ పేర్కొన్నారు. తానెప్పుడూ సవాళ్లను ఇష్టపడతానని, ఒక గిరి గీసుకొని అందులో హాయిగా గడపడం తనకు నచ్చదని చెప్పారు. తన గురించి ఎప్పుడూ ఆలోచించుకోనని, రిస్క్ తీసుకోవడానికే ప్రాధాన్యమిస్తానని తెలిపారు. తొలి రెండు పర్యాయాలు తాను ప్రారంభించిన అభివృద్ధి పనులను చూసి ప్రధానిగా తన పనితీరును అంచనా వేసుకునేవాడినన్నారు. మూడోసారి బాధ్యతలు స్వీకరించిన తర్వాత తన ఆలోచనలు మారిపోయాయన్నారు. 2047 కల్లా దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చాలన్నదే తన లక్ష్యమని తెలిపారు.

### సాధారణ విద్యార్థిని..

మోదీ బాల్యం గురించి కామత్ అడగ్గా.. తానో సాధారణ విద్యార్థినని చెప్పారు. ఏ విషయంపైనా తాను పెద్దగా శ్రద్ధ పెట్టేవాడిని కాదన్నారు. అయితే భేల్జీభాయ్ చౌదరి అనే టీచర్ తనను ఎంతగానో ప్రోత్సహించేవారని మోదీ గుర్తుచేసుకున్నారు. ఆయన ఒక రోజు మా నాన్నతో 'మీ అబ్బాయి చాలా ప్రతిభావంతుడు. కానీ, దృష్టి పెట్టడు' అని చెప్పారని తెలిపారు.

### నన్ను నేను నియంత్రించుకున్నా..

"ఫిబ్రవరి 24, 2002లో నేను తొలిసారి సీఎంగా గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టా. మూడు రోజుల తర్వాత ఫిబ్రవరి 27న గోద్రా ఘటన జరిగింది. రైలుకు నిప్పు పెట్టినట్లు తొలుత మాకు సమాచారం వచ్చింది. ఆ తర్వాత అల్లర్లు, మృతుల సమాచారం వచ్చింది. అప్పుడు సభలో ఉన్న నేను ఎంతగానో ఆందోళన చెందా. వెంటనే గోద్రాలో పర్యటిస్తానని చెప్పా. అప్పుడు ఒక్క హెలికాప్టర్ మాత్రమే ఉంది. అది సింగిల్ ఇంజన్ హెలికాప్టర్ అని, వీఐపీలను అందులో ప్రయాణించడానికి అనుమతించబోమని అధికారులు చెప్పారు. ఏం జరిగినా నాదే బాధ్యత అని వారితో వాదించా. వెంటనే గోద్రా వెళ్లా. అక్కడ మృతదేహాలు, హృదయవిదారకమైన దృశ్యాలు చూసి చలించిపోయా. కానీ, నేను సీఎం హోదాలో ఉండడంతో భావోద్వేగాలను అదుపులో పెట్టుకోవాల్సి వచ్చింది. నన్ను నేను నియంత్రించుకోవడానికి ఎంతో చేయాల్సి వచ్చింది" అని మోదీ చెప్పారు.

### నన్నో సీఎంగానే చూశారు..

బాల్యమిత్రుల గురించి కామత్ ప్రశ్నించగా.. "నేను చాలా చిన్న వయసులోనే ఇంటిని, ఇతర బంధాలను వదిలేశా. జీవితంలో ఎక్కువ భాగం తిరుగుతూనే ఉండడంతో అందరితో సంబంధాలు తెగిపోయాయి. నేను ముఖ్యమంత్రిని అయిన తర్వాత చిన్ననాటి మిత్రులను సీఎం బంగ్లాకు ఆహ్వానించా. ఏళ్ల కిందట ఊళ్లో వారితో ఎలా ఉన్నానో, ఇప్పటికీ అలాగే ఉన్నా చెప్పేందుకే వారిని పిలిచా. దాదాపు 30-35 మంది వచ్చారు. కలిసి భోజనం చేశాం, పాత రోజుల గురించి మాట్లాడుకున్నాం. కానీ, వారితో గడిపిన సమయాన్ని ఆస్వాదించలేకపోయా. ఎందుకంటే నేను స్నేహితుల కోసం చూశా.. వారు మాత్రం నన్నో సీఎంగానే చూశారు" అని మోదీ పేర్కొన్నారు.

## లోకం తీరు




# నేలమ్మను సింగారించెను ముగ్గమ్మ!

## కన్నుల పండుగగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' తెలంగాణ ముగ్గుల పోటీ ఫైనల్స్

హైదరాబాద్ సిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): చుక్కల వరుస.. నేలంతా పరుచుకొని చక్కని ముగ్గయింది! చూపు.. మనసూ తనవైపు లాక్కొని కదలనీయనంటూ కాళ్లకూ బంధాలేసింది! మేమూ తీరొక్క రంగులనద్దుకొని నేలను సింగారించాం అంటూ ఇంకొన్ని ముగ్గులు సైగ చేశాయి! ఆవైపూ చూస్తే.. ఒకటికి వింంచి మరొకటి.. అన్ని రంగవల్లులూ కళ్లను కట్టిపడేశాయి. గొబ్బెమ్మలు, చెరుకు ముక్కలు అద్దుకొని సంక్రాంతి శోభను ముందే తెచ్చాయి! 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్ట్‌నర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్ట్‌నర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) తెలంగాణ రాష్ట్రస్థాయి ఫైనల్స్ శుక్రవారం హైదరాబాద్ సనత్‌నగర్ జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో జరిగాయి. ముఖ్య అతిథిలుగా సినీనటి వైష్ణవీ చైతన్య, సినీనటుడు వడ్లమాని సత్యసాయి శ్రీనివాస్ హాజరయ్యారు. ప్రథమ విజేతగా హైదరాబాద్‌కు చెందిన మాదురి నేమ, ద్వితీయ విజేతగా ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఎస్.హేమలత, కరీంనగర్ జిల్లాకు చెందిన కె.లహరి, ఖమ్మం జిల్లాకు చెందిన ఆర్. లక్ష్మీప్రవంతి నిలిచారు. ప్రథమ విజేతకు రూ.30వేల చెక్కు.. ద్వితీయ విజేతలకు రూ.10వేల చొప్పున, మిగిలిన ఆరుగురికి రూ.3వేల చొప్పున చెక్కులు అందజేశారు. విజేతలకు బహుమతులను వైష్ణవీ చైతన్య, వడ్లమాని సత్యసాయి శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ వక్కలంక రమణ, ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ ఇన్‌చార్జి, అసిస్టెంట్ ఎడిటర్ కృష్ణ ప్రసాద్, ఆంధ్రజ్యోతి అడ్వర్టైజ్‌మెంట్ డీజీఎం ఆర్.ఆర్ నాయుడు, సంతూర్ ఏపీ, తెలంగాణ రీజనల్ సేల్స్ మేనేజర్ నాగరాజు, సంతూర్ హైదరాబాద్ ఏరియా మేనేజర్ సంజీవ్ మోదీ తదితరులు పాల్గొన్నారు.



ప్రథమ బహుమతి విజేతకు చెక్కును అందజేస్తున్న వైష్ణవీ చైతన్య, వడ్లమాని సత్యసాయి శ్రీనివాస్ తదితరులు



ప్రథమ బహుమతి గెలుచుకున్న ముగ్గు ఇదే..

### ఏపీలో ముగ్గుల పోటీ ఫైనల్స్ నేడే

విజయవాడ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్ట్‌నర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్ట్‌నర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) తుది అంకానికి చేరుకున్నాయి. తుది విజేతలు ఎవరో తేల్చే ఫైనల్స్ శనివారం విజయవాడలో జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగాను, తమిళనాడు, కర్ణాటకల్లోను సుమారు 40 కేంద్రాల్లో ప్రాథమిక స్థాయి ముగ్గుల పోటీలు ఈ నెల 3, 4, 5, 6 తేదీల్లో జరిగాయి. ఆరు వేల మంది మహిళలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతి కేంద్రంలో ప్రథమ స్థానం సాధించిన వారినుంచి 15 మంది ఫైనల్స్‌కు ఎంపికయ్యారు. వీరంతా విజయవాడలో జరిగే ఫైనల్స్‌లో పోటీ పడనున్నారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.30,000, మూడు ద్వితీయ బహుమతులు రూ.10,000 చొప్పున అందజేస్తారు. మరో ఆరుగురికి కన్సొలేషన్ బహుమతులు ఉంటాయి. పోటీల్లో పాల్గొనే అందరికీ స్పాన్సర్ల నుంచి గిఫ్ట్ హ్యాంపర్లు కూడా లభిస్తాయి. కొందరు సినీ, రాజకీయ, అధికార ప్రముఖులు ఈ ఫైనల్స్‌కు హాజరై విజేతలకు బహుమతి ప్రదానం చేస్తారు.

# కుంభకోణాల్లో వైసీపీ రికార్డులు



కుగ్రామాల వారు అవస్థలు పడుతుంటే 500 కోట్లతో ప్యాలస్ కట్టుకున్నారు

ప్రజలకు చాకిరీ చేసేందుకే వచ్చా

పిఠాపురం సభలో పవన్‌కల్యాణ్

సంక్రాంతి వేడుకల్లో చిన్నారులపై భోగి పండ్లు వేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

కాకినాడ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కుంభకోణాల్లో గత వైసీపీ ప్రభుత్వం రికార్డులు సృష్టించిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా ఏజెన్సీలో 414 కుగ్రామాల ప్రజలు ఆస్పత్రులకు డోలీలు కట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ ఇబ్బందులను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తే రూ.39 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. కానీ, గత వైసీపీ పాలనలో విశాఖలో రూ.500 కోట్లతో ప్యాలస్ కట్టుకున్నారని.. ఏకంగా రూ.2 నుంచి రూ.3 కోట్ల వ్యయంతో బాత్‌రూమ్‌లు నిర్మించుకున్నారని దుయ్యబట్టారు. చిన్నపాటి రోడ్డును కూడా నిర్మించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ అయిదేళ్ల పాలనలో కుంభకోణాల్లో రికార్డులు సృష్టించిందని తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో పవన్ శుక్రవారం పర్యటించారు. కుమారపురం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 12,500 చిన్నస్థాయి గోకులాలను ఆయన ప్రారంభించారు. అనంతరం పిఠాపురం బహిరంగసభలో ప్రసంగించారు. ఆయన ఏమన్నారంటే.. గత వైసీపీ ప్రభుత్వంలో అలవాట్లు ఇంకా కొంతమంది అధికారులకు పోలేదు. కొందరు నిర్లక్ష్యంగా ఉంటున్నారు. నాకు పనిచేయడం తప్ప వేరేది తెలియదు. పిఠాపురంలో ప్రజలు ఇచ్చిన విజయంతో కూటమి ప్రభుత్వం ద్వారా ప్రధాని మోదీ రాష్ట్రానికి రూ.2.08లక్షల కోట్ల పెట్టుబడులు ఇచ్చారు. దీంతో పిఠాపురంలో ఈ సంక్రాంతి అద్భుతంగా జరపాలని, ఊరంతా పందిరి వేద్దామని అనుకున్నాం. కానీ, తిరుపతి ఘటనతో ఇలా కష్టసమయంలో స్థాయి తగ్గించి చేద్దామని పాఠశాలలకే పరిమితం చేశాం. స్టార్‌డమ్ వదులుకుని నేను ఒకటిన్నర దశాబ్దంగా నలిగిపోతూ ఫలితం ఆశించకుండా పోరాటం చేశా. ఎన్నో ఎదురుదెబ్బలు తగిలాయి. ఆ గాయాలకు ప్రజలు విజయంతో మందు పోశారు. నా తండ్రి జీతంగా తీసుకున్న డబ్బులతో ఎదిగిన వాళ్లం మేమంతా. అందుకే అన్నమయ్య జిల్లాలో ఎంపీడీవోపై దాడి జరిగితే కన్నతండ్రిపై దాడి జరిగితే కన్నకొడుకు ఎలా స్పందిస్తాడో అలా స్పందించా. రాజకీయాల్లోకి నేను గొడ్డు చాకిరీ చేయడానికి వచ్చా. 26 జిల్లాలు తిరగాలని అనుకున్నా. ఇంటిని శుభ్రం చేసిన తర్వాత రాష్ట్రం సంగతి చూద్దామని.. పిఠాపురం నుంచే నా యాత్ర మొదలుపెడతా. పిఠాపురంలో ఈవ్‌టీజింగ్ పెరిగింది. ఆడపిల్లలను ఏడిపిస్తే తొక్కి నార తీస్తా.

# ఆ 'భూ సేకరణ'ను తేల్చండి

(మొదటి పేజీ తరువాయి)

భూమిని వాడారు. అదనంగా మరో 32వేల ఎకరాల ప్రైవేటు భూమిని కొనుగోలు చేశారు. ఇందుకోసం 18వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చుపెట్టారు. అయితే, భూ సేకరణలో భారీ గోల్‌మాల్ జరిగినట్టు అప్పట్లోనే కలకలం రేగింది. తొండలు గుడ్లుపెట్టని భూములు, కనీసం పంటకు ఏమాత్రం రాని బీడు భూములను వైసీపీ నేతలు కారుచౌకగా కొని ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ధరలకు అంటగట్టారు. ఈ ప్రక్రియకు నాటి రెవెన్యూశాఖ అధికారులు, కొందరు కలెక్టర్లు, ఆర్డీవోలు, ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించారు. ఎకరా రెండు లక్షలు చేయని భూమిని వైసీపీ నేతలు కొని, దాన్నే ప్రభుత్వానికి రెండు కోట్ల చొప్పున అంటకగట్టిన ఉదంతాలు కోకొల్లలు. పరిహారం ముసుగులో వైసీపీ నేతలు కోట్లాది రూపాయలు దండుకున్నారు. రెవెన్యూశాఖలో నాటి ఓ కీలక అధికారి, ఎనిమిది మంది ఐఏఎస్ అధికారులు ( కలెక్టర్. జేసీ), 28 మంది ఆర్డీవోల (డిప్యూటీ కలెక్టర్) పాత్రపై అనేకానేక ఆరోపణలు వచ్చాయి. నాటి జగన్ మంత్రులు, కొందరు ఎంపీల పాత్రపై అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి.

### ఇదీ నేపథ్యం..

కూటమి ప్రభుత్వం వచ్చాక జగనన్న ఇంటిస్థలాల రిపోర్టులను పరిశీలన చేయగా, నేటికీ 9 లక్షల మంది లబ్ధిదారులు ఇంటిపట్టాలు తీసుకోలేదు. జగన్ చెప్పిన 30 లక్షల జాబితాలోనిదే ఈ సంఖ్య. ఇదిగాక, మరో 3.64 లక్షల మంది అనర్హులకు కూడా ఇంటి పట్టాలు ఇచ్చారన్న ఫిర్యాదులు ఉన్నాయి. వీటిపై క్షేత్రస్థాయిలో ప్రాథమిక విచారణ చేసినప్పుడు భూముల కొనుగోలులో జరిగిన అక్రమాలు బయటపడ్డాయి. దీనిపై ఇటీవలే గృహనిర్మాణశాఖ, విజిలెన్స్ విభాగాలు ప్రభుత్వానికి నివేదించాయి. ఈ నేపథ్యంలో ఇక ఈ అంశంపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రభుత్వం....విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఆదేశించింది.

### షాక్ ఇచ్చిన 'విశాఖ' నివేదిక

గతంలో జరిగిన భూమి రికార్డుల పునఃపరిశీలన కార్యక్రమంలో కొందరు కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు విచారణ బృందాలకు సహకరించలేదు. అవసరం ఉన్న నివేదికలు అందించలేదు. దీంతో కీలకమైన విశాఖ జిల్లాలో అసైన్డ్, గ్రామకంఠం భూముల విషయంలో ఎలాంటి అక్రమాలు జరగలేదని, అత్యంత పారదర్శకంగానే రికార్డులున్నాయని నివేదికలు ఇచ్చారు. అసలు అక్రమాలకు విశాఖ జిల్లానే అడ్డాగా ఉందని ప్రభుత్వం భావిస్తుంటే, అక్కడ ఏ తప్పు జరగలేదని ఆ జిల్లా కలెక్టర్ నివేదికలు పంపడం ప్రభుత్వాన్ని షాక్‌నకు గురిచేసింది. ఈ అనుభవం నేపథ్యంలో జగనన్న ఇంటిస్థలాలపై జరిగే విచారణకు ప్రతి కలెక్టర్, రెవెన్యూ అధికారి అంటే... ఆర్డీవో, తహసిల్దార్, ఇతర అధికారులు సహకరించాలని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా ఆదేశాలు జారీ చేశారు. "జగనన్న ఇంటిస్థలాల కాలనీల కోసం 2019-2024 కాలంలో జరిగిన భూ సేకరణపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అయితే, విచారణలో క్రియాశీలకంగా పాల్గొంటున్న అధికారులకు సరైన సమాచారం, సహకారం అందించాలి. వారు కోరిన డాక్యుమెంట్లు, నివేదికలు అందించాలి. ఈ విషయంలో ఏ అధికారి అయినా విజిలెన్స్‌కు సహకరించకపోయినా, ఉద్దేశపూర్వకంగా సహాయనిరాకరణకు దిగినా కఠినచర్యలు తప్పవు" అని సిసోడియా తన ఆదేశాల్లో హెచ్చరించారు.

## 'గాలి' కేసులో 4 నెలల తుది గడువు

న్యూఢిల్లీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డిపై 2011లో నమోదైన అక్రమ మైనింగ్ కేసులో విచారణను ముగించేందుకు ట్రయల్ కోర్టుకు సుప్రీంకోర్టు తుది గడువు ఇచ్చింది. 4 నెలల్లో విచారణ పూర్తి చేయాలని.. ఇదే చివరి అవకాశమని.. ఇక గడువు పొడిగించేది లేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ రాజేశ్ బిందాల్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది.

## ఉత్తరాంధ్రలో ఏవియేషన్ హబ్.. సీఎస్ ఉత్తర్వులు

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలోని భోగాపురం విమానాశ్రయం సమీపంలో ప్రపంచస్థాయి ఏవియేషన్ హబ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2047 విజన్ డాక్యుమెంట్ ప్రతిఫలించేలా.. 2203 ఎకరాల్లో ఏవియేషన్ హబ్‌ను విస్తరించాలని భావిస్తోంది. దీనిలో భాగంగా రాష్ట్ర ఆర్థిక, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక శాఖ మంత్రులతో కమిటీని నియమిస్తూ సీఎస్ కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

## అరెస్ట్ నుంచి రక్షణ కల్పించలేం

» తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డికి హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సాక్షిపత్రిక, చానల్‌కు అనుచిత లబ్ధి చేకూర్చారనే ఆరోపణలతో ఏసీబీ నమోదు చేసిన కేసులో అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలన్న సమాచార పౌరసంబంధాల శాఖ మాజీ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. తొందరపాటు చర్యలు తీసుకోకుండా కనీసం వారం రోజులైనా పోలీసులను నిలువరించాలన్న విన్నపాన్ని తిరస్కరించింది. ఈదశలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని, వ్యాజ్యంపై ఈనెల 21న తుది విచారణ జరుపుతామని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది మహేశ్వరరెడ్డి, ఏసీబీ తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు.



మంత్రి లోకేశ్‌కు విరాళం చెక్‌ను అందజేస్తున్న శ్రీరామ్ భాస్కర్

## అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.10 లక్షల విరాళం

అమరావతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ల కోసం విరాళాలు అందించేందుకు పలువురు దాతలు ముందుకొస్తున్నారు. గుంటూరుకు చెందిన మాదాల శ్రీరామ్ భాస్కర్ అన్నక్యాంటీన్ల నిర్వహణ కోసం రూ.10 లక్షల విరాళం అందించారు. మంత్రి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని నివాసంలో కలిసి ఆయనకు విరాళం చెక్ అందజేశారు. పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లకు చేయూత అందించేందుకు ముందుకొచ్చిన శ్రీరామ్ భాస్కర్‌ను ఈ సందర్భంగా లోకేశ్ అభినందించారు.



వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీవారి ఆలయం లోపల విశేషాలంకరణ

## తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభం

తిరుమల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం వేకువజాము నుంచి తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలు మొదలయ్యాయి. గురువారం అర్ధరాత్రి 12.05 గంటలకు ఆలయాన్ని తెరిచిన అర్చకులు ధనుర్మాస కైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుక్రవారం వేకువజాము 3.50 గంటల నుంచి ఉదయం 8.15 గంటల వరకు వీఐపీలకు వైకుంఠద్వార దర్శనాలు చేయించారు. ఆ తర్వాత సర్వదర్శన భక్తులను అనుమతించారు. స్లాట్లవారీగా అర్ధరాత్రి వరకు వైకుంఠద్వార దర్శనాలను కల్పించారు. ఇక, వైకుంఠ ఏకాదశి అయినప్పటికీ తిరుమలలో మోస్తరుగానే భక్తుల రద్దీ కొనసాగింది. ఏకాదశి సందర్భంగా ఉదయం స్వర్ణరథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి స్వర్ణరథంలో కొలువుదీరి మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇక, శ్రీవారి ఆలయం ముందు ఎక్కడికక్కడ గేట్లు వేయడంతో చిన్నపిల్లలు, వృద్ధులు ముందుకు వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. శనివారం ద్వాదశి సందర్భంగా పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించనున్నారు.

## చిన వెంకన్న సేవలో జస్టిస్ గోపాలకృష్ణారావు



జస్టిస్ గోపాలకృష్ణారావుకు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న డిప్యూటీ ఈవో

ద్వారకాతిరుమల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు శుక్రవారం సందర్శించారు. ఉత్తర ద్వారదర్శనం అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖమండపంలో అర్చకులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనాన్ని అందజేశారు. ఆలయ డిప్యూటీ ఈవో బాబూరావు ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.



తిరుమల ఆలయం ముందు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ రాజశేఖర్ రావు, జస్టిస్ శేఖర్, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి, జస్టిస్ మల్లికార్జునరావు,జస్టిస్ బీవీ కృష్ణమోహన్, జస్టిస్ సుజాత, జస్టిస్ చీమలపాటి రవి

### శ్రీవారి సేవలో సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రాజశేఖర్ రావు, జస్టిస్ టీసీడీ శేఖర్, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి, జస్టిస్ మల్లికార్జునరావు, జస్టిస్ బీవీ కృష్ణమోహన్, జస్టిస్ సుజాత, జస్టిస్ చీమలపాటి రవి, మాజీ న్యాయమూర్తులు జస్టిస్ కృష్ణమోహన్‌రెడ్డి, జస్టిస్ ఏవీ శేషసాయి స్వామివారిని దర్శించుకున్నారు.

# ఐదు దశల్లో నవోదయం 2.0

- ఆరు నెలల్లో సారా రహిత రాష్ట్రం
- షెడ్యూలు ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ

అమరావతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని సారా రహితంగా మార్చేందుకు ప్రభుత్వం నూతన కార్యాచరణ ప్రారంభించింది. గత తెలుగుదేశం ప్రభుత్వంలో సారాపై నవోదయం పేరుతో సారా నిర్మూల న కార్యక్రమం అమలు చేయగా, ఇప్పుడు నవోదయం 2.0 పేరుతో మళ్లీ కార్యక్రమాన్ని అమలుచేయబోతోంది. నవోదయం 2.0 కార్యక్రమం షెడ్యూలు ఖరారు చేస్తూ ఎక్సైజ్ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా శుక్రవా రం ఉత్తర్వులు జారీచేశారు. మొత్తం ఐదు దశల్లో ఈ కార్యక్రమం అమలుచేస్తారు. సంక్రాంతి తర్వాత ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

### ప్రజల్లో అవగాహన

మొదటి దశలో సారా ప్రభావిత గ్రామాలను సందర్శించి గ్రామ సభలు నిర్వహిస్తారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలను భాగస్వాములను చేసి సారా దుష్పరిణామాలను వివరిస్తారు. సారాపై ఆధారపడి జీవిస్తున్న వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పిస్తారు. అలాగే బెల్లం ఉత్పత్తిదారులతో సమావేశాలు నిర్వహించి నాటుసారాకు బెల్లం సరఫరా చేయొద్దని కోరతారు. 14405 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేస్తారు. ఈ దశ రెండు నెలల పాటు ఉంటుంది.

### సారా స్థావరాలపై దాడులు

రెండో దశలో నాటుసారా స్థావరాలు, గుర్తించిన గ్రామాలపై దాడులు నిర్వహిస్తారు. సారా, బెల్లం ఊటను ధ్వంసం చేస్తారు. ప్రతి కేసులో పట్టుబడిన వారితో పాటు వెనుక ఎవరున్నారు? అనేది వెలికి తీసే ప్రయత్నం చేస్తారు. దారులు లేని, వెళ్లలేని గ్రామాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తారు. ఎక్కడైనా భారీగా బెల్లం అమ్మితే వాటిపై నిఘా పెడతారు. సారాకు బెల్లం సరఫరా చేసే వ్యాపారులనూ బాధ్యులను చేస్తారు. కేవలం సారా అమ్మకాలు చేసే గ్రామాల్లో రవాణా చేసే వారిని ఈ కేసులకు బాధ్యులుగా చేరుస్తారు. ఈ దశ రెండు నెలలు ఉంటుంది.

### ప్రత్యామ్నాయ జీవనోపాధి

సారా రహితంగా మార్చిన గ్రామాల్లో తదుపరి చర్యలు ప్రారంభిస్తారు. భవిష్యత్తులోనూ సారా తయారుచేయకుండా నిరంతర పర్యవేక్షణ ఉంచున్నారు. మళ్లీ గ్రామ సభలు నిర్వహించి సారా వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తారు. జిల్లా కలెక్టర్ సారా తయారీదారులకు ప్రత్యామ్నాయ జీవనోపాధిపై పథకాలు అమలుచేస్తారు. నైపుణ్య శిక్షణ, చిన్న స్థాయి వ్యక్తిగత, గ్రూపు వ్యాపార అవకాశాలు కల్పిస్తారు. రెండు నెలల కాల వ్యవధిలో ఈ కార్యక్రమాలు పూర్తిచేస్తారు.

### సారా రహిత గ్రామాలుగా ప్రకటన

కనీసం రెండు నెలలపాటు ఒక్క సారా కేసు కూడా నమోదుకాని గ్రామాలను సారా రహిత గ్రామాలుగా ప్రకటిస్తారు. ఐదో నెల నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. దీనిపై గ్రామసభ నిర్వహించి ప్రజలు, రెవెన్యూ, పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారుల సమక్షంలో తీర్మానం చేస్తారు. గ్రామాలను సారా రహితంగా ప్రకటించిన తర్వాత జిల్లాను సారా రహిత జిల్లాగా ప్రకటిస్తారు. ఇక, ఆర్నెల్ల కాలంలో రాష్ట్రాన్ని సారా రహితంగా ప్రకటించి, ఆ తర్వాత కూడా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తారు.

# మోదీ లక్ష్యం.. వికసిత్ భారత్

- కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి
- 'నాసిన్'లో ఘనంగా ఐఆర్ఎస్‌ల పాసింగ్ అవుట్ పరేడ్

హిందూపురం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): 2047 నాటికి వికసిత్ భారత్ సాధించడమే ప్రధాని నరేంద్రమోదీ లక్ష్యమని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామ సమీపంలోని 'కస్టమ్స్, పరోక్ష పన్నులు, నార్కొటిక్స్ జాతీయ అకాడమీ (నాసిన్)'లో 74వ ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) అధికారుల పాసింగ్ అవుట్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పంకజ్ చౌదరి మాట్లాడుతూ ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం ప్రగతి బాటలో పయనిస్తోందన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ ద్వారా దేశ దశ, దిశ మార్చడమే లక్ష్యమన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఐఆర్ఎస్‌లు దేశ నలుమూలల సేవలు అందించేందుకు సంసిద్ధులు కావాలని సూచించారు.

## విదేశీ భవన్, వలస వనరుల కేంద్రం కేటాయించండి

- కేంద్ర మంత్రులు జైశంకర్, శోభాకరంద్లాజేకు మంత్రి కొండపల్లి విజ్ఞప్తి

రాష్ట్రానికి విదేశీ భవన్, వలస వనరుల కేంద్రాలను మంజూరు చేయాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, ఎన్ఆర్ఐ వ్యవహారాలశాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కేంద్ర మంత్రులను కోరారు. భువనేశ్వర్‌లో రెండ్రోజులపాటు నిర్వహించిన 'ప్రవాస భారతీయ దివస్' కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా మంత్రి శ్రీనివాస్ హాజరయ్యారు. అక్కడ విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఎస్.జైశంకర్, కేంద్ర ఎంఎస్ఎంఈ, కార్మిక ఉపాధి కల్పన శాఖల సహాయ మంత్రి శోభాకరంద్లాజెతో విడివిడిగా చర్చలు జరిపారు. రాష్ట్రంలో వలస వనరుల కేంద్రాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తామని జైశంకర్ హామీ ఇవ్వగా.. రాష్ట్రాభివృద్ధికి తగిన సహాయ సహకారాలు అందిస్తామని శోభాకరంద్లాజే హామీ ఇచ్చినట్టు శ్రీనివాస్ తెలిపారు.



## 'ఫన్ బకెట్' భార్గవ్‌కు 20 ఏళ్లు జైలు

- బాలికపై అత్యాచారం కేసులో పోక్సో కోర్టు తీర్పు

పెందుర్తి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వెబ్ సిరీస్‌లో అవకాశం కల్పిస్తానంటూ బాలికను మభ్యపెట్టి అత్యాచారానికి పాల్పడిన యూ ట్యూబర్, ఫన్ బకెట్ భార్గవ్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.4 లక్షల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు శుక్రవారం తీర్పు చెప్పింది. విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన భార్గవ్ టిక్ టాక్ వీడియోలతో గుర్తింపు పొందాడు. ఈ క్రమంలో విశాఖ జిల్లా పెందుర్తి మండలానికి చెందిన 14 ఏళ్ల బాలిక అతనికి పరిచయమైంది. వెబ్ సిరీస్‌లో అవకాశాలు కల్పిస్తానంటూ ఆమెకు ఆశ చూపించి శారీరకంగా లోబరుచుకున్నాడు. బాలికలో వచ్చిన శారీరక మార్పులను తల్లి గుర్తించి వైద్యులకు చూపించగా నాలుగు నెలల గర్భవతి అని తేలింది. దీంతో బాలిక తల్లి 2021 ఏప్రిల్ 16న పెందుర్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దిశ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. విశాఖ దిశ స్టేషన్ ఏసీపీ కాజల్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరిగింది.


























ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# ప్రకృతి హెచ్చరిక!

హిమాలయ దేశాలు టిబెట్, నేపాల్‌ను ఇటీవల కుదిపేసిన భారీ భూకంపం పెద్దసంఖ్యలో ప్రజల ప్రాణాలను హరించింది, తీవ్ర ఆర్థిక నష్టాన్ని మిగిల్చింది. టిబెట్‌లో మరణాలసంఖ్య విషయంలో చైనా మీడియా చెబుతున్న నూటయాభైలోపు లెక్కలనే మనం నమ్మాలి కానీ, తీవ్రతను బట్టి చూస్తే ఆ సంఖ్య అనంతరకాలంలో కచ్చితంగా మరింత పెరిగే ఉంటుంది. రిక్టర్ స్కేల్‌మీద 7.1 తీవ్రతతో పదికిలోమీటర్ల లోతున పుట్టిన ఈ భూకంపం నేపాల్‌ను వొణికించింది, బిహార్‌ను భయపెట్టింది, చివరకు దేశరాజధాని ఢిల్లీ సైతం ఆ ప్రకంపనలను భరించింది. భూకంప కేంద్రంనుంచి వందలాది కిలోమీటర్ల వరకూ ఆ ప్రభావం కనిపించింది. వెంటవెంటనే సంభవించిన మరో రెండు అతి పెద్ద కుదుపులు సైతం జనాన్ని భయపెట్టాయి. భారతదేశానికి సన్నిహితంగా భూకంప కేంద్రం ఉండివుంటే, ఆర్థిక, ప్రాణనష్టాలు అధికంగా ఉండేవనడానికి సందేహం అక్కరలేదు. ప్రపంచంలో అతిపెద్ద జల విద్యుత్ కేంద్రాన్ని బ్రహ్మపుత్రమీద నిర్మించబోతున్నట్టు ప్రకటించిన వెంటనే టిబెట్‌లో సంభవించిన ఈ భూకంపం చైనా కళ్ళు తెరిపించాలన్నది పర్యావరణ వేత్తల కోరిక.

త్రీగోర్జెస్ డ్యామ్‌కు మూడురెట్ల భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు బ్రహ్మపుత్రమీద ప్రకటించి, దానికి 137 బిలియన్ డాలర్లు ఖర్చుచేయబోతున్నట్టు చైనా ఇటీవల చేసిన ప్రకటన భారత్‌కు తీవ్ర ఆందోళన కలిగించింది. దీనిద్వారా అరవై గిగావాట్ల విద్యుత్ చైనాకు చేరవచ్చు, అందులో టిబెట్ వాటాలు కోటాలు ఉండవచ్చు కానీ, మనకు పట్టుమని పాతికకిలోమీటర్ల దూరంలో ఈ డ్యామ్ ఉండటం కచ్చితంగా భయపెట్టే అంశమే. ఈ ప్రాజెక్టు నిర్మించబోతున్న హిమాలయప్రాంతం భూకంపాలకు పుట్టినిల్లని చైనాకు తెలియకపోదు. ఇప్పటికే అక్కడ తాను నిర్మించిన జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో కనీసం మూడోవంతు భూకంప ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయని ఆరేళ్ళ క్రితం ఆ దేశం ఆదేశించిన అధ్యయనమే స్పష్టంచేసింది. కానీ, హిమాలయాల్లో ఉన్న అపార జలశక్తిని ఒడిసిపట్టి విద్యుత్‌ను సృష్టించాలన్న తపనతో భారత్, చైనాలు పోటీపడి జలవిద్యుత్ ప్రాజెక్టులను కట్టుకుంటూ పోతున్నాయి.

చిన్నచితకా కట్టడాలను అటుంచితే, భూకంపాలకు నిలయమైన చోట ఒక అతిభారీస్థాయి ప్రాజెక్టు కట్టాలని చైనా ఎలా అనుకుంటోందో అర్థం కాదు. 2015లో నేపాల్‌లో 9వేలమంది ప్రాణాలు హరించిన భూకంపం, దాదాపు ఐదోవంతు జలవిద్యుత్ ప్రాజెక్టులను ధ్వంసం చేసి, సుదీర్ఘకాలం నిరుపయోగంగా మార్చిన విషయం తెలిసిందే. ఇటువంటి గతానుభవాలు అనేకం ఉన్నప్పటికీ ఒక ప్రమాదకరమైన ప్రాంతంలో ఈ అతి భారీ నిర్మాణాన్ని ప్రకటించి, తన కొత్త విద్యుత్ ప్రాజెక్టుతో ఎవరికీ ఏ భయమూ అక్కరలేదని చైనా అభయం ఇవ్వడం ఆశ్చర్యకరం. ప్రాజెక్టును కూల్చేసే స్థాయి భూకంపం వస్తేగిస్తే నష్టపోయేది భారత్, బంగ్లాదేశ్‌లే కదా అని అది అనుకుంటున్నదేమో. ఇప్పటికే ఉన్న రిజర్వాయర్లకు వయసు మీద పడుతున్నందున చైనా కొత్త వాటికోసం వెంపర్లాడుతున్నట్టుంది. కర్బన ఉద్గారాలను తగ్గించాల్సిన లక్ష్యం కూడా దానిని ఈ భారీ ప్రాజెక్టుకు వెంట తరుముతూండవచ్చు. ఇంధన అవసరాలు కాక, ఇతరత్రా ఉద్దేశాలేమీ లేకుంటే ఈ భారీ డ్యామ్ స్థానంలో పలు మధ్యతరహా హైడ్రోప్రాజెక్టులతో చైనా తన విద్యుత్ అవసరాలను సులువుగా తీర్చుకోగలదు. విద్యుత్ సృష్టికే కాక, ప్రతీకారం తీర్చుకోవడానికి కూడా ఈ డ్యామ్ ఉపకరిస్తుందేమోనన్న అనుమానం బ్రహ్మపుత్ర పరీవాహక దిగువదేశాలకు ఉండటంలో తప్పేమీ లేదు.

టిబెట్‌లో 1950లో 8.6 తీవ్రతతో సంభవించిన భూకంపం ఈ ప్రాంతం ఎంత సున్నితమైనదో, ప్రమాదకరమైనదో తెలియచెబుతుంది. ఆధునిక పరిజ్ఞానం ఎంతగా ఉపయోగించినా, ఈ ప్రాంతంలో ప్రాణ నష్టాన్ని, ఆస్తినష్టాన్ని నివారించడం అంతసులభం కాదని ఇప్పుడు టిబెట్‌లో సంభవించిన భారీ భూకంపం హెచ్చరిస్తోంది. భూకంప కేంద్రం, బ్రహ్మపుత్ర, ఈ ప్రాజెక్టు స్థలం సన్నిహితంగా ఉన్నాయంటూ పలుమ్యాప్‌లు తెలియచెబుతున్నాయి. ప్రాజెక్టుమీద భారతదేశం తన అభ్యంతరాన్ని వ్యక్తంచేసినప్పుడు, దాని భద్రత గురించి, ప్రమాణాల గురించి చైనా చాలా కబుర్లుచెప్పింది. ఎట్టిపరిస్థితుల్లోనూ ఎవరికీ నష్టంవాటిల్లనివ్వబోనని హామీ ఇచ్చింది. కానీ, అది ఎంత అద్భుతంగా, బలంగా ఈ ప్రాజెక్టు కట్టినప్పటికీ, కాళ్ళకింద భూమి సులువుగా కదిలిపోవచ్చునని ఈ భూకంపం హెచ్చరిస్తోంది.

---

# విశ్వవిద్యాలయాల జాతీయీకరణ!

అన్ని ప్రభుత్వాలూ వాస్తవంగా గరిష్ఠ అధికారాలను అపేక్షిస్తాయి. తమకు తాము మరిన్ని నియంత్రణాధికారాలను ఇచ్చుకునేందుకు చట్టాలు చేస్తాయి. ప్రభుత్వాలు ఎందుకు ఇలా ఆరాటపడతాయి? దేశానికి, ప్రజలకు ఏది మేలు చేస్తుందో తమకు మాత్రమే తెలుసునని విశ్వసించడమే ఆ ఆరాటానికి కారణం.

కొంతమంది వ్యక్తులకు అటువంటి విశ్వాసమే చాలా గాఢంగా ఉంటుంది. దాన్ని 'రక్షకుడు' లేదా మెస్సయ్య భావం అంటారు. అదొక మానసిక స్థితి. అటువంటి మనస్తత్వం ఉన్నవారు సమస్యలు అన్నిటినీ తానే పరిష్కరించగలనని, ప్రజలను తానే 'రక్షించ'గలనని విశ్వసిస్తారు. ఇది మితిమీరితే తాము జైవికంగా పుట్టలేదని 'భగవంతుడే తనను పంపాడు' అన్న విపరీత ఆలోచన లేదా భ్రాంతికి లోనవుతారు.

అసలు విషయానికి వస్తాను. వైస్ ఛాన్సలర్ల నియామకాలకు సంబంధించిన నియమ నిబంధనలను యూజీసీ (యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ – విశ్వవిద్యాలయ నిధుల సంఘం) మార్చివేసింది. వీసీల ఎంపిక ప్రక్రియకు సంబంధించిన కొత్త ముసాయిదా నిబంధనలను కూడా జారీ చేసింది. వాటిపై అభిప్రాయాలు, సలహాలు, సూచనలను ఆహ్వానించింది.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ప్రస్తుతం అనేక చట్టాలు ఒకటి లేదా అంతకంటే ఎక్కువ విశ్వవిద్యాలయాల స్థాపనకు అధికారాల నిస్తున్న అనేక చట్టాలు సంబంధిత రాష్ట్ర గవర్నర్‌ను విశ్వవిద్యాలయ ఛాన్సలర్‌గా చేస్తున్నాయి. కేంద్రీయ విశ్వవిద్యాలయాలను నెలకొల్పిన కొన్ని చట్టాలు రాష్ట్రపతిని విజిటర్‌గా నిర్దేశించాయి. సరే, రాష్ట్ర గవర్నర్ క్రియాశీల రాజకీయాల నుంచి నిష్క్రమించిన నాయకుడో లేక ప్రముఖ పౌరుడో అయి ఉండడం కద్దు. గవర్నర్ రాజ్యాంగ బద్ధంగా తన విధులు నిర్వర్తించాలి. వీసీల ఎంపికకు, ప్రస్తుత నిబంధనల ప్రకారం ఒక సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీని నియమిస్తారు. ఈ కమిటీలో గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వం, విశ్వవిద్యాలయ సెనేట్, విశ్వవిద్యాలయ సిండికేట్ నామినీ (ప్రతినిధి)లు ఉంటారు. ఈ కమిటీ విస్తృత ప్రాతిపదికన ప్రజాస్వామికంగా ఉంటుంది. అంతిమ ఎంపిక నిర్ణయం ఛాన్సలర్ / గవర్నర్‌దే అయినప్పటికీ గతంలో గవర్నర్ సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వ 'సహాయం, సలహా'పై నిర్ణయం తీసుకునేవారు. దురదృష్టవశాత్తు ఈ సదాచరణ గత దశాబ్దంలో అంతరించిపోయింది. గవర్నర్లు తమ వ్యక్తిగత విచక్షణతో వీసీలను నియమించడం ప్రారంభమయింది.

రోజులు మారిపోయాయి –మరింత అధ్వాన్నంగా! ఇప్పుడు గవర్నర్ పదవులలో ఆరెస్సెస్ / బీజేపీ భావజాల విధేయులు లేదా విశ్వసనీయ విశ్రాంత సివిల్ అధికారులు లేదా సైనికాధికారులను మాత్రమే నియమిస్తున్నారు.

ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో కేంద్ర ప్రభుత్వ వైస్రాయ్‌గా వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురి చేయాలని గవర్నర్‌ను ఆదేశిస్తున్నారు. పర్యవసానంగా రాష్ట్రాలలో ద్వంద్వ ప్రభుత్వం ఉంటోంది: ఎన్నికైన ప్రభుత్వం, ఎన్నిక కాని గవర్నర్. రాష్ట్ర గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వ 'సహాయం, సలహా'తో నిర్ణయాలు తీసుకోవాలన్న భారత రాజ్యాంగ నిబంధనను గాలికి వదిలివేస్తున్నారు. శాసనసభ సమావేశాల్లో సంప్రదాయం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రసంగాన్ని చదవడానికి నిరాకరిస్తున్న గవర్నర్లను చూడండి. రాష్ట్ర ప్రభుత్వాన్ని ముఖ్యంగా ముఖ్యమంత్రిని బహిరంగంగా విమర్శిస్తున్న గవర్నర్లను చూడండి. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి లేదా పోలీస్ చీఫ్‌ను రాజ్‌భవన్‌కు పిలిచి ముఖ్యమంత్రిని ఉపేక్షించి వారికి నేరుగా ఆదేశాలు ఇస్తున్న గవర్నర్లను చూడండి. రాష్ట్ర ప్రభుత్వ సచివాలయానికి తెలియజేయకుండా జిల్లాల్లో పర్యటిస్తూ జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ వారితో చర్చలు జరుపుతున్న గవర్నర్లను చూడండి. ఈ ఉదంతాలు స్పష్టం చేస్తున్నదేమిటి? రాష్ట్రాలలో ముఖ్యంగా ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ద్వంద్వ ప్రభుత్వం తనకుతానే నెలకొంటోందని కాదూ?



**వైస్ ఛాన్సలర్ల నియామకాలకు సంబంధించి యూజీసీ జారీ చేసిన ముసాయిదా నిబంధనలను రాష్ట్రాలు నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి. వాటికి వ్యతిరేకంగా రాజకీయంగా, న్యాయమార్గాలలో పోరాడాలి. ఉపాధ్యాయులు, విద్యార్థులు ముందుకువచ్చి నిరసనలు తెలపాలి. ప్రజా పాలన వ్యవస్థలు అన్నిటిలో ద్వంద్వ ప్రభుత్వం అనేది పాదుకుపోతే దాని స్థానంలో ఒక సంపూర్ణ నిరంకుశ పాలకుడు ప్రభవించేందుకు ఎంతో కాలం పట్టదు.**

'డిగ్రీ' అంటే యూజీసీ నిర్దేశించిన డిగ్రీయే అవుతుందని, ఒక చట్టం ద్వారా స్థాపితమైన విశ్వవిద్యాలయం దానిని ప్రదానం చేస్తుందని యూజీసీ చట్టంలోని సెక్షన్ 22 పేర్కొంది. కొత్త ముసాయిదా నిబంధనలు సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీ ఏర్పాటుకు, వీసీల నియామకానికి పద్ధతులను నిర్దేశించింది. ఈ కొత్త పద్ధతి ప్రకారం ఛాన్సలర్, యూజీసీ, అపెక్స్ బాడీ (విశ్వవిద్యాలయ సెనేట్/ సిండికేట్/ బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్) నామినీలతో కూడిన ముగ్గురు సభ్యుల సంఘంగా సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీ ఉంటుంది. ఇది 35 పేర్లతో కూడిన ఒక జాబితాను రూపొందిస్తుంది. ఆ జాబితా నుంచి ఒకరిని వీసీగా ఛాన్సలర్ నియమిస్తారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన విశ్వవిద్యాలయానికి వ్యతిరేకంగా డిగ్రీ ప్రోగ్రామ్‌లు ఆఫర్ చేయకుండా, యూజీసీ కార్యక్రమాలలో పాల్గొనకుండా ఆంక్షలు విధిస్తారు. అసలు యూజీసీ చట్టం కింద విశ్వవిద్యాలయాల జాబితా నుంచి దాన్ని తొలగిస్తారు. ఇతర శిక్షాత్మక చర్యలు కూడా దానికి వ్యతిరేకంగా తీసుకుంటారు.

మరింత స్పష్టంగా చెప్పాలంటే సదరు విద్యాసంస్థ విశ్వవిద్యాలయంగా అస్తిత్వంలో ఉండడం ఆగిపోతుంది. వైస్ ఛాన్సలర్ ఎంపిక, నియమాకంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి పాత్ర ఉండదన్న వాస్తవాన్ని గమనించారా? వైస్ ఛాన్సలర్ యూజీసీ వైస్రాయ్ అవుతాడు. యూజీసీ ఛైర్‌పర్సన్, ఇతర సభ్యులను కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది వారిని తొలగించే అధికారాలు కూడా దానికే ఉన్నాయి.

ఒక విశ్వవిద్యాలయ పరిపాలనకు ఇద్దరు వైస్రాయ్‌లు ఉంటారు. ఒకరు గవర్నర్ / ఛాన్సలర్ కాగా మరొకరు వైస్-ఛాన్సలర్. ముసాయిదా నిబంధనలను నోటిఫై చేసిన పక్షంలో జరిగేదేమిటి? రాష్ట్ర ప్రజల ప్రయోజనార్థం విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పి, సొంత ఆర్థిక వనరుల నుంచి దాని నిర్వహణకు నిధులు కేటాయించే రాష్ట్ర ప్రభుత్వ హక్కులను ఆ నిబంధనలు అపహరిస్తాయి.

మరింత స్పష్టంగా చెప్పాలంటే ముసాయిదా నిబంధనలు విశ్వవిద్యాలయాలను జాతీయీకరణ చేస్తాయి. దేశంలోని సమస్త ఉన్నత విద్యా సంస్థల నిర్వహణను 'మెస్సయ్య' తన నియంత్రణలోకి తీసుకుంటాడు. 'ఒక దేశం–ఒకే ప్రభుత్వం' అన్న భారతీయ జనతా పార్టీ విధానానికి అనుగుణంగా వ్యవస్థల శీఘ్రతర కేంద్రీకరణకు విశ్వవిద్యాలయాల జాతీయీకరణ మరో ఉదాహరణగా నిలుస్తుంది. సమాఖ్య విధానం, రాష్ట్రాల హక్కులపై ఇది చాలా ఘోరమైన దాడి కాదూ?

ఈ ముసాయిదా నిబంధనలను రాష్ట్రాలు నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి. వాటికి వ్యతిరేకంగా పోరాడాలి– రాజకీయంగా, న్యాయమార్గాలలో.. విశ్వవిద్యాలయాల జాతీయీకరణను వమ్ము చేసేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ముందుకువచ్చి నిరసనలు తెలపాలి. లక్ష్య పరిపూర్తి దాకా నిరంతర జాగరూకతతో ఉండాలి. ప్రజా పాలన వ్యవస్థలు అన్నిటిలో ద్వంద్వ ప్రభుత్వం అనేది సురక్షితమైతే దాని స్థానంలో రాజరికం లేదా ఒక నియంతృత్వ పాలకుడు ఉద్భవించేందుకు ఎంతో కాలం పట్టదు. కనుక ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

---

# మన్మోహన్: కాంతులు, కళంకాలు

'చరిత్ర తీర్పు తనపై చాలా ఉదారంగా ఉంటుందని' ఇటీవల కీర్తిశేషుడు అయిన డాక్టర్ మన్మోహన్ సింగ్ 2014లో ప్రధానమంత్రిగా తన చివరి పత్రికా గోష్ఠిలో ఉద్ఘాటించారు. ఆయన ఆత్మవిశ్వాసపూరిత వ్యాఖ్యను, అప్పట్లో మీడియా తన పట్ల వ్యవహరిస్తున్న తీరుపై ఒక పరోక్ష ఆక్షేపణగా అర్థం చేసుకోవచ్చు. మరి ఇప్పుడు అదే మీడియా మన్మోహన్ కీర్తిగానం బ్రహ్మాండంగా చేస్తోంది. వివిధ పత్రికలు, పలువురు ప్రముఖులు దివంగత ప్రధాన మంత్రికి అర్పించిన నివాళులు, చేసిన ప్రశంసలు చరిత్రకారుడు అయిన ఈ వ్యాసకర్తను చకితుడిని చేశాయి. ఆ పొగడ్తలు పూర్తిగా యోగ్యమైనవేనా? వాటిలో సత్యాసత్యాలు ఏమిటి? అన్న ప్రశ్నలను లేవనెత్తాయి. మన్మోహన్ నిజంగానే విజ్ఞుడా? సర్వజ్ఞుడా? ఉత్తమ రాజనీతిజ్ఞుడా?



akbar

మన్మోహన్ సింగ్ తన సుదీర్ఘ జీవితాన్ని ఒక విద్వజ్ఞుడుగా, ప్రభుత్వంలో ఒక ఆర్థికవేత్తగా, ఒక రాజకీయవేత్తగా గడిపారు. మరణానంతరం ఆయన గురించి వెల్లువెత్తిన ప్రశంసల్లో అత్యధిక భాగం ప్రభుత్వ ఆర్థికవేత్తగా ఉన్న దశపైనే కేంద్రీకృతమయ్యాయి. ముఖ్యంగా కేంద్ర ఆర్థికమంత్రిగా ఆయన నిరుపమాన సేవల గురించి అవి విపులంగా పేర్కొన్నాయి. నిజమే, లైసెన్స్– పర్మిట్– కోటా రాజ్‌ను కూల్చివేయడంలో మన్మోహన్ కీలకపాత్ర వహించారు. రాజ్యవ్యవస్థ శృంఖలాల నుంచి భారత ఆర్థిక వ్యవస్థను విముక్తం చేశారు దరిమిలా మూడు దశాబ్దాలుగా ఆర్థికాభివృద్ధి సుస్థిరంగా సాగుతోంది; పరిశ్రమల వ్యవస్థాపనా సామర్థ్యం ఇతోధికంగా పెరిగింది; కోట్లాది ప్రజలు పేదరికం కోరల నుంచి బయటపడ్డారు.

ఇది నిజంగా విశేష ప్రగతే. మన్మోహన్ దార్శనికత వల్లే అది సాధ్యమయిందని సరిగానే ఆయన్ను ప్రస్తుతిస్తున్నారు. అయితే మన్మోహన్ సాధించిన ఈ బృహత్ విజయం వెనుక ఆయనకు అప్పటి ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు అందించిన అచంచల తోడ్పాటు ఉందన్న విషయాన్ని ఎవరూ విస్మరించకూడదు. పార్లమెంటుకు ప్రజలు ఎన్నుకోని ఆర్థికవేత్తను కేబినెట్ మంత్రిగా నియమించిన ఘనత నిస్సందేహంగా పీవీదే. ప్రతిపక్షాల నుంచి, సొంత పార్టీలోని వ్యతిరేకుల నుంచి ఎదురైన కష్టనష్టాలను పీవీ మద్దతుతో మన్మోహన్ అధిగమించారు. మన్మోహన్‌తో కలిసి లేదా ఆయన మార్గదర్శకత్వంలో ప్రతిభావంతులు అయిన కొంతమంది ఆర్థికవేత్తలు, సివిల్ సర్వీస్ అధికారులు మన ఆర్థిక వ్యవస్థలో మౌలిక మార్పులు సాధించారు.

మన్మోహన్ సింగ్ యాదృచ్ఛికంగా ఆర్థికమంత్రి అయ్యారు. 1991లో రాజీవ్ హత్యానంతరం పీవీ ప్రధానమంత్రి అయ్యారు. విదేశీ మారక ద్రవ్య నిల్వలు పూర్తిగా అడుగంటిపోయాయి. ఆ క్లిష్ట పరిస్థితి నుంచి దేశాన్ని గట్టెక్కించేందుకు పీవీ తొలుత రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ ఐ.జి.పటేల్‌ను ఆర్థికమంత్రిగా నియమించేందుకు సంకల్పించారు. అయితే పటేల్ అందుకు నిరాకరించడంతో ఆర్థికమంత్రి అయ్యే అవకాశం మన్మోహన్‌కు లభించింది. విద్వజ్ఞుడుగా మన్మోహన్ ప్రత్యేకతలు పూర్తిగా ఆయన సొంతం. మన్మోహన్ సాధించిన విజయాల ప్రాముఖ్యతను గుర్తించేందుకు కేంబ్రిడ్జిలో ఆయన సమకాలికులు అయిన అమర్త్యసేన్, జగదీష్ భగవతి మేధో విజయాలతో వాటి తారతమ్యాలను చూడాలి. సేన్, భగవతి కులీన విద్వత్ కుటుంబాలలో జన్మించారు. సేన్ కుటుంబం రవీంద్రనాథ్ టాగోర్‌కు సన్నిహితులైన విద్వజ్జుల కుటుంబం నుంచి వచ్చారు. సేన్‌కు 'అమర్త్య' అని నామకరణం చేసింది కూడా టాగోరే కావడం విశేషం. భగవతి ఒక హైకోర్టు న్యాయమూర్తి కుమారుడు. కులీన సామాజిక నేపథ్యాల కారణంగా సేన్, భగవతి సహజంగానే తమ ఉన్నత విద్యాభ్యాసానికి కేంబ్రిడ్జి వెళ్లారు. మరి మన్మోహన్ ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. దేశ విభజన పరిణామాలతో ఆయన కుటుంబం బాగా చితికిపోయింది. తీవ్ర ప్రతికూల పరిస్థితులలో ఎంతో కష్టపడి చదువుకున్న మన్మోహన్‌కు ఒక ప్రతిష్ఠాత్మక పాశ్చాత్య విశ్వవిద్యాలయానికి వెళ్లడమనేది ఒక అసాధ్య విషయం. అయితే మన్మోహన్ కేంబ్రిడ్జికి వెళ్లగలిగారు. అక్కడ పట్టభద్రుడైన తరువాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో డి.ఫిల్ పట్టా పొందారు.

**మన్మోహన్ సింగ్ అర్థశాస్త్ర విద్వత్తు ప్రగాఢమైనది. ఆర్థిక సంస్కర్తగా ఆయన సాఫల్యాలు గణనీయమైనవీ, కలకాలం నిలిచేవీ అనడంలో సందేహం లేదు. ప్రధానమంత్రిగా ఆయన పాలనా విజయాలు అనిశ్చితమైనవి. అనుద్దేశపూర్వకంగా ప్రభుత్వంలో నిరంకుశ విధానాలు పెచ్చరిల్లేందుకు; భారతదేశ అతి పురాతన రాజకీయ పార్టీలో విధేయతా సంస్కృతి, కుటుంబ ప్రాధాన్యం తిరుగులేని రీతిలో వర్ధిల్లేందుకు మనఃపూర్వకంగా ఆయన తోడ్పడ్డారు.**

2009 తొలినాళ్లలో నేను ఒక నెల రోజుల పాటు న్యూఢిల్లీలో ఉన్నాను. ప్రధానమంత్రి మన్మోహన్‌తో సమావేశమయ్యాను. అంతకంటే ముఖ్యంగా ప్రభుత్వంలోను, వెలుపల ఆయనకు సన్నిహితులైన పలువురు అధికారులతో నేను సంభాషించాను. పెద్ద వయస్సు, అందునా, గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్న కారణంగా తదుపరి సార్వత్రిక ఎన్నికలలోగానే మన్మోహన్ సింగ్ గౌరవప్రదంగా రాజకీయాల నుంచి నిష్క్రమించడం శ్రేయస్కరమని ఆ అధికారులు అందరూ అభిప్రాయపడ్డారు. ప్రధాన మంత్రి పదవిలో కొనసాగుదలుచుకుంటే లోక్‌సభకు పోటీ చేసి గెలిస్తే ఆయన విశ్వసనీయత మరింతగా పెరుగుతుందని మన్మోహన్ అభిమాని ఒకరు పేర్కొన్నారు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

అదే ఏడాది మన్మోహన్ రెండో పర్యాయం ప్రధాన మంత్రి అయ్యారు. రాజ్యసభలోనే సభ్యుడుగా ఆయన కొనసాగారు. మొదటి పర్యాయం ప్రధానిగా ఉన్నప్పుడే ఆయన తన పార్టీ అధినేత్రి పట్ల మితిమీరిన రీతిలో వినయ విధేయతలు చూపుతున్నారని నిశిత పరిశీలకులు గమనించారు. రెండోసారి ప్రధాన మంత్రి అయిన తరువాత ఆ విధేయత మరింతగా పెరిగింది. అది ఆయన నిర్వహిస్తున్న అత్యున్నత పదవి గౌరవానికి తగని విధంగా ఉండేది. ఇదిలా ఉండగా మన్మోహన్ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు తీవ్రమయ్యాయి. బహిర్గతమైన వివిధ కుంభకోణాలలో కేంద్ర మంత్రుల పాత్ర ఉన్నట్టు రుజువయింది. వారిపై చర్య తీసుకోవడంలో మన్మోహన్ విఫలమయ్యారు. తనను ధిక్కరిస్తున్న మంత్రులను కూడా ఆయనేమీ చేయలేకపోయారు. మొదటి పర్యాయం ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు కొందరు ప్రముఖ విద్యావేత్తలతో నాలెడ్జ్ కమిషన్‌ను నియమించారు. అయితే మానవవనరుల అభివృద్ధి మంత్రి అర్జున్ సింగ్ ఆ కమిషన్‌కు ఎటువంటి అధికారాలు లేకుండా చేసి నీరుకార్చివేశారు. రెండో పర్యాయం ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ప్రణబ్ ముఖర్జీని సుదీర్ఘకాలం ఆర్థికమంత్రిగా కొనసాగించారు. ప్రణబ్ హయాంలో అంతర్జాతీయ మార్కెట్లలో భారత్ ప్రాభవం క్షీణించిపోయింది. ఆర్థిక సంస్కరణల అనంతర కాలంలో మొట్టమొదటి 'అధ్వాన్న ఆర్థికమంత్రి' అన్న అప్రతిష్ఠను ప్రణబ్ మూటగట్టుకున్నారు.

వైదుష్యంలో మన్మోహన్‌కు అర్జున్ సింగ్ ఏ మాత్రం సాటి రారు. ఆర్థిక మంత్రిత్వ శాఖను ప్రణబ్ కంటే మన్మోహనే అత్యంత సమర్థతతో నిర్వహించారని మరి చెప్పనవసరం లేదు. అయినప్పటికీ భయపడే స్వభావం కారణంగా, లోక్‌సభకు ఎన్నికైన సహచర మంత్రులు తనను ధిక్కరిస్తున్నప్పటికీ మన్మోహన్ వారిని నియంత్రించలేకపోయారు. బహుశా, పార్టీ అధినేత్రితో సమస్యలు వస్తాయన్న భయంతో ఆయన మిన్నకుండిపోయేవారు. కేబినెట్ తీర్మానం నొకదాన్ని రాహుల్‌గాంధీ బహిరంగంగా చించివేసినప్పటికీ మన్మోహన్ మౌనం వహించారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో పనిచేసేందుకు తాను అమితంగా సంతోషిస్తానని మన్మోహన్ తన రెండో పదవీ కాలం తుదినాళ్లలో ప్రకటించారు. ఇలా బహిరంగంగా విధేయతను ప్రదర్శించడం ద్వారానే పార్టీలోను, ప్రభుత్వంలోను తన స్థానాన్ని పటిష్ఠం చేసుకోగలనని ఆయన భావించారేమో?!

అదొక తప్పుడు నిర్ణయం. అంతే కాదు విషాదకరమైన పొరపాటు కూడా. సోనియాకు మన్మోహన్ ఎంతగా రుణపడి ఉన్నారో సోనియా సైతం ఆయనకు అంతే రుణపడి ఉన్నారని చెప్పి తీరాలి. 2004లో ప్రధానమంత్రి అయ్యేందుకు అవకాశం వచ్చినప్పటికీ ఆమె ఆ అత్యున్నత బాధ్యతను చేపట్టేందుకు నిరాకరించారు. ప్రభుత్వంలో ఏనాడూ పని చేసిన అనుభవం లేని కారణంగా ప్రధాని పదవికి తాను అర్హురాలును కాననే విషయం ఆమెకు తెలుసు. కేబినెట్ సమావేశాల నిర్వహణ దక్షత తనకు లేదని, విధాన నిర్ణయాలు తీసుకోలేనని, విదేశీ ప్రభుత్వాధినేతలతో సమస్థాయిలో వ్యవహరించగల సామర్థ్యం తనకు లేదని ఆమెకు బాగా తెలుసు.

ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టడం ద్వారా ఎటువంటి ఇబ్బందులకు లోనవకుండా సోనియాను మన్మోహన్ రక్షించారు. అయితే 2009లో యూపీఏ తిరిగి అధికారంలోకి వచ్చిన తరువాత అర్హతలు ఏ మాత్రం లేని తన తనయుడిని భావి ప్రధానమంత్రిగా చేసేందుకు సోనియా చేయవల్సినవి సంపూర్ణంగా చేశారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యంత అనుభవజ్ఞుడు అయిన ప్రభుత్వాధికారి కావడంతో పాటు ప్రధానమంత్రి పదవిలో ఉన్న మన్మోహన్ సింగ్ రాహుల్ విషయంలో సోనియాకు బాసటగా నిలబడ్డారు. ప్రధానమంత్రి అయివుండి కూడా తన అధికారాలను నిర్ణయాత్మకంగా ఉపయోగించలేకపోవడంలో తన నిస్సహాయత్వాన్ని ఆయన బహిరంగంగా కనబరిచారు. మన్మోహన్ నిస్సహాయత్వం ప్రధానమంత్రి పీఠాన్ని అధిష్ఠించడంలో నరేంద్ర మోదీకి ఎంతగా సహకరించిందో భావి చరిత్రకారులే నిర్ణయించాలి. ప్రధాన మంత్రి ఒక బలహీన నాయకుడుగా కనిపించడంతో చాలా మంది ఓటర్లు దేశానికి శక్తిమంతమైన నాయకత్వాన్ని ఇవ్వగలనని నిశ్చితంగా వక్కాణించిన నరేంద్ర మోదీ వైపు మొగ్గారనడం సత్యదూరం కాదు. సామాజికంగా వెనుకబడిన నేపథ్యం నుంచి ప్రభవించిన నేత నరేంద్ర మోదీ. నెహ్రూ– గాంధీ కుటుంబానికి ప్రథమ ప్రాధాన్యమిచ్చే పార్టీగా కాంగ్రెస్‌ను ప్రజలు భావించారు. ఈ అంశాలు నరేంద్ర మోదీ ఉత్థానానికి విశేషంగా దోహదం చేశాయి.

మన్మోహన్ సింగ్ అర్థశాస్త్ర విద్వత్తు ప్రగాఢమైనది, ఆర్థిక సంస్కర్తగా ఆయన సాఫల్యాలు గణనీయమైనవీ, కలకాలం నిలిచేవీ అనడంలో సందేహం లేదు. అయితే ప్రధానమంత్రిగా ఆయన పాలనా విజయాలు, రాజకీయ వారసత్వం అనిశ్చితమైనవి. ద్వితీయ పర్యాయం ప్రధానమంత్రిగా ఆయన అనుద్దేశపూర్వకంగా ప్రభుత్వంలో నిరంకుశ విధానాలు పెచ్చరిల్లేందుకు; భారతదేశ అతి పురాతన రాజకీయ పార్టీలో విధేయతా సంస్కృతి, కుటుంబ ప్రాధాన్యం తిరుగులేని రీతిలో వర్ధిల్లేందుకు మనఃపూర్వకంగా ఆయన తోడ్పడ్డారు.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

---

# జిల్లాల అశాస్త్రీయ విభజనతో జనానికి వెతలు!

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రాంత సౌలభ్యం, పరిపాలన సౌలభ్యంతో 23 జిల్లాలతో ఉండేది. 2014లో రాష్ట్ర విభజన తర్వాత 13 జిల్లాలతో ప్రాంత సమతుల్యంతో, జిల్లాలోని అన్ని ప్రాంతాల వారికీ ప్రభుత్వ కార్యాలయాలు, జిల్లా కేంద్రాలు, ప్రాంతీయ డివిజనల్ కార్యాలయాలు చేరువలో ఉండేవి. 2022లో అప్పటి ప్రభుత్వం కేవలం నియోజకవర్గ పరిధిని మాత్రమే ప్రామాణికంగా తీసుకొని విభజన చేయడం వల్ల అనేక ఇబ్బందులతో పాటు న్యాయపరమైన వివాదాలు ఏర్పడ్డాయి.

రాజీవ్‌గాంధీ హయాంలో రొటేషన్ తీసేసి, డీలిమిటేషన్ బిల్లును మాత్రమే లోక్‌సభలో ప్రవేశపెట్టారు. జనాభా ప్రాతిపదికన ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. నియోజకవర్గంలో నిర్దేశిత జనాభా/ ఓటర్లు లేకపోతే సమీప జిల్లా/ డివిజన్‌లోని మండలాలను వేరే నియోజకవర్గంలో చేర్చడం సహజం.

బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో గోదావరి నదీ విభజన రేఖను అనుసరించి గోదావరి జిల్లాను తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలుగా విభజించారు. రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గానికి 2008లో జరిగిన డీలిమిటేషన్ ద్వారా తూర్పుగోదావరి జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాలు తగ్గడంతో పశ్చిమ గోదావరి జిల్లా నుంచి మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు జత చేశారు. ఇదే విధంగా తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గంలో నెల్లూరు జిల్లాకు చెందిన మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు చేర్చారు.

అంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలను నాలుగు జోన్లుగా ఏర్పరిచారు. జోన్–1లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు; జోన్–2లో తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలు; జోన్–3లో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు; జోన్–4లో చిత్తూరు, అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలుగా భారత రాజ్యాంగంలో 371డి అధికరణలో పొందుపర్చారు. విద్య, ఉద్యోగ అవకాశాలు అన్ని ప్రాంతాలకు సమానంగా అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.



**నూతన జిల్లాల ఏర్పాటు అనేది భౌగోళిక పరిస్థితులు, స్థానికతకు సౌలభ్యంగా చేస్తే ప్రజలు హర్షిస్తారు. కానీ రాజకీయ కారణాలతో చేస్తే... అది ఎన్నటికీ ఆమోదయోగ్యం కాదు. ప్రస్తుత పాలకులు విజ్ఞతతో భౌగోళిక, సాంస్కృతిక ప్రాతిపదికన జిల్లాల మధ్య ఏర్పడిన అసమానతలు తొలగించాల్సిన అవసరం ఉంది.**

అంధ్రప్రదేశ్‌లో 2022లో చేసిన జిల్లాల పునర్విభజన తీరును చూస్తే సదరు అంశాలు పరిగణనలోకి తీసుకోకుండా చేశారనిపిస్తుంది. జోన్–2లోని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో భాగమైన రంపచోడవరంను జోన్–1లో కలిపారు. దీనివల్ల అక్కడి ప్రజలకు జిల్లా కేంద్రం సుమారు 300 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 2009కి ముందు రంపచోడవరం.. భద్రాచలం పార్లమెంటరీ నియోజకవర్గంలో భాగంగా ఉండేది. 2009లో అరకు పార్లమెంటరీ నియోజకవర్గంలోకి మారింది. జోన్–2లో భాగాన్ని, జోన్–1లో కలపడంతో న్యాయపరమైన సమస్య ఉత్పన్నమైంది. అలాగే జోన్–3లో నెల్లూరు జిల్లాలో భాగమైన గూడూరు, సర్వేపల్లి, సూళ్ళూరుపేట, వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గాలు తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గంలో ఉండడం, తిరుపతి జిల్లాలో కలపడంతో జోన్–3, జోన్–4ల మధ్య న్యాయపరమైన సమస్య ఉత్పన్నమైనది. ఇదేవిధంగా రాష్ట్రంలోని అనేక మండలాలను వాటి భౌగోళిక ప్రదేశానికి సమీప జిల్లా కేంద్రం కాకుండా, నియోజకవర్గ ప్రాతిపదికన జిల్లాల విభజన చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఉమ్మడి కృష్ణా జిల్లా విభజన తీరును చూస్తే– విజయవాడ నగర సమీపంలోని గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలను కృష్ణా జిల్లాలో, నూజివీడు నియోజకవర్గాన్ని ఏలూరు జిల్లాలో, గుడివాడ డివిజన్‌లో భాగంగా ఉన్న కైకలూరు నియోజకవర్గాన్ని కూడా ఏలూరు జిల్లాలో విలీనం చేసారు. గన్నవరం, పెనమలూరు... ఈ రెండు నియోజకవర్గాలు విజయవాడకు కూతవేటు దూరంలో ఉంటాయి. ఇక్కడి ప్రజలు వినోదానికి, షాపింగు చేయడానికి విజయవాడకే వస్తారు. కానీ ప్రభుత్వ పనుల కోసం మాత్రం 60 కిలోమీటర్ల దూరంలోని మచిలీపట్నానికి వెళ్లాల్సిన దుస్థితి. గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం విజయవాడ పోలీసు కమిషనరేట్‌కి కూత వేటు దూరంలో ఉంది. ఇక్కడ ఏదైనా మేజర్ క్రైమ్ జరిగితే సుమారు 20 కిలోమీటర్ల దూరంలోని విజయవాడ కమిషనరేట్ నుంచి రావడం తేలిక, మచిలీపట్నం బాగా దూరం.

గ్రేటర్ విజయవాడ ఏర్పాటు చేయాలంటే– విజయవాడ నగర సమీప గ్రామాలు, విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం కృష్ణా జిల్లాలో ఉన్నాయి. గత ప్రభుత్వంలో విజయవాడ మండల ప్రజలకు సమీప మండలాలైన పెనమలూరు, గన్నవరంలలో ఇళ్ల స్థలాలు కేటాయించారు. వారికి కేటాయించిన స్థలాలు, ఇప్పుడు జిల్లా మారడంతో గృహ నిర్మాణం ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు.

26 జిల్లాలుగా ఏర్పడి రెండున్నరేళ్ల గడిచినా, జిల్లా కార్యాలయాలు, నూతన డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం అద్దె భవనాలు, ఇరుకు గదుల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఇప్పటి నిర్మాణ ధరల ప్రకారం చూసినా ప్రతి జిల్లా కార్యాలయం, జిల్లా శాఖాధిపతుల కార్యాలయాలకు కోట్లాది రూపాయలు ఖర్చవుతాయి. భూమి లభ్యత లేకపోతే ఇంకా ఖర్చు పెరుగుతుంది. దీనికితోడు ఉద్యోగుల విభజన పూర్తి కాలేదు. బదిలీలు, పదోన్నతులు ఇంకా ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే చేపడుతున్నారు. నూతన జిల్లాల ఏర్పాటు అనేది భౌగోళిక పరిస్థితులు, స్థానికతకు సౌలభ్యంగా చేస్తే ప్రజలు హర్షిస్తారు, కానీ రాజకీయ కారణాలతో చేస్తే.. అది ఎన్నటికీ ఆమోదయోగ్యం కాదు.

గత దశాబ్దకాలంగా ఉద్యోగుల నియామక ప్రక్రియ, రిటైర్మెంట్లలో వ్యత్యాసం భారీగా ఉంది. 2026 నుంచి 2030 వరకు అన్నీ విభాగాలలోని సీనియర్ అధికారులు పదవీ విరమణ పొందనున్నారు. ప్రస్తుతం నూతనంగా ఏర్పడిన జిల్లాలలోని డివిజన్ స్థాయి అధికారులు జిల్లా స్థాయి అధికారులుగా, ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. వారు అదే డివిజన్ స్థాయి కార్యాలయాల నుంచి విధులు నిర్వహించడంతో ప్రజలు... ఏది జిల్లా కార్యాలయం, ఏది డివిజన్ కార్యాలయం అనే సందిగ్ధావస్థలో ఉన్నారు.

ఉమ్మడి జిల్లాల కార్యాలయంలో ఉన్న సిబ్బందిని తాత్కాలిక సర్దుబాటుగా నూతన జిల్లాలకు కేటాయించడంతో పూర్వం జిల్లాలో గల కార్యాలయాలు కొన్ని ఖాళీగా, కొన్ని భవనాలు పూర్తి స్థాయిలో ఉపయోగంలో లేకుండా ఉన్నాయి. ప్రస్తుత పాలకులు విజ్ఞతతో భౌగోళిక, సాంస్కృతిక ప్రాతిపదికన జిల్లాల మధ్య ఏర్పడిన అసమానతలు తొలగించాలి. పూర్వపు జిల్లాల మాదిరి విలీనమా లేదా 2026లో జరగబోయే డీలిమిటేషన్ కమిషన్ నివేదికననుసరించి నూతనంగా ఏర్పడబోయే నియోజకవర్గాల సరిహద్దులననుసరించి చేస్తారా అనేది కాలమే సమాధానం చెప్పాలి.

గత ప్రభుత్వం అనుభవ లేమితో, పాలన మీద పట్టు లేక అశాస్త్రీయంగా జిల్లాల విభజన చేసి సహజవనరుల దోపిడీ లక్ష్యంగా పనిచేసింది. ఈ పరిస్థితుల్లో జిల్లాల విభజన వల్ల ఏర్పడిన సమస్యలను పరిష్కరించే సత్తా, అనుభవం ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాత్రమే ఉన్నాయి.

● యార్లగడ్డ వెంకట్రావు
ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY







ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు

# నేడే ఫైనల్స్

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం నగరంలో జరగనున్నాయి. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొంటారు. ఫైనల్స్‌లో ప్రథమ, ద్వితీయ బహుమతులతో పాటు కన్సొలేషన్ బహుమతులు ఉంటాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని 83 కేంద్రాల్లో ఈనెల 4, 5, 6, 7 తేదీల్లో పోటీలు నిర్వహించగా, వేలాదిగా మహిళలు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలు రాష్ట్రస్థాయిలో జరిగే ఫైనల్స్‌కు అర్హత సాధించారు. గత ఆదివారం విజయవాడలో జరిగిన ముగ్గుల పోటీల్లో విజేతగా నిలిచిన కె.మల్లేశ్వరి ఈ ఫైనల్స్‌లో పాల్గొంటున్నారు.

– విజయవాడ, ఆంధ్రజ్యోతి



బీసెంట్ రోడ్డులో రద్దీ



శుక్రవారం రాత్రి నగరంలో స్తంభించిన ట్రాఫిక్



పీఎన్‌బీఎస్‌లో రద్దీ

నగరం సంక్రాంతి పండుగ కళను సంతరించుకుంది. ఓవైపు ప్రయాణాలతో బస్టాండ్, రైల్వేస్టేషన్ కిక్కిరిసిపోగా, మరోవైపు షాపింగ్‌లు, రెస్టారెంట్లు, మల్టీప్లెక్స్‌లు, స్వీట్ల దుకాణాలు.. కొనుగోళ్లతో కళకళలాడుతున్నాయి. రోడ్లు గజి'బిజీ'గా మారిపోయాయి.

# సంక్రాంతి సందడి

## రెండు రోజుల ముందే నగరానికి పండుగ కళ

### దూరప్రాంతాల నుంచి వచ్చీపోయే వారితో సందడే సందడి

- హైదరాబాద్-విజయవాడ-విశాఖ మధ్య భారీ రాకపోకలు
- విజయవాడలో దిగి పనిలో పనిగా షాపింగ్‌లు
- వస్త్ర, స్వీట్ల దుకాణాలు, మొబైల్ షోరూమ్‌లు కిటకిట
- నగర రహదారుల్లో ట్రాఫిక్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రెండు రోజుల ముందే నగరానికి పండుగ శోభ వచ్చేసింది. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఇవ్వటంతో దూరప్రాంతాల నుంచి విజయవాడ వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. పండిట్ నెహ్రూ బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రయాణికులతో రద్దీగా మారిపోయాయి. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నుంచి విజయవాడకు వాహనాల రాకపోకలు బాగా పెరిగాయి. హైదరాబాద్ నుంచే ఎక్కువ సంఖ్యలో ప్రయాణికులు వస్తున్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు బస్సులన్నీ రద్దీగా వస్తున్నాయి. దీంతో పీఎన్‌బీఎస్ కిటకిటలాడుతోంది. హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చే వారి సంఖ్య ఎంత ఉందో, విజయవాడ-విశాఖపట్నం మధ్య కూడా అదే రద్దీ కొనసాగుతోంది. దీంతో హైదరాబాద్, విశాఖపట్నం ప్లాట్‌ఫాం కిటకిటలాడుతున్నాయి. రాయలసీమ జిల్లాలతో పాటు తిరుపతి, కాకినాడకు రాకపోకలు ఎక్కువగా జరుగుతున్నాయి.



### రైళ్లన్నీ కళకళ

రైళ్లు కూడా కిటకిటలాడుతున్నాయి. సంక్రాంతి స్పెషల్ రైళ్లన్నీ రద్దీగా నడుస్తున్నాయి. పండుగ నేపథ్యంలో ఇప్పటికే రైల్వే అధికారులు 58 స్పెషల్స్ నడుపుతున్నారు. దీంతో సాధారణ రైళ్లతో పాటు స్పెషల్స్ కూడా రద్దీగా ఉంటున్నాయి. ముఖ్యంగా సికింద్రాబాద్ నుంచి విజయవాడ, విజయవాడ నుంచి విశాఖపట్నం మధ్య రాకపోకలు భారీగా సాగుతున్నాయి.

### నగరం కిటకిట

విజయవాడ నగర రహదారులు కిటకిటలాడుతున్నాయి. కొద్దిరోజులుగా షాపింగ్‌లతో బీసెంట్ రోడ్డు, లెనిన్ సెంటర్, బందరు రోడ్డులోని షోరూమ్‌లు, మల్టీప్లెక్స్ మాల్స్‌లోని బట్టల దుకాణాలు రద్దీగా మారాయి. బందరు రోడ్డులోని షోరూమ్‌లకు పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు రావటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మొబైల్ దుకాణాలతో పాటు రెస్టారెంట్లు, హోటళ్లు కూడా కిక్కిరిసిపోతున్నాయి.



# ముక్కోటి.. భక్తకోటి



ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లాలోని వైష్ణవాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. స్వామివారిని ఉత్తరద్వారం నుంచి దర్శించుకున్న భక్తులు తన్మయత్వం పొందారు. (నగరంలోని టీటీడీ కల్యాణమండపంలో ఉన్న వేంకటేశ్వరస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు, లబ్బీపేటలోని ఆలయంలో ఉత్తర ద్వారంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులు)

# పండుగ దోపిడీకి బ్రేక్ వేయరా..?

## ప్రైవేట్ ట్రావెల్స్ దందాను పట్టించుకోని అధికారులు

- ప్రయాణికులు ఫిర్యాదు చేస్తేనే చర్యలని సమర్థింపు
- తప్పనిసరిగా ప్రయణించే వారు ఫిర్యాదు చేస్తారా?
- వెబ్‌పోర్టల్స్ భారీగా చార్జీలు ప్రకటిస్తున్న ట్రావెల్స్
- అధికారుల అలక్ష్యం.. సామాన్యుడిపై భారం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సంక్రాంతి పండుగ సందర్భంగా జరుగుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ అసాధారణంగా చార్జీలు పెంచుతూ తమతమ వెబ్‌పోర్టల్స్‌లో ప్రకటిస్తున్నా పట్టించుకోని రవాణా శాఖ అధికారులు ప్రయాణికులు ఫిర్యాదు చేస్తేనే చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. అసలు ప్రైవేట్ బస్ ఆపరేటర్లు సొంత వెబ్‌సైట్లు నిర్వహించటమే మోటారు వాహనాల చట్టం ప్రకారం నేరం. అయినా దర్జాగా వెబ్‌సైట్లు నిర్వహిస్తూ, అందులోనే భారీగా మిగతా 6లో..

# డిప్లొమాటిక్ పాస్‌పోర్టు తీసుకున్న చంద్రబాబు

విజయవాడ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు డిప్లొమాటిక్ పాస్‌పోర్టు తీసుకున్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విజయవాడలోని ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయానికి వెళ్లారు. ఈ నెల 20-24 మధ్య స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక ఫోరం వార్షిక సదస్సుకు సీఎం హాజరుకానున్నారు. డిప్లొమాటిక్ పాస్‌పోర్టును రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, సీఎం వంటి ప్రముఖులకు ఇస్తారు.

# గ్రావెల్ దందా!

## పోలవరం మట్టి తవ్వేస్తున్నారు

- ప్రజాప్రతినిధుల అనుచరులే సూత్రధారులు
- కొత్త క్వారీలకు అనుమతులు ఇవ్వని ప్రభుత్వం
- అయినా తిరువూరు, మైలవరంలో జోరుగా తవ్వకాలు

### గన్నవరం, నూజివీడు నియోజకవర్గాల్లో తమ్ముళ్ల పోరు

మైలవరం మండలం వెదురుబీడెంలో అక్రమ తవ్వకాలు జరిగిన ప్రాంతం



టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా క్వారీలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. కానీ ఎన్టీఆర్ జిల్లాలోని తిరువూరు, మైలవరంలోయథేచ్ఛగా గ్రావెల్, పోలవరం మట్టిని తవ్వి తరలించేస్తున్నారు. వైసీపీ హయాంలో కనిపించిన కొండనల్లా పిండి చేసిన అక్రమార్కులు టీడీపీ హయాంలోనూ రెచ్చిపోతూ ఈ దందాను యథేచ్ఛగా సాగిస్తున్నాయి.

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో రెచ్చిపోయిన మట్టి రాక్షసులు కూటమి ప్రభుత్వంలోనూ రూపం మార్చుకుని దోపిడీ సాగిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున గ్రావెల్ దందా నడుస్తోంది. సాక్షాత్తు ప్రజాప్రతినిధుల పేరు చెప్పి అక్రమార్కులు గ్రావెల్ దందా సాగిస్తున్నారు. మరోవైపు గన్నవరం, నూజివీడు నియోజకవర్గాల్లో పోలవరం మట్టి కోసం ప్రజాప్రతినిధుల అనుచరుల నడుమ యుద్ధం నడుస్తోంది. వైసీపీ హయాంలో కనిపించిన కొండనల్లా పిండి చేసిన అక్రమార్కులు టీడీపీ హయాంలోనూ రెచ్చిపోతున్నారు. నాడు వైసీపీ ముసుగులో దోపిడీ సాగిస్తే నేడు టీడీపీ ముసుగులో దందా నడిపిస్తున్నారు. ఆ వివరాల్లోకి వెళితే.. మైలవరం మండలం వెదురుబీడెంలో వైసీపీ నాయకుడు ఒకరు గతంలో మూడు ఎకరాల్లో గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు తెచ్చుకున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ప్రస్తుతం ఈ ఒక్క క్వారీయే అధికారికంగా నడుస్తోంది. దాని నుంచి విజయవాడ పశ్చిమ బైపాస్ పనులకు గ్రావెల్ తరలిస్తున్నారు. ఈ క్వారీలో నిబంధనలకువిరుద్ధంగా సుమారు 20 అడుగుల మేర గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. 200 లారీల గ్రావెల్ తరలిస్తున్నారు. గత వారం రోజులుగా విజయవాడ రూరల్ మండల పరిధిలోని కొత్తూరు తాడేపల్లిలో స్థానిక వైసీపీ, టీడీపీ నాయకులు కలిసి పోలవరం కాల్వ మట్టిని తవ్వి తరలించేస్తున్నారు. వందల సంఖ్యలో వాహనాల్లో మట్టి తరలిపోతున్నా ఒక్క అధికారీ అటువైపు కన్నెత్తి చూడటం లేదు. స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో అరకొరగా తనిఖీలు చేసి మమ అనిపిస్తున్నారు. పాతపాడు వద్ద కూడా పోలవరం మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. కొత్తూరు తాడేపల్లిలోని వసంతరాయల తిప్ప(కొండ)ను ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వేస్తున్నారు. తిరువూరు నియోజకవర్గ పరిధిలోని కొండపర్వలో ప్రైవేటు వ్యక్తులకు చెందిన మామిడి తోటలో గుట్టుగా తవ్వకాలు జరుపుతున్నారు. ఇక్కడి నుంచి నిత్యం వందలాది లారీల్లో గ్రావెల్ తరలిస్తున్నారు. వైసీపీ, టీడీపీ నాయకులు కలిసి గ్రావెల్ దందా నడిపిస్తుండటం గమనార్హం.

### తమ్ముళ్ల నడుమ మట్టి చిచ్చు

గన్నవరం, నూజివీడు సరిహద్దు గ్రామాల్లో గ్రావెల్, పోలవరం మట్టి తవ్వకాలు, తెలుగు తమ్ముళ్ల మధ్య చిచ్చు పెడుతున్నాయి. పోటాపోటీగా ప్రెస్‌మీట్లు పెట్టుకుని పరస్పరం దుమ్మెత్తి పోసుకుంటున్నారు. నూజివీడు మిగతా 6లో..

# బియ్యం కేసులో నిందితుల విచారణ

- హైకోర్టు ఆదేశాల మేరకు మళ్లీ జైలుకు
- పేర్ని నాని గోడౌన్ వ్యవహారం 6లో



హాస్టల్ కథలు సంపుటి ఆవిష్కరణలో పెనుగొండ లక్ష్మీనారాయణ, కోటేశ్వరరావు తదితరులు

## చరిత్రను చెప్పేది సాహిత్యం

విజయవాడ కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తుల ఆలోచనలు, అనుభూతులు, వాస్తవ జీవితాలను భావితరాలకు సాహిత్యం ద్వారా తెలియజేస్తుందని, తద్వారా చరిత్రలో సాహిత్యం ఖాళీలను పూర్తిచేస్తుందని అరసం అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. పుస్తక మహోత్సవంలో నక్కా విజయరామరాజు రచించిన ప్రపంచంలో 'హాస్టల్ కథలు' కథాసంపుటిని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొన్ని దశాబ్దాల క్రితం గుంటూరు మెడికల్ కాలేజీ చుట్టుపక్కల చిన్న ప్రాంతంలో జరిగిన ఘటనలను రచయిత హృద్యంగా వర్ణించారన్నారు. సభాధ్యక్షుడు కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ, నక్కా విజయకుమార్ అనతికాలంలోనే తెలుగు పాఠకుల హృదయాలలో ముద్రవేసిన రచయితగా ఎదిగారన్నారు. చల్లపల్లి స్వరూపరాణి మాట్లాడుతూ, హాస్టలు జీవితాన్ని ఎంతో హృద్యంగా, ఆకర్షణీయంగా వర్ణించిన ఈ రచన హాస్టల్లో చదవనివారిని అసూయాపరులను చేస్తుందన్నారు. గడ్డం విజయసారథి మాట్లాడుతూ, చిన్నచిన్న పదాలతో సహజమైన నుడికారంతో పాఠకుల హృదయాలను మెలిపెట్టే భావాలను వెల్లడించడం రచయిత గొప్పదనం అన్నారు. మల్లవరపు ప్రభాకరరావు మాట్లాడుతూ, హాస్టల్ నేపథ్యంగా ఆనాటి సామాజిక పరిస్థితులకు చక్కగా అద్దంపట్టాయని, అదే సమయంలో ఒక సార్వకాలనీత ఉంటుందంటున్నారు. నూకతోటి రవికుమార్ మనుషుల్లో మానసిక ఆర్ద్రత పెంచేందుకు, మానవీయ విలువలు పెంపొందించేందుకు నక్కా విజయరామరాజు కథలు ఉపయోగపడతాయన్నారు.

# జ్ఞాన ప్రపంచంలోకి తీసుకెళ్లే కిటికీలు పుస్తకాలు

విజయవాడ కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పుస్తకాలు వ్యక్తులను జ్ఞాన ప్రపంచంలోకి తీసుకెళ్లే కిటికీలని సమగ్ర శిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అన్నారు. విజయవాడ పుస్తకమహోత్సవంలో శుక్రవారం నేషనల్ బుక్ ట్రస్ట్ సభలో 'పలహారాల చెట్టు, పత్తిడి బొమ్మతో స్నేహం, మాట్లాడే గడియారం, చిక్కుముడి' అనే అనువాద బాలసాహిత్య రచనలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వశిక్షా అభియాన్ పాఠశాల గ్రంథాలయాల్లో బాలలకు అవసరమైన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచడానికి ప్రయత్నిస్తోందన్నారు. పిల్లల పుస్తకాల్లో నేషనల్ బుక్ ట్రస్ట్ ప్రమాణాలు అందరికి ఆదర్శమన్నారు. ఈ పుస్తకాల వినియోగంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన పెంచాల్సి ఉందన్నారు. సభకు అధ్యక్షత వహించిన నేషనల్ బుక్ ట్రస్టు కార్యవర్గ సభ్యుడు జి.వల్లీశ్వర్ మాట్లాడుతూ, దేశ సమగ్రత, సమైక్యతను కాపాడటానికి నేషనల్ బుక్ ట్రస్టు విస్తృతమైన కృషి చేస్తోందని వివరించారు. త్వరలోనే రాష్ట్రంలో నేషనల్ బుక్ ట్రస్ట్ అతి పెద్ద బుక్ ఫెయిర్ నిర్వహించబోతోందని వెల్లడించారు. నేషనల్ బుక్ ట్రస్ట్ దక్షిణ ప్రాంత బాధ్యుడు పత్తిపాక మోహన్ మాట్లాడుతూ, పిల్లల కోసం తమ సంస్థ అనేక వర్క్‌షాపులు నిర్వహిస్తోందన్నారు. బాలసాహితీవేత్త ముంజులూరి కృష్ణకుమారి మాట్లాడుతూ, పిల్లలకు ఆసక్తి కలిగించేలా పుస్తకాలను ముద్రించాలని ప్రచురణకర్తలకు సూచించారు. పిల్లలకు కథలు పుస్తకాలు చదివే అలవాటు చేస్తే మొబైల్ తదితర దురలవాట్లు తగ్గుతాయని చెప్పారు. బాలసాహితీవేత్త అమరవాది నీరజ మాట్లాడుతూ, నేషనల్ బుక్ ట్రస్ట్ అనువాద రచనలు చదవడం వల్ల పిల్లల మనసులు, ఆలోచనలు వికసితమవుతాయని, వారికి దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతులపై అవగాహన ఏర్పడుతుందన్నారు. వీటీఎఫ్ఎస్ అధ్యక్షుడు కె.లక్ష్మయ్య మాట్లాడుతూ, నేషనల్ బుక్ ట్రస్టు ఆంధ్రప్రదేశ్‌లో శాఖను స్థాపించాలని కోరారు. సర్వశిక్షాఅభియాన్ వారు ప్రభుత్వేతర ప్రచురణకర్తల పుస్తకాలను కొనే అవకాశాలను పరిశీలించాలన్నారు.



సమగ్ర శిక్షా అభియాన్ పీడీ శ్రీనివాసరావు, తదితరులు



### అక్కడ అన్నీ అంబేడ్కర్ ఆలోచనలే

నాటి సమాజంలో ఉన్న పరిస్థితులను పూర్తి అధ్యయనం చేసి బహుజనుల జీవితాల్లో వెలుగులు నింపిన జ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్. ఆయన జననం నుంచి మరణం వరకు సాగిన ప్రస్థానంపై అనేక రచనలు వెలువడ్డాయి. అదేవిధంగా అంబేడ్కర్ కలం నుంచి వెలువడిన అక్షరాలు అనేకంగా ఉన్నాయి. ఇవన్నీ పుస్తక మహోత్సవంలోని స్టాల్ నంబరు 210లో ఉన్న జై భీమ్ బుక్‌హౌస్‌లో దర్శనమిస్తున్నాయి. అంబేడ్కర్ జీవనం, అంబేడ్కర్ జీవితచరిత్ర, జై భీమ్, అంబేడ్కర్ సూర్యుడు వంటి పుస్తకాలు ఇందులో ఉన్నాయి. వాటితో పాటు ఆయన అనుసరించిన బౌద్ధంకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.




### నీతి కథల పుస్తకాలంటే ఇష్టం

- పి.జగదీష్, గీతాంజలి హైస్కూల్

నేను ఎనిమిదో తరగతి చదువుతున్నా. నాకు నీతికథల పుస్తకాలంటే చాలా ఇష్టం. మా స్కూల్‌లో వారానికి ఒకసారి లైబ్రరీ పీరియడ్ ఉంటుంది. ఆ సమయంలో ఈ పుస్తకాలను చదువుతాను. వాటితోపాటు సుభాష్‌చంద్రబోస్, గాంధీజీ, అంబేడ్కర్ వంటి నాయకుల జీవిత చరిత్రకు సంబంధించి పుస్తకాలు చదివా. తెనాలి రామకృష్ణ కథలపై ఆసక్తి ఉంది.




### రూ.50కే.. 101 పుస్తకాలు

తెలివైన కోడి, నల్లపిల్లి - తెల్లపిల్లి, తోడేలు తెలివి, ముందుచూపు, భలేగుడ్డు, తెలివైన తాబేలు ఇదంతా బాల సాహిత్యం. ఇవన్నీ పిల్లల కథల పుస్తకాలు. ఒకప్పుడు పిల్లలకు పేదరాసి పెద్దమ్మ, ఒక రాజుకు ఏడుగురు కొడుకులు వంటి కథలను కుటుంబపెద్దలు చెప్పేవారు. ఆధునిక యుగంలో ఈ పరిస్థితి కనిపించడం లేదు. పిల్లలతో చదివించడానికి, చదివిన కథలను చెప్పడానికి 101 కథల పుస్తకాలు పుస్తక మహోత్సవంలో ప్రత్యేకంగా ఉన్నాయి. ఈ పుస్తకాలను విజయవాణి ప్రింటర్స్ ప్రచురించింది. స్టాల్ నంబరు 31, 32లో ఈ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఈ 101 పుస్తకాలను రూ.50కే ప్రచుకరణకర్తలు విక్రయిస్తున్నారు.



## స్వీయ రచనలకూ డిమాండ్!

విజయవాడ కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ బుక్ ఎగ్జిబిషన్‌లో సాహిత్య విభాగంలో ఎక్కువగా కథల పుస్తకాల హవా నడుస్తోంది. కథలు రాసిన రచయితలే స్వయంగా పుస్తకాలు వేసుకొని విక్రయాలకు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత, రచయిత వేంపల్లె షరీఫ్ తన తాజా కథల పుస్తకం 'చారల పిల్లి' గురించి వివరించారు. ఈ కాలానికి తగ్గట్టుగానే ఇప్పటి రచయితలు కథాంశాలు ఎంచుకొని రాస్తున్నారు. మారిన కాలంలో పెరిగిన జీవన వేగం, ఒత్తిళ్లు, స్త్రీ పురుష సంబంధాలు, పెరిగిన మతనమ్మకాలు వంటి అంశాలను తన కథల పుస్తకం 'చారలపిల్లి'లో వివరించాను. కథన పద్ధతిలోను కొంత కొత్తదనం పుస్తకంలో వుంది. తక్కువకాలంలో ఎక్కువ కాపీలు 'చారలపిల్లి' అమ్ముడుపోయింది. ప్రచురణకర్తలు వేసిన పుస్తకాలతో పాటు రచయితలే స్వయంగా వేసుకొన్న పుస్తకాలకూ ఈ బుక్ ఎగ్జిబిషన్‌లో మంచి అమ్మకాలు వున్నాయి. స్టాల్ నెం.42, 43, 44 రచయితల కోసం కేటాయించగా అందులో బాగా అమ్ముడుపోతున్న పుస్తకాల్లో రచయిత వైష్ణవి శ్రీ - అటుగా వంగిన ఆకాశం, నువ్వు వెళ్లే దారిలో కవితలు, చలపాక ప్రకాష్ - విజయవాడ దర్శనం, చలపాక నానీలు, అప్పగింతలు, సీహెచ్ శర్మ - కాలం చెప్పిన కథలు, శర్మ శతకం, సోమేపల్లి వశిష్ట - ఆకురాలిన చప్పుడు, నాని- 'నా' నానీలు, సుభాని-సామాజిక నానీలు, మేరీ కృపా బాయి-కథామంజరి, సీహెచ్ భవానీదేవి-సృజన కాంతి, భవానీ కవిత్వం, తల్లి నీకు తలవంచి లాంటి రచనలు బాగా అమ్ముడవుతున్నాయి.




## భక్తి గ్రంథాల నిలయం.. 'భారతీ గ్రంథమాల'

విజయవాడ సిటీలైఫ్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మ, పద్మ, స్కాంద ఇవన్నీ పురాణాలు. శైవం, వైష్ణం, శాక్తా ఇవన్నీ ఆగమాలు. అష్టాధ్యాయి, వేదాంత ఇవన్నీ శాస్త్రాలు. వీటితో పాటు దేవీ భాగవతం, కార్తీకపురాణం, శివానందలహరి, గోవిందనామాలు, శ్రీ వేంకటేశ్వర మహత్యం వంటి ఆధ్యాత్మిక గ్రంథాలకు నిలయంగా భారతీ గ్రంథమాల ఉంది. పుస్తక మహోత్సవంలో స్టాల్ నంబరు 171లో ఈ ఆధ్యాత్మిక గ్రంథాలు అందుబాటులో ఉన్నాయి. ఆధ్యాత్మిక భావజాలం ఉన్నవారు, సీనియర్ సిటిజన్లు ఈ పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. నిత్య పూజా విధానం, వ్రతాలకు సంబంధించి పుస్తకాలు ఈ స్టాల్‌లో కొలువు దీరాయి.




---

## పీడీస్ బియ్యం కేసులో ..
# నిందితుల విచారణ

- హైకోర్టు ఆదేశాల మేరకు మళ్లీ జైలుకు
- మాజీ మంత్రి పేర్ని నాని గోడౌన్ వ్యవహారం


మచిలీపట్నం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ మాజీ మంత్రి పేర్ని నాని గోడౌన్‌లో మాయమైన బియ్యం కేసుకు సంబంధించి రిమాండ్‌లో ఉన్న గోడౌన్ మేనేజర్ మానస తేజ, మిల్లు యజమాని బొర్రా ఆంజనేయులు, లారీడ్రైవర్ బోట్ల మంగారావును పోలీసులు శుక్రవారం కస్టడీలోకి తీసుకుని విచారించారు. మచిలీపట్నం స్పెషల్ సబ్‌జైలు నుంచి నిందితులను మచిలీపట్నం తాలూకా పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. మచిలీపట్నం డీఎస్పీ అబ్దుల్‌సుభాన్, ఆర్‌పేట సీఐ ఏసుబాబు, మరో ఇద్దరు సీఐలు నిందితులను విచారించారు. విచారణ చేసే సమయంలో వీడియో తీశారు. పోలీస్ అధికారులు విచారణ చేస్తుండగా నిందితులు చెప్పిన విషయాలను వీఆర్వో రికార్డు చేశారు. బియ్యం మాయం కేసులో ఈ నెల 6న నిందితులను పోలీస్ కస్టడీకి తీసుకుని విచారణ సమయంలో న్యాయవాదులను దగ్గరగానే ఉంచారు. శుక్రవారం విచారణ జరుగుతున్న సమయంలో మాత్రం దూరంగా ఉంచారు. విచారణలో భాగంగా గోడౌన్ నుంచి బియ్యం తరలించడంలో ఎవరి ప్రమేయం ఉంది? ఎవరు చెబితే చేశారు? బియ్యాన్ని ఏయే ప్రాంతాలకు తరలించారు? ఎంతధరకు విక్రయించారనే అంశాలపై ప్రశ్నించినట్టు సమాచారం. బియ్యం విక్రయించిన తర్వాత నగదు లావాదేవీలకు సంబంధించిన అంశాలపైనా వివరాలు సేకరించారు. పేర్ని నాని, ఆయన భార్య పేర్ని జయసుధ పేర్లు ప్రస్తావనకు వచ్చిన సమయంలో గోడౌన్ మేనేజర్ మానస్ తేజ పోలీసులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పకుండా దాటవేత ధోరణితోనే వ్యవహరించి పూర్తి వివరాలు తెలపలేదని సమాచారం. బియ్యం విక్రయంలో నగదు లావాదేవీలకు సంబంధించిన అంశాలపైనా వివరాలు రాబట్టారు.

**విచారణ అనంతరం మళ్లీ జైలుకు**

బియ్యం మాయం కేసులో రిమాండ్‌లో ఉన్న ముగ్గురు నిందితులను రెండు రోజులపాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ మొబైల్ కోర్టు న్యాయమూర్తి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. పోలీస్ కస్టడీలోనే రెండు రోజులపాటు నిందితులు ఉండాలి. అయితే నిందితులపై పోలీసులు ఒత్తిడి తెచ్చే అవకాశం ఉందని నిందితుల తరఫున న్యాయవాదులు శుక్రవారం హైకోర్టును ఆశ్రయించారు. వారి కోరిక మేరకు నిందితులను శుక్రవారం సాయంత్రానికి సబ్ జైలుకు పంపి, శనివారం మళ్లీ కస్టడీకి తీసుకునేలా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈమేరకు సాయంత్రం నిందితులను తిరిగి సబ్ జైలుకు పంపారు.

## మరో రూ.2,818.21కోట్లతో
# రాజధాని టెండర్లు

విజయవాడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : రాజధాని నిర్మాణంలో భాగంగా అమరావతి రాజధాని అభివృద్ధి సంస్థ మరోమారు రూ.2,818.21 కోట్ల విలువైన పనులకు భారీగా టెండర్లు పిలిచింది. వీటిలో, నేలపాడులో ఎన్జీవో గృహాలకు సంబంధించి మొత్తం 1140 అపార్ట్‌మెంట్ యూనిట్స్‌కు స్టిల్ట్ + 12 అంతస్తులతో కూడిన 12 టవర్లలో ఆర్కిటెక్చరల్ ఫినిషింగ్ వర్క్స్, ఇంటర్నల్-ఎక్స్‌టర్నల్ ఎలక్ట్రికల్ వర్క్స్, ప్లంబింగ్, శానిటరీ, లిఫ్ట్స్, డీజీ సెట్స్, బిల్డింగ్ సెక్యూరిటీ సిస్టమ్స్, అంతర్గత రోడ్లు, వీధి దీపాలు వంటివి ఏర్పాటు చేయటానికి రూ.607.50 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచింది. అలాగే, మరో 855 అపార్ట్‌మెంట్ యూనిట్స్‌కు సంబంధించి స్టిల్ట్+12అంతస్తులతో కూడిన 9టవర్లకు పైన చెప్పుకున్న పనులకు రూ.594.36కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచింది. భూసమీకరణ లే అవుట్లలో రోడ్లు, డ్రెయిన్లు, వాటర్ సప్లై నెట్‌వర్క్, యుటిలిటీ డక్ట్స్ వంటివి ఏర్పాటు చేయటానికి రూ.1,085.68 కోట్ల వ్యయంతో ఏడీసీ టెండర్లు పిలిచింది. భూ సమీకరణ లే అవుట్లలో పైన చెప్పుకున్న పనులు చేసేందుకు మరో 530.83 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచింది. అఖిలభారత సర్వీసు అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లకు సంబంధించి చేపట్టాల్సిన బ్యాలెన్స్ పనుల కోసం ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ ఏర్పాటుకు టెండర్లు పిలిచింది.



## ఏ ఒక్కరినీ విడిచివెళ్లొద్దు

- ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చండి
- ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

బస్‌స్టేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : బస్టాండ్‌లో వేచిఉండే ఏ ఒక్క ప్రయాణికుడినీ విడిచిపెట్టకుండా ఎక్కించుకోవాలని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ సూచించారు. శుక్రవారం విజయవాడ జోన్ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్రాంతిని పురస్కరించుకుని ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆయన ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి సొంతూళ్లకు చేరుకునే వారికి ఎలాంటి ఆటంకాలు రాకుండా చూడాలన్నారు. హైదరాబాద్ నుంచి సంక్రాంతి రద్దీని పురస్కరించుకుని బస్సులను పర్యవేక్షిస్తున్న సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అప్పలరాజుతో ఫోన్‌లో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌కు వెళ్లి వచ్చే డ్రైవర్లు ప్రమాదాల బారిన పడకుండా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. అవసరమైతే బస్సులను పెంచాలన్నారు. విజయవాడ, ఇతర ముఖ్య స్టేషన్లలో ప్రయాణికుల రద్దీని తగ్గించాలన్నారు. పోలీసుల సహాయం తీసుకుని ప్రైవేటు వాహనదారుల దోపిడీని నివారించాలన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు డ్రైవర్లకు, ఉన్నతాధికారులు తగిన సూచనలు చేయాలన్నారు. పొగమంచు కారణంగా ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. బస్సుల వివరాలు సమాచార కేంద్రం ద్వారా ప్రయాణికులకు అందించాలన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో సంక్రాంతి పండగ పురస్కరించుకుని 20వ తేదీ వరకు హైదరాబాద్‌కు 621, రాజమండ్రికి 235, విశాఖపట్నం 122, బెంగళూరు 37, చెన్నై 27, ఇతర ప్రాంతాలన్నింటికీ కలిపి 328, మొత్తం 1,370 ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచినట్టు నారాయణ తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.విజయరత్నం, జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.వై.దానం పాల్గొన్నారు.

## అధిక ధర వసూలు చేస్తే బస్సులు సీజ్

- ప్రయివేటు ట్రావెల్స్ ఆపరేటర్లకు డీటీసీ మోహన్ హెచ్చరిక

కృష్ణలంక, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ప్రయాణికుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నట్టు మా దృష్టికి వస్తున్నాయి.. అటువంటి బస్సులపై కేసులు నమోదు చేస్తాం.. అని డీటీసీ మోహన్ హెచ్చరించారు. బందరురోడ్డులోని డీటీసీ కార్యాలయంలో ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులతో డీటీసీ మోహన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దూరపు ప్రాంతాల నుంచి ప్రయాణికుల రాకపోకలు ఎక్కువగా వుండటంతో, దానిని అదనుగా తీసుకొని కొంతమంది ప్రైవేటు బస్సు ఆపరేటర్లు ప్రయాణికుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నట్టు వార్తా పత్రికల్లో కథనాలు వస్తున్నాయని ఆయన తెలిపారు. విజయవాడ కేంద్రంగా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు. విశాఖపట్నం ఇలా అనేక దూరప్రాంతాలకు ప్రైవేట్ బస్సులు వెళ్లడం జరుగుతోందని, నిర్ణీత ధరల కన్నా ఒక్క రూపాయి కూడా ఎక్కువ వసూలు చేయవద్దని బస్సు ఆపరేటర్లకు డీటీసీ సూచించారు. లేదంటే మోటారు వాహనాల చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీటీసీ హెచ్చరించారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా పదిమంది మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లతో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈనెల 8 నుంచి ప్రత్యేక బృందాలతో జిల్లాలో పలుచోట్ల తనిఖీలు చేపట్టడం జరిగిందని 20వ తేదీ వరకు తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు. ప్రయాణికుల నుంచి ఎక్కువగా చార్జీలు వసూలు చేసినట్టు తెలిస్తే ఆయా బస్సులపై కేసులు నమోదు చేయడమే కాకుండా బస్సులను సీజ్ చేస్తామని ఆయన తెలిపారు. అధిక చార్జీలు వసూలు చేసిన ప్రయాణికులకు ఇబ్బంది కలిగించినట్టయితే ఆయా బస్సులపై ఈ ఫోన్ నెంబర్ ద్వారా 9154294698 ఫిర్యాదు చేయవచ్చని డీటీసీ తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీవోలు ఆర్.ప్రవీణ్, వెంకటేశ్వరరావు, ప్రైవేటు బస్సు ఆపరేటర్లు పాల్గొన్నారు.

## పండుగ దోపిడీకి బ్రేక్ వేయరా?

(5వ పేజీ తరువాయి)

రేట్లు పెంచేసి చూపిస్తున్నారు. ఇవేమీ రవాణా శాఖ అధికారులకు కనిపించట్లేదు. ప్రయాణికులు ఫిర్యాదు చేస్తేనే చర్యలు తీసుకుంటామని డీటీసీ మోహన్ ప్రకటించడం వెనుక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇద్దరు ఇన్‌స్పెక్టర్లకు ఆన్‌లైన్ పోర్టల్స్ తనిఖీ అప్పగించి, ఎవరు ఎక్కువగా చార్జీలు వసూలు చేస్తున్నారో గుర్తించి చర్యలు తీసుకోవచ్చు. రెడ్‌బస్, అభిబస్‌లో దాదాపు అన్ని ప్రైవేట్ ఆపరేటర్లు తమ బస్సుల రేట్లను అప్‌లోడ్ చేస్తారు. ఏ ట్రావెల్ ఏజెన్సీ అధిక ధరలను నిర్దేశిస్తే వారిపై కేసులు పెట్టొచ్చు. కానీ, రవాణా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవట్లేదు.

**బ్రేక్ వేయలేమా..**

వారం రోజులుగా ప్రైవేట్ బస్ ఆపరేటర్లు సంక్రాంతి దందాకు పాల్పడుతున్నారు. హైదరాబాద్, విశాఖపట్నం, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు సాధారణ చార్జీలో మూడు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నారు. ఈ విషయాన్ని వెబ్‌సైట్లలో కూడా పేర్కొంటున్నారు. తప్పనిసరి ప్రయాణాలు కాబట్టి ఎలాగైనా గమ్యస్థానాలకు చేరితే చాలని ప్రయాణికులు కూడా అడిగినంత ఇస్తున్నారు. ఇలాంటి సమయంలో ప్రయాణికులు ఎలా ఫిర్యాదు చేసే అవకాశం ఉండదు. కాబట్టి ప్రయాణికుల నుంచి ఫిర్యాదుల కోసం వేచి చూడకుండా వెబ్‌సైట్లపై దృష్టిసారిస్తే ట్రావెల్స్ యాజమాన్యాలపై కేసులు నమోదు చేయొచ్చు. సంక్రాంతి పేరిట జరుగుతున్న దోపిడీకి అడ్డుకట్ట వేయొచ్చు.

**లారీలపై కేసులు**

పండుగ రద్దీలో అధికారులు ప్రైవేట్ బస్సులపై కాకుండా లారీలపై దృష్టిపెట్టారు. ప్రైవేట్ ఆపరేటర్ల నుంచి నెలవారీ ముడుపులు రావటం వల్లే దాడులు చేయట్లేదని, లారీలైతే ముడుపులు ఇచ్చే పరిస్థితి ఉండదు కాబట్టే కేసులు రాస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఎన్‌హెచ్-16, 65, 30, 216, విజయవాడ వెస్ట్ బైపాస్, ఇన్నర్ రింగ్‌రోడ్డుపై లారీలను అటకాయిస్తున్నారు. పైగా కొందరు ఇన్‌స్పెక్టర్లు ప్రైవేట్ సిబ్బందిని పెట్టుకుని భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద నెలల పాటు రవాణా శాఖ అధికారులు దారి దోపిడీ పాల్పడిన సంగతి తెలిసిందే. మళ్లీ ఇప్పుడు మరో బృందం దారి దోపిడీకి తెరతీసింది. గన్నవరం వైపు నిడమానూరు ఓల్వో షోరూమ్ దగ్గర మరో బృందం ప్రైవేట్ వ్యక్తులతో లారీలను నిలుపుదల చేసి వసూలు చేస్తోంది.

# శ్రీవారి అన్నప్రసాద ట్రస్టుకు రూ.2 వేల కోట్ల విరాళాలు

- 'వడ్డీతోనే అన్నప్రసాదాల వితరణ' లక్ష్యం సాకారం
- 1985లో నిత్యాన్నదాన పథకాన్ని ప్రారంభించిన ఎన్టీఆర్
- తర్వాత శ్రీవేంకటేశ్వర నిత్యాన్న ప్రసాదం ట్రస్ట్‌గా మార్పు

తిరుమల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు భక్తులు అందజేస్తున్న విరాళాలు రూ.2 వేల కోట్లు దాటాయి. కొండపైన భక్తులతో పాటు తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం, గోవిందరాజస్వామి ఆలయం, తిరుచానూరు అమ్మవారి ఆలయాల వద్ద యాత్రికులతో పాటు రుయా, స్విమ్స్, మెటర్నిటీ, బర్డ్, ఆయుర్వేద ఆస్పత్రుల వద్ద రోగుల నుంచి ఆకలి అనే మాట వినిపించకుండా అన్నప్రసాదాలను ఈ ట్రస్టు అందజేస్తోంది. శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఉచితంగా అన్నప్రసాదాలను అందజేయాలనే ఉద్దేశంతో 1985 ఏప్రిల్ 6న అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు నిత్యాన్నపథకాన్ని ప్రారంభించారు. ఇది 1994 ఏప్రిల్ 1న శ్రీవేంకటేశ్వర నిత్యాన్నదానం ట్రస్టుగా మారింది. ఆ తర్వాత శ్రీవేంకటేశ్వర నిత్యాన్నప్రసాదంగా ట్రస్టు పేరును మార్చారు. తొలుత తిరుమలలో ప్రధాన కల్యాణకట్ట వద్ద అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ఆ తర్వాత రద్దీని దృష్టిలో పెట్టుకుని వరాహస్వామి ఆలయం వద్ద మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ నిత్యాన్న ప్రసాద భవనం పేరుతో నిర్మించిన భారీ భవనాన్ని 2011 జూలై 7న అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ ప్రారంభించారు. ఈ ట్రస్టుకు 1985లో తొలిసారి చెన్నైకు చెందిన ఎల్వీ రమణ అనే భక్తుడు రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చారు. అప్పటి నుంచి భక్తులు తమ స్థాయికి తగ్గట్టు విరాళాలు అందజేసి స్వామిపై భక్తిని చాటుకుంటున్నారు. అలాగే అంబానీ వంటి ప్రముఖ పారిశ్రామిక వేత్తలు కోట్లాది రూపాయలు ట్రస్టుకు విరాళంగా ఇస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో 2018 సెప్టెంబరు నాటికి ట్రస్టుకు రూ.వెయ్యి కోట్లు చేరాయి. ఇక, తాజాగా పదిరోజుల క్రితం ఈ విరాళాలు రూ.2 వేల కోట్లు దాటాయి. ప్రస్తుతం అన్నప్రసాదాల వితరణకు టీటీడీకి ఏటా రూ.130 కోట్ల నుంచి రూ.140 కోట్లు ఖర్చవుతోంది. ప్రస్తుతం వివిధ బ్యాంకుల్లో ఉన్న ఈ రూ.2వేల కోట్ల డిపాజిట్ల ద్వారా ఏడాదికి దాదాపు రూ.140 కోట్ల వరకు వడ్డీ రానుంది. అన్నప్రసాదాల వితరణకు అయ్యే ఖర్చును ఈ వడ్డీ ద్వారానే నిర్వహించాలని టీటీడీ లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికి అది నెరవేరింది.



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

## బిల్లులు చెల్లించి ఆదుకోండి!

- సీఎంకు సబ్కా రాష్ట్ర అధ్యక్షుడు విజయకుమార్ లేఖ

విజయవాడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వచ్చినా రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటి వరకు చిన్న కాంట్రాక్టర్లకు ఒక్క రూపాయి కూడా బకాయి బిల్లులు విడుదల చేయకపోవటం బాధాకరమని సబ్కా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.విజయ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. బకాయి బిల్లులు చెల్లించాలని దసరా, దీపావళి పండుగల సమయాల్లోనూ ప్రభుత్వాన్ని కోరామన్నారు. ఇప్పటికైనా స్పందించి ఆ దిశగా ఆలోచన చేయాలని కోరారు.

## గ్రావెల్ దందా!

(5వ పేజీ తరువాయి)

నుంచి గన్నవరంలోకి గ్రావెల్, మట్టితో వచ్చే లారీలను అడ్డుకుంటున్నారు. నూజివీడు నియోజకవర్గంలోని కనసానపల్లిలో ఆర్ఎస్ నంబరు 117 నుంచి అడ్డగోలుగా గ్రావెల్ తవ్వి తరలించేస్తున్నారు. 2017-18లో ఈ క్వారీకి ఏడు ఎకరాలకు అనుమతి తీసుకుని ప్రస్తుతం 14 ఎకరాల వరకు తవ్వేశారు. సమీపంలోని డీఫారం పట్టాలు సైతం కొనుగోలు చేసి అక్రమ క్వారీయింగ్ చేస్తున్నారు. అక్కడ తవ్విన గ్రావెల్‌ను గన్నవరం నియోజకవర్గంలోని వెంచర్లకు, విజయవాడ రూరల్ ప్రాంతాల్లోని వెంచర్లకు తరలిస్తున్నారు. గన్నవరం నియోజకవర్గంలో క్వారీయింగ్‌ను పూర్తిగా నిలిపివేశారు. ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న లారీలను స్థానిక నేతలు అడ్డుకుంటున్నారు. పైగా అక్రమ క్వారీయింగ్ చేసే వారంతా వల్లభనేని వంశీ అనుచరులు, గతంలో వైసీపీలో చురుగ్గా ఉన్న వారు కావడంతో గన్నవరం నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లు కత్తులు నూరుతున్నారు.

**పండుగ రోజుల్లో దోచేసే పథకం**

శనివారం నుంచి వరుసగా ఐదు రోజులపాటు సంక్రాంతి సెలవులు. ఈ రోజుల్లో అధికారుల నిఘా పెద్దగా ఉండదనే అంచనాతో పెద్ద ఎత్తున గ్రావెల్, పోలవరం మట్టి తవ్వి తరలించేందుకు అక్రమార్కులు సన్నాహాలు చేసుకుంటున్నారు. పాతపాడు, కొత్తూరు తాడేపల్లి ప్రాంతాల్లో ఇప్పటికే వందల సంఖ్యలో టిప్పర్లు, జేసీబీలను మోహరించారు.

## సంక్రాంతి పండుగ సందర్భంగా
## చర్లపల్లి - విశాఖ మధ్య జనసాధారణ్ ప్రత్యేక రైళ్లు

వన్‌టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల రద్దీని పురస్కరించుకుని దక్షిణ మధ్య రైల్వే రిజర్వ్ చేయని జనసాధారణ్ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నది. ఈనెల 11, 13, 16, 18 తేదీల్లో జనసాధారణ్ అన్‌రిజర్వ్ స్పెషల్ రైలు (08534) చర్లపల్లి-విశాఖపట్నం మధ్య నడవనున్నది. చర్లపల్లిలో ఉదయం 8.30 గంటలకు బయలుదేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు విశాఖపట్నం నుంచి 10, 12, 15, 17 తేదీల్లో నడవనున్నది. ఉదయం 9.45 గంటలకు బయలుదేరుతుంది. ఈ రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో ఆగుతుంది. కాగా, 08537 విశాఖపట్నం-చర్లపల్లి రైలు ఈనెల 10, 15, 16 తేదీల్లో విశాఖపట్నం నుంచి సాయంత్రం 6.20 గంటలకు బయలుదేరుతుంది. మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ రైలు నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో ఆగటంతో పాటు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో ఆగుతుంది.



**బ్రాయిలర్ ధరలు**

అమరావతి (రూ.లలో)

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 112,120, 131 |
| చికెన్ విత్ స్కిన్ | 210 |
| చికెన్ స్కిన్‌లెస్ | 220 |



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

## ఆరుగురు ఏఎస్ఐలకు, పీసీలకు పదోన్నతులు

విజయవాడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కమిషనరేట్‌లో ముగ్గురు ఏఎస్ఐలకు ఎస్ఐలుగా, మరో ముగ్గురు కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేళ్లగా పదోన్నతులు లభించాయి. పి.సత్యనారాయణ, జె.ప్రమీలారాణి, పి.వరలక్ష్మి ఏఎస్ఐ నుంచి ఎస్ఐలుగా పదోన్నతి పొందారు. డి.నాగసురేష్, పి.ప్రసన్న, ఎం.సురేష్‌కు కానిస్టేబుల్ నుంచి హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి వచ్చింది. వాళ్లంతా పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ రాజశేఖరబాబును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. సీపీ వారిని అభినందించారు.

**మీ కోసం**

మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా?
అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుంది.
మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కాకూడదు.
పది మందికి, మీ ప్రాంత వాసులందరీ సమస్య అయి ఉండాలి.
మీరు సంప్రదించాల్సిన వాట్సప్ నెంబరు
9985411602
సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి

# అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

భారతీనగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా కళాశాల ప్రాంగణంలో శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌జె కిషోర్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి.ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం, అమరావతి బాలోత్సవ కమిటీ కార్యదర్శి పిన్నమనేని మురళీ కృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలన్నారు. కళాశాల ప్రాంగణంలో భోగి మంటలు వేశారు, రంగు రంగుల ముగ్గుల వేసి గొబ్బెమ్మలతో అలంకరించారు. విద్యార్థుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఫాదర్ జి .కిరణ్ కుమారు, యూజీ కో ఆర్డినేటర్ ఎల్ శుభ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**లబ్బీపేట:** సాయిమేధా కోచింగ్ సెంటర్‌లో రంగవల్లులు, బొమ్మలకొలువు, గంగిరెద్దుల విన్యాసాలు, కోలాటాలు, హరిదాసు కీర్తనలతో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. డైరెక్టర్ మజ్జిగ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



లయోలా కళాశాలలో..



హోటల్ ఫార్చ్యూన్ మురళీలో ..

● సిద్ధార్థ మహిళా కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.

● హోటల్ ఫార్చ్యూన్ మురళీలో సంక్రాంతి శోభ ఉట్టిపడేలా భోగి మంటలు, చిలక జోతిష్యం, గంగిరెద్దుల నృత్యం, హరిదాసు ప్రదర్శనలతో పాటు పిండి వంటలతో అల్పాహార విందు ఏర్పాటు చేశారు.

**మొగల్రాజపురం:** స్థానిక సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ప్రిన్సిపాల్ అరవింద్ బాబు ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు స్కిట్స్ ప్రదర్శించారు. గంగిరెద్దులు, హరిదాసు కీర్తనలు, ముగ్గులు, సంప్రదాయ నృత్యాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సందడి చేశారు. అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ఎలికే మోహన్‌రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.సంప్రదాయ వంటలతో మైమరిపించారు.

**గుణదల:** మారుతీనగర్లోని యూరో కిడ్స్ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. హరిదాసు వేషధారణ, పంచెకట్టుతో చిన్నారులు చేసిన సందడి, భోగిమంటలు, పిండి వంటలు, వరి పంట కుప్ప నూర్చడం, భోగిపళ్ళను పోసి చిన్నారులను ఆశీర్వదించడంతో పండుగ వాతావరణం సంతరించుకుంది. చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. యూరో కిడ్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో



యూరో కిడ్స్ పాఠశాలలో

## సంప్రదాయ దుస్తుల్లో మెరిసిన వైద్య విద్యార్థులు

గన్నవరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు భోగి మంటలు వేసి సంక్రాంతి వేడుకలను ప్రారంభించారు. దంత వైద్య విద్యార్థులు, డాక్టర్లు పట్టు పరికిణీలు, లంగా ఓణీలు, పంచెకట్టు, లాల్చీ, పై పంచెలు, మెడలో కండువాలు వేసుకుని సందడి చేశారు. భోగిమంటల చుట్టూ డ్యాన్స్‌లు చేశారు. కోలాటం వేశారు. విద్యార్థినులు కోడి పందేలు వేశారు. పుంగనూరు గిత్తలపై సవారి చేశారు. హరిదాసునితో, గంగిరెద్దులతో, కోడిపుంజులతో, గిత్తలతో సెల్ఫీలు, ఫొటోలు దిగారు. సంక్రాంతి విశిష్టతను డాక్టర్ నాగేశ్వరరావు వివరించారు. కన్వీనర్ పాలడుగు నాగసాయి, మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీరామోజీరావు, ఏవో వై.మధుసూదనరావు పాల్గొన్నారు.



భోగి మంటలు వెలిగిస్తున్న సిద్ధార్థ దంత వైద్యకళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ నాగేశ్వరరావు

### ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో...



**పెనమలూరు:** గడ్డితో వేసిన గుడిసెలతో, సంప్రదాయ వస్తువుల ప్రదర్శనతో, వివిధ రకాల బొమ్మల కొలువులతో, రంగవల్లులతో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకొంది. విద్యార్థులు గోదాదేవి కల్యాణ రూపకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. గొబ్బిపాటలు, కొత్త బియ్యంతో చేసిన పొంగలి, సంప్రదాయ వంటలు కార్యక్రమానికి కొత్త వెలుగులు నింపాయి. చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి భోగిపళ్ల, భోగి మంటలు, గంగిరెద్దులు, హరిదాసుల కీర్తనలు తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఛైర్మన్ పరిమి నరేంద్రబాబు, డైరెక్టర్లు పవన్ చంద్, కడియాల ప్రవీణ్, అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజు, ప్రిన్సిపాల్ భువనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ భాటియా పాల్గొన్నారు.

## ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే చంద్రబాబు లక్ష్యం

### ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా ఏపీని తీర్చదిద్దడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. పటమట అశోక్‌నగర్‌లో ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఆరో డివిజన్‌కు చెందిన వంకర్ల లోవరాజుకు రూ.1,27,076ల విలువగల ఎల్‌వోసీ మంజూరు అవ్వగా లబ్ధిదారునికి అందించారు.

11 వ డివిజన్‌కు చెందిన నారాయణపురం సూరిబాబుకు ఇస్త్రీ పెట్టె ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలపై వైద్య ఖర్చుల భారం లేకుండా చేయడమే చంద్రబాబు ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో చెన్ను పాటి గాంధీ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



# పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

### నూతన వస్త్రాల పంపిణీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటుగా కార్పొరేషన్‌కు అవార్డులు తీసుకురావడంలో వారి పాత్ర కీలకమని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు.

తూర్పు నియోజకవర్గ పరిధి మూడో డివిజన్‌లోని కనకదుర్గనగర్ కాలనీకి చెందిన గాలి లక్ష్మీ అలేఖ్య 28వ జయంతి సందర్భంగా గాలి వెంకట రవికుమార్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మూడవ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న 100 మంది పారిశుధ్య కార్మికులకు శుక్రవారం గద్దె నూతన వస్త్రాలను అందజేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ కరోనా సమయంలో పారిశుధ్య కార్మికులు చేసిన సేవలు మరువలేనివని అన్నారు.

పారిశుధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటుగా స్వచ్ఛతా సర్వేక్షన్ ర్యాకింగ్‌లో అవార్డులు వచ్చే విధంగా అధికారులు చూస్తున్నారని అన్నారు. డివిజన్‌లో మొక్కలను క్రమపద్ధతిలో పెంచడం, పరిశుభ్రవాతావరణం ఉండేలా అధికారులు చూస్తున్నారని అన్నారు. పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి వారికి నూతన వస్త్రాలు అందజేసిన గాలి వెంకట రవికుమార్ కుటుంబసభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ సీఎంవోహెచ్ సురేష్‌బాబు, గాలి వెంకట రవి కుమార్, ఉషశ్రీ, గాలి గణేష్ సాయి చైతన్య, గద్దె క్రాంతిబాబు, గద్దె రమేష్, తాడి బాబూరావు, యలమంచిలి పండు, బండి కోమలి, ఏఎంహెచ్‌వో బాబూ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, తదితరులు

## నున్నలో జాతీయస్థాయి లంగడి పోటీలు

విజయవాడ రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో జాతీయ స్థాయి లంగడి పోటీలు శుక్రవారం ప్రారంభ మయ్యాయి. ఆంధ్రప్రదేశ్ లంగడి అసోషి యేషన్ ఆధ్వర్యంలో జరిగిన 14వ జాతీయ స్థాయి లంగడి పోటీలను గ్రామ సర్పంచ్ కాటూరి సరళ ప్రారంభించారు. అండర్ - 19 బాలురు, బాలికల విభాగాల్లో జరిగిన పోటీల్లో వివిధ రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు పోటీలు నిర్వహించి ఈనెల 12న విజేతలను ప్రకటిస్తామని నిర్వాహకులు తెలియజేశారు. లంగడి అసోషియేషన్ సభ్యులు ఏ. గాంధీ, సురేష్, లక్ష్మీ వెంకటేశ్వరరావు, అరవ రమేష్, శివరామ్ పాల్గొన్నారు.



లంగడి పోటీలను ప్రారంభిస్తున్న అసోసియేషన్ సభ్యులు

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

**పటమట:** స్క్యూ బ్రిడ్జ్ విద్యుత్ ఉప కేంద్రం మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు పకీర్‌గూడెం, ప్రగతినగర్, టిక్కిల్ రోడ్డు, శ్రీరాంనగర్, చంద్రమౌళిపురం, మొహిద్దీన్ ఎస్టేట్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, పోస్టాఫీసు రోడ్డు, పటమటలంక, కన్నా నగర్, నారా చంద్రబాబు నాయుడు కాలనీ, బెంజిసర్కిల్, రాఘవానగర్, నేతాజీరోడ్డు, సీతారామనగర్, ఆశ్రమం రోడ్డు, మసీదు స్ట్రీట్, బాలాజీనగర్, గీతానగర్, పోలీస్‌కాలనీ, రాణిగారితోట, బాపనయ్యనగర్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ రవీంద్రబాబు తెలిపారు.



## ఘనంగా 'నిర్మల' స్పోర్ట్స్ డే

పటమట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పటమటలోని నిర్మల కాన్వెంట్ స్పోర్ట్స్ డే వేడుకలు శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగాయి. పాఠశాల మైదానంలో జరిగే ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని చిన్ని, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి భానుమూర్తిరాజు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రెవరెండ్ మువ్వల ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. స్కూల్ కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ రోబెల్ మాథ్యు ప్రారంభోపన్యాసం చేశారు. విద్యార్థుల ప్రార్థనాగీతం, వెల్కమ్ డ్యాన్స్, మార్చ్‌ఫాస్ట్, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఐక్యతకు ప్రతీకగా క్రీడాజ్యోతిని వెలిగించారు.

## నేటి నుంచి ఆరుద్రోత్సవాలు

వన్‌టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఉపాలయం శివ కామసుందరీ, నటరాజస్వామి ఆలయంలో శనివారం నుంచి ఆరుద్రోత్సవాలు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. మూడు రోజులపాటు వైదిక కార్యక్రమాల్లో భాగంగా శని వారం విఘ్నేశ్వరపూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

ఆదివారం స్వామివారి కల్యాణం జరుగుతుంది. సోమవారం పూర్ణాహుతితో కార్యక్రమాలు ముగుస్తాయ న్నారు. కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ.1,116లుచెల్లించి పాల్గొనవచ్చన్నారు.

### అలరించిన నాట్య ప్రదర్శన

తెలంగాణలోని కామారెడ్డి జిల్లాకు చెందిన రంజిత్‌కుమార్ శైలజల శిష్య బృందం శుక్రవారం దుర్గగుడి కళావేదిక పై సంప్రదాయ నృత్యాలు చేసి ఆహుతులను అలరించారు.

డిప్యూటీ ఈవో రత్నరాజు ప్రసాదం, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

## భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

పటమట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా పటమట పరిధిలోని వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వారా దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. స్వామిని దర్శంచుకున్నారు. గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో వినాయకుడ్ని ఉత్తర ద్వారంలో ఏర్పాటు చేశారు. మహిళలు భగవద్గీత పారాయణం చేశారు.

### గురునానక్ కాలనీ రామాలయంలో ...

**భారతీనగర్:** గురునానక్ కాలనీలోని రామమందిరంలో, ఎన్టీఆర్ కాలనీలోని శ్రీ కోదండ రామాంజనేయ, శ్రీ విజయకార్యసిద్ధి గణపతి ఆలయంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో సీతారాములను గరుడ వాహనంపై ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని వేకువ జాము నుంచి ఉత్తర ద్వారం ద్వారా పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు.



దత్తపీఠంలో భగవద్గీత పారాయణం చేస్తున్న మహిళా భక్తులు

### 2500 మందికి అన్నదానం

నాగార్జున నగర్ కాలనీలోని సాయిధ్యాన మందిరంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామిని గరుడ వాహనంపై ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 2500మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు వీరమాచినేని పూర్ణచంద్రరావు, దాడి సుబ్బారావు, జితేంద్ర, సజ్జ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



గురునానక్ కాలనీలోని రామమందిరంలో. .

## ప్రధాన డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టండి

### కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర

చిట్టినగర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులకు ఆటంకం కలగకుంగా మురుగునీటి పారుదల సక్రమంగా జరిగేలా ప్రధాన డ్రెయిన్లు , వాటికి అనుసంధానంగా ఉన్న డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఈట్ స్ట్రీట్, ఏలూరు రోడ్డు, మాచవరం, ఈఎస్ఐ హాస్పటల్, క్రీస్తురాజుపురం, ఏఎస్ రామారావురోడ్డు, హరిజన వాడ, లయోలా కాలేజీ రోడ్డు, మధు చౌక్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను కమిషనర్ పలువురు అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంలో పలుప్రాంతాల్లో డ్రెయిన్లను పరిశీలించారు. క్రీస్తురాజపురం, హరిజనవాడలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలఅన్నారు. ఈఎస్ఐ హాస్పటల్ ప్రాంతంలో డ్రెయిన్‌కు మరమ్మతులు నిర్వహించాలని, మధు చౌక్ సెంటర్ గుహల వద్ద డ్రెయిన్ నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ ప్రభుదాస్, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎస్ఈలు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి పాల్గొన్నారు.



## వైసీపీ శవరాజకీయాలు మానుకోవాలి

### ఈమని సూర్యనారాయణ హితవు

వన్‌టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ శవరాజకీయాలు మానుకోవాలని టీడీపీ జిల్లా అధికారి ప్రతినిధి, పార్టీ బ్రాహ్మణ సాధికార సమితి అధికార ప్రతినిధి ఈమని సూర్యనారాయణ హితవు పలికారు. శుక్రవారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి ఘటనపై జ్వాలాపురం శ్రీకాంత్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండిస్తున్నట్లు తెలిపారు. సంఘటన జరిగిన కొన్ని గంటల సమయంలోనే పలువురు మంత్రులు సంఘటనా స్థలానికి చేరుకోవటం, మృతుల కుటుంబాలను పరామర్శించటం, మృతులకు సంతాపం తెలియపరచటం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి మరునాడు వెళ్లారని, గాయపడిన ప్రతి ఒక్కరినీ పేరు పేరునా పరామర్శించి వారికి అన్నివిధాల ధైర్యం చెప్పిన ప్రభుత్వ నేత ముఖ్యమంత్రి అని తెలుసుకోవాలన్నారు. వైసీపీ శవ రాజకీయాలు చేయడాన్ని మానుకోవాలన్నారు. ఇప్పటికైనా బాధ్యతగల పార్టీగా వ్యవహరించాలని ఆయన కోరారు.




మంత్రి నారాయణను సత్కరిస్తున్న క్రెడాయ్ ప్రతినిధులు

## క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభం

**విజయవాడ, జనవరి 10(ఆంధ్రజ్యోతి):** క్రెడాయ్ విజయవాడ 10వ ప్రాపర్టీ షోను ఏ కన్వెన్షన్‌లో మంత్రి నారాయణ శుక్రవారం ప్రారంభించారు. శని, ఆదివారాల్లోనూ ప్రదర్శన కొనసాగనుంది. నిర్మాణ రంగంలోనే కాకుండా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్రెడాయ్‌ను మంత్రి నారాయణ అభినందించారు. మధ్య తరగతి ప్రజల కల సొంతింటిని సాకారం చేస్తూ గృహ పరికరాలకు సంబంధించిన అన్ని రకాల వారిని ఒక వేదికపైకి తేవడం ముదావహమన్నారు. బిల్డర్ల సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మరో ముఖ్య అతిథి మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి, రాష్ట్రాన్ని అద్భుతంగా అభివృద్ధి చేయడానికి కంకణం కట్టుకున్నారన్నారు. ఇసుక అందుబాటులోకి తెచ్చి, బిల్డింగ్ నియమాలు సులభతరం చేసినందుకు కూటమి ప్రభుత్వానికి క్రెడాయ్ విజయవాడ అధ్యక్షుడు దాసరి రాం బాబు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, బోడె ప్రసాద్, క్రెడాయ్ జాతీయ కార్యదర్శి జి.రామ్‌రెడ్డి, ఎస్‌బీఐ సీజీఎం పటేల్, క్రెడాయ్ ఏపీ అధ్యక్షుడు వైవీ రమణారావు, జాయింట్ సెక్రటరీ కె.రమేష్ అంకినీడు తదితరులు పాల్గొన్నారు.

- మామిడి తోటల్లో చకచకా ఏర్పాట్లు
- క్యాసినోను తలపిస్తూ బరుల చుట్టూ ఫెన్సింగ్
- వీక్షకుల కోసం ప్రత్యేక గ్యాలరీలు
- లక్షల్లో చేతులు మారుతున్న నగదు
- విజేతలకు బుల్లెట్ ఆఫర్లు!
- కూటమి, వైసీపీ నేతల మిలాఖత్
- నిస్సహాయస్థితిలో రెవెన్యూ, పోలీసులు

# బరి తెగింపు!



తాతకుంట్లలో క్యాసినో తరహాలో ఏర్పాట్లు

సంక్రాంతి జోష్ మొదలైంది. కోడిపందేల బరులకు నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేసేస్తున్నారు. హైకోర్టు నిబంధనలు ఉన్నా.. పోలీసు అధికారులు హెచ్చరికలు చేస్తున్నా.. లెక్కచేయక కోడి పందేల కోసం భారీ బరులను చకచకా సిద్ధం చేస్తున్నారు. క్యాసినోను తలపించేలా ఏర్పాట్లు జరిగిపోతున్నాయి. పలుచోట్ల కూటమి, వైసీపీ నేతలు కలిసికట్టుగా బరులను సిద్ధం చేయడం గమనార్హం.

**తిరువూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) :** నియోజకవర్గ పరిధిలోని తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాల్లో పందేలకు మామిడితోటల్లో భారీగా బరులను సిద్ధం చేస్తున్నారు. సత్తుపల్లి రోడ్డులో కోడిపందేలు జరిగే ప్రాంతం మొత్తం ఫెన్సింగ్‌తో పాటు, ఐరన్‌రాడ్లతో క్యాసినో తరహాలో బారికేడ్లు నిర్మిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు, పందెం రాయుళ్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, బరిచుట్టూ ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. నాలుగుమండలాల్లోని మామిడితోటల్లో, భారీ పందేలు వేసేందుకు ప్రత్యేక బరులతో పాటుగా, చిన్నచిన్న పందేలకు అనువుగా కొన్ని బరులు ఏర్పాటు చేస్తున్నారు. బరివద్ద ముసుగుపందేల్లో విజేతలకు బుల్లెట్ బైక్ బహుమతిగా ఇచ్చేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. బరుల సమీపంలో కోసు, గుండాట వంటి జూదాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. నిర్వాహకులకు పందేల కంటే కోసువల్లే అత్యధిక లాభాలు చేకూరుతాయి. ఇప్పటికే కోడిపందేల నిర్వాహకులతో సంబంధిత వ్యక్తులు బేరాలు కుదుర్చుకున్నట్టు సమాచారం. దూరప్రాంతాలకు చెందిన జూదగాళ్లు పండగ మూడురోజులు, పట్టణంలోనే ఉంటూ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే కొందరు కోడిపందేల నిర్వాహకులకు కోసు నిర్వాహకులు లక్షల్లో ముట్టజెప్పినట్టు తెలుస్తోంది. కోడిపందేల పేరుతో పలుచోట్ల అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు కలిసి మరీ ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. పట్టణ పరిధిలో ఏర్పాటు చేస్తున్న బరుల్లో ఒకటి టీడీపీ, వైసీపీ నేతలు నిర్వహిస్తుండగా, మరో బరిని జనసేన, టీడీపీ నేతలు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర సరిహద్దుప్రాంతాల్లో తోటల్లో తెలంగాణ మద్యం విక్రయాలు చేసేందుకు ఇప్పటికే భారీగా మద్యం దిగుమతి చేసుకున్నట్టు ఆరోపణలున్నాయి. కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముందస్తు హెచ్చరికలు చేసిన రెవెన్యూ, పోలీసు అధికారులు సమయం దగ్గరపడుతుండగా మిన్నకుండిపోయారు.



కోసూరులో సిద్ధం చేస్తున్న బరి

### ముమ్మర ఏర్పాట్లు

**కూచిపూడి:** కోసూరు, పెదపూడి, కూచిపూడి గ్రామాల్లో బరుల కోసం నిర్వాహకులు పొలాలను చదును చేసి స్తంభాలు పాతి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. మూడు రోజులపాటు రాత్రివేళల్లోనూ, ఫ్లడ్‌లైట్ల వెలుతురులో కోడి పందేలు, జూద క్రీడలు నిర్వహించుకునేలా జనరేటర్లు ఏర్పాటు చేస్తున్నారు. పందేలు వీక్షించేందుకు స్టేజీలు ఏర్పాటు చేస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం కూచిపూడిలో లాడ్జిలన్నీ బుక్ అయ్యాయి. బరుల వద్ద స్టాల్స్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎక్కువ పందేలు గెలిచిన వారికి ఆకర్షణీయమైన ఖరీదైన బహుమతులు అందిస్తామని నిర్వాహకులు ప్రచారం చేస్తున్నారు. కూటమి నేతలు, వైసీపీ నేతలు సంయుక్తంగా బరులు ఏర్పాటు చేయడం విశేషం. కూచిపూడి పోలీస్ స్టేషన్‌కు సమీపంలో బరులు ఏర్పాటు చేస్తున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు.



పెదపూడిలో బరి చుట్టూ పరదాలు కడుతున్న కూలీలు



గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

## క్యాలెండర్ ఆవిష్కరణ

**వన్‌టౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి):** గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం క్యాలెండర్‌ను శుక్రవారం రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆవిష్కరించారు. శుక్రవారం పుట్టిన రోజు సందర్భంగా మంత్రిని, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, మరికొందరు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు రాటకొండ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు విఠరియాల లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యుడు ఏజెర్ల ప్రభాకర్, ఎన్టీఆర్ జిల్లా డివిజన్ అధ్యక్షుడు ఎండీ సయ్యద్ బాజీ పాల్గొన్నారు.



రాష్ట్రంలో అంబేడ్కర్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలంటూ ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తున్న యూనివర్సిటీ పార్ట్‌టైమ్ ఉద్యోగులు

## అంబేడ్కర్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

**ధర్నాచౌక్, జనవరి 10(ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, 2024-25 అడ్మిషన్ నోటిఫికేషన్ ఇవ్వాలని బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్ పార్ట్‌టైమ్ స్టాఫ్, కౌన్సిలర్స్ అండ్ స్టూడెంట్స్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నాచౌక్‌లో రెండు రోజుల ధర్నాను శుక్రవారం వారు ప్రారంభించారు. 2024-25 అడ్మిషన్లు నిలిపివేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. యూనివర్సిటీలో అడ్మిషన్లు తీసుకుని ఇంకా కోర్సు పూర్తిచేయని రెండు లక్షల మంది రాష్ట్రానికి చెందిన వారున్నారన్నారు. రాష్ట్రంలోని అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులు చెల్లించే రూ21 కోట్లకు పైగా ఫీజులను తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. తక్కువ మొత్తంలో ప్రభుత్వం నిధులు కేటాయించినా రాష్ట్రంలో విశ్వవిద్యాలయం నిర్వహించవచ్చన్నారు. కె.ఈరన్న, ఎస్.రామచంద్రరావు, కె.జ్యోతి, అమరనాథ్, ఆదినారాయణ పాల్గొన్నారు.

## కోర్టుకు బుద్దా వెంకన్న, టీడీపీ నాయకులు

**వన్‌టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి):** వైసీపీ ప్రభుత్వంలో ప్రజా వ్యతిరేక విధానాలపై ఒకే రోజు నాలుగు ధర్నాలు చేసినందుకు పోలీసులు నమోదు చేసిన కేసుల్లో శుక్రవారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్నతో పాటు పలువురు మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు విజయవాడ సివిల్ కోర్టుకు హాజరయ్యారు. కోర్టు ఈనెల 21కు వాయిదా వేసింది. మాజీ కార్పొరేటర్లు బొబ్బూరి నారాయణస్వామి, పత్తి నాగేశ్వరరావు, యేదుపాటి రామయ్య, హబీబుల్లా, డివిజన్ అధ్యక్షుడు చిన్నసుబ్బయ్య సురభి బాలు, నారాయణ, మాల్యాద్రి, గంగవరపు సురేష్, శ్రీకాంత్ ఉన్నారు.

### 'విశాఖ ఉక్కు'పై బాబు, పవన్ స్పందించాలి: రామకృష్ణ

**అమరావతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి):** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల 8న విశాఖలో నిర్వహించిన ప్రధాని మోదీ సభలో విశాఖ స్టీల్‌ప్లాంట్ గురించి కనీసం ప్రస్తావించకపోవడం విచారకరమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను పట్టించుకోకుండా గాలికొదిలేస్తే చంద్రబాబు, పవన్ చరిత్రలో అనామకులుగా మిగిలిపోతారని పేర్కొన్నారు.

## టీటీడీ చైర్మన్‌ను అరెస్టు చేయాలి

- సెంటర్ ఫర్ పొలిటికల్ స్ట్రాటజీ అండ్ రిసెర్చ్ డిమాండ్

**అమరావతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి):** టీటీడీ పాలక మండలి చైర్మన్ బి.ఆర్.నాయుడును అరెస్టు చేయాలని సెంటర్ ఫర్ పొలిటికల్ స్ట్రాటజీ అండ్ రిసెర్చ్ వ్యవస్థాపకుడు డాక్టర్ మామిడి సుదర్శన్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. హైదరాబాదులో సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో హీరో అల్లు అర్జున్‌పై హత్య కేసు పెట్టినట్టుగానే తిరుపతిలో ఆరుగురు భక్తుల మృతికి కారణమైన ఘటనలో బీఆర్ నాయుడుపై హత్య కేసు నమోదు చేయాలని కోరారు.

## నేటి నుంచి శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

**శ్రీశైలం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి):** శ్రీశైల మహాక్షేత్రంలో మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని నేటి నుంచి 17వ తేదీ వరకు సంక్రాంతి బ్రహ్మోత్సవాలను దేవస్థానం వైభవంగా నిర్వహించనుంది. పంచాహ్నికదీక్షతో ఏడురోజులపాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 11వ తేదీ శనివారం ఉదయం 8:45 గంటలకు స్వామివారి యాగశాల ప్రవేశంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. సాయంత్రం 5:30 గంటల నుంచి అంకురారోపణ, అగ్నిప్రతిష్ఠాపనలు, 7 గంటలకు ధ్వజారోహణ, ధ్వజపటావిష్కరణ నిర్వహిస్తారు. రెండో రోజు నుంచి స్వామి, అమ్మవార్లకు వాహనసేవలు నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా నేటి నుంచి 17 వరకు ఆర్జిత, ప్రత్యక్ష, పరోక్షసేవలైన రుద్ర హోమం, చండీహోమం, స్వామిఅమ్మవార్ల కల్యాణం, ఏకాంతసేవలను నిలుపుదల చేశారు.



సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తున్న మునిసిపల్ కార్మికులు

## సమస్యలు పరిష్కరించాలి

**ధర్నాచౌక్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి):** గత ఏడాది మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల జీవోలను వెంటనే విడుదల చేయాలని మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, యూనియన్ నగర గౌరవాధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ డిమాండ్ చేశారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో శుక్రవారం నిరసన దీక్ష చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేదంటే రాబోయే రోజుల్లో భారీగా ఉద్యమించేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కార్మికుల మధ్య చిచ్చుపెట్టి నామమాత్రపు జీతాలు చెల్లించి వారితో వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. యూనియన్ నగర అధ్యక్షుడు ఎస్.జ్యోతిబసు, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.ప్రవీణ్, కోశాధికారి వెంకటేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

## ముగిసిన అ'ధర్మసింగ్' కస్టడీ

**విజయవాడ, జనవరి 10(ఆంధ్రజ్యోతి):** ఇబ్రహీంపట్నం మండలం మాజీ సబ్‌రిజిస్ట్రార్ ఎల్.ధర్మసింగ్ ఏసీబీ కస్టడీ శుక్రవారంతో ముగిసింది. మూడు రోజుల క్రితం ఏసీబీ సీఐయూ అధికారులు అతడిని కస్టడీకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ విచారణలో అధికారులు సింగ్ నుంచి కీలక విషయాలు రాబట్టినట్టు సమాచారం. ఇప్పటికే సింగ్ ఆస్తులు రూ.10 కోట్లు దాటి ఉంటాయని ఏసీబీ అధికారులు లెక్కించారు. విచారణలో సింగ్ వాంగ్మూలాన్ని నమోదు చేశారు. దానిని బట్టి అధికారులు తదుపరి దర్యాప్తు చేస్తారని తెలిసింది.



చిన్నేటి ఒడ్డున శ్మశానభూమికి ఫెన్సింగ్



ఆక్రమణలతో కుచించుకుపోయిన చిన్నేరు కాల్వ

# శ్మశానభూమి కబ్జా

- చిన్నేటి ఒడ్డున 50 సెంట్ల చుట్టూ ఫెన్సింగ్ .. బ్రిడ్జికి మరోవైపున పశువుల పాక
- గత ఏడాది వరదల్లో జగ్గయ్యపేట మునకకు ఆక్రమణలే కారణం

(ఆంధ్రజ్యోతి-జగ్గయ్యపేట)

పట్టణంలోని హిందూ శ్మశాన వాటికకు వెళ్లే రహదారిలో చిన్నేటి సమీపంలో శ్మశానభూమి కబ్జాకు కొందరు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే రుద్రభూమికి వెళ్లే మార్గం కుచించుకుపోయింది. చిన్నేటిపై ఉన్న బ్రిడ్జి గత ఏడాది ఆగస్టులో వచ్చిన వరదలకు దెబ్బతింది. ఆ సమయంలో చిన్నేటి కాల్వలో ఉన్న ఆక్రమణలు, పిచ్చిచెట్లు, చెత్తా చెదారం కొట్టుకుపోయింది. దీంతో చిన్నేరు పూర్తిస్వరూపం బయటపడింది. చిన్నేరు, పెద్దేరుల మధ్య హిందూ శ్మశాన వాటిక విస్తరించి ఉంది. వరదల్లో చెత్తా చెదారం, పిచ్చిచెట్లు కొట్టుకుపోగా ఏటి ఒడ్డు బయటపడింది. ఆ ఒడ్డుపై అక్రమార్కుల కన్ను పడింది.



బ్రిడ్జికి మరో వైపు పశువుల పాక వేసి కబ్జా

కొద్దిరోజులుగా ఆ స్థలాన్ని బాగు చేయించి చుట్టూ 50 సెంట్ల వరకు ఆక్రమించి సొంత భూమిలా ఫెన్సింగ్ వేస్తున్నారు. చిన్నేటి బ్రిడ్జికి మరో వైపు పశువుల పాక వేసి గేదెలు కట్టేస్తున్నారు. మరికొంత స్థలాన్ని చదును చేసి కబ్జాకు సిద్ధం చేస్తున్నారు. హిందు శ్మశానవాటికకు ఉన్న స్థలం సరిపోక పలు కులాల వారు తమకు శ్మశాన వాటిక కావాలని కోరుతుంటే ఉన్న స్థలం ఇలా ఆక్రమణకు గురికావటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

**గుణపాఠం నేర్చుకోరా..**

గత ఏడాది వచ్చిన వరదలకు చిన్నేరు, పెద్దేరు కలిసిపోయి ప్రవహించాయి. పట్టణంలోని పెద్ద శివాలయం వరకు వరద ముంచెత్తింది. నాగమయ్యవీధి, రజక బజార్, మిట్టగూడెం, బలుసుపాడు రోడ్డు వరకు నీరు ఎగతన్నింది. దీంతో బలుసుపాడు రోడ్డులోని బీసీల శ్మశాన వాటిక ధ్వంసమైంది. ముస్లింల ఈద్‌గా గోడ కూలిపోయింది. చిన్నేరు, పెద్దేరు పరివాహక ప్రాంతాలు ఆక్రమణకు గురి కావడమే దీనికి కారణం యానాదుల కాలనీలో గుడిసెలు మునిగిపోయాయి. వరద వల్ల నష్టం జరిగినా గుణపాఠం నేర్చుకోకపోగా చిన్నేటి కాల్వను పూడ్చి ఆక్రమణలకు పాల్పడడం ఏంటని పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. తక్షణం అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోని కబ్జాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**కబ్జా నా దృష్టికి రాలేదు**

ఇప్పటి వరకు శ్మశానవాటిక భూమి కబ్జా వ్యవహారం నా దృష్టికి రాలేదు. విచారణ జరుపుతాం. ఆక్రమణదారుపై చర్యలు తీసుకుంటాం.

- మనోహర్, తహసీల్దార్

## అమరావతిలో క్రీడా నగరం

- అంతర్జాతీయ సదుపాయాలతో నిర్మాణం: ఎంపీ కేశినేని చిన్ని

**వన్‌టౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి):** అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు సీఎం చంద్రబాబునాయుడు విశేష కృషి చేస్తున్నారని, రాజధాని అమరావతి ప్రాంతంలో అంతర్జాతీయ మౌలిక సదుపాయాలతో క్రీడా నగరం నిర్మించబోతున్నారని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) తెలిపారు. మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కాలేజీలో 68వ స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్-19 జాతీయ వాలీబాల్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ శుక్రవారం జరిగింది. కర్ణాటకపై తమిళనాడు జట్టు విజయం సాధించింది. బహుమతుల ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ విచ్చేశారు. ఈనెల 26వ తేదీ తరువాత నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం క్రీడాకారులకు అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారన్నారు. ముఖ్యమంత్రి స్ఫూర్తితో ఎన్టీఆర్ జిల్లాలోని నూతన 147 ప్రభుత్వ స్కూల్ గ్రౌండ్స్‌ను తన సొంత నిధులతో ఆధునీకరించినట్లు తెలిపారు. ఈనెల 23వ తేదీన మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా ఎన్టీఆర్ జిల్లాలోని 147 ప్రభుత్వ పాఠశాలలకు ఎనిమిది రకాల క్రీడా వస్తువులు పంపిణీ చేస్తామన్నారు. నిర్వాహకులు ఎంపీని సత్కరించారు. ద్రోణాచార్య అర్జున అవార్డు గ్రహీత అరికపూడి రమణరావు, స్టేట్ స్కూల్ గేమ్స్ సెక్రటరీ జి.భానుమూర్తిరాజు, శాప్ మాజీ చైర్మన్ అంకం చౌదరి, పి.బి.సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, డీఐఈవో సి.ఎస్ఎస్.ఎన్. రెడ్డి, ప్రీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్- 19 జిల్లా సెక్రటరీ వి.రవికాంత్, వాలీబాల్ సంఘం జిల్లా కార్యదర్శి దోనేపూడి దయాకర్‌రావు పాల్గొన్నారు.



అండర్-19 బాలికల జాతీయ వాలీబాల్ టోర్నమెంట్ విజేత తమిళనాడు జట్టుకు కప్ అందిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని



కంకిపాడులో పూటీ లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న జనసేన రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, బండి రామకృష్ణ, ముప్పా రాజా తదితరులు

## పూటీ లాగుడు పోటీలు ప్రారంభం

**కంకిపాడు, జనవరి 10(ఆంధ్రజ్యోతి):** జనసేన పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా ఆధ్వర్యంలో కంకిపాడులో శుక్రవారం ఎడ్ల ప్రదర్శన, పూటీ లాగుడు పోటీలను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు ప్రారంభించారు. పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు. సంప్రదాయ ఎడ్ల ప్రదర్శనకు మంచి స్పందన వస్తోందని జనసేన మచిలీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త బండి రామకృష్ణ అన్నారు. వివిధ జిల్లాల నుంచి 23 ఎడ్ల జతలు పోటీల్లో పాల్గొన్నాయని ముప్పా రాజా తెలిపారు.

## సీనియర్ రెసిడెంట్స్ నియామకానికి 17న ఇంటర్వ్యూలు

**ప్రభుత్వాసుపత్రి, జనవరి 10(ఆంధ్రజ్యోతి):** విజయవాడ ప్రభుత్వ దంత కళాశాల, వైద్యశాలలోని పలు విభాగాల్లో ఖాళీగా ఉన్న సీనియర్ రెసిడెంట్స్ నియామకాలకు ఈనెల 17వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం కొలసాని శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. వివరాలకోసం హెచ్‌టీటీపీ://జీడీసీహెచ్‌వీజేఏ.ఇన్ వెబ్‌సైట్‌ను చూడాలన్నారు.



చాదర్‌ను సమర్పిస్తున్న సీపీ ఎస్వీ రాజశేఖర్‌బాబు

## చాదర్ సమర్పణ

**ఇబ్రహీంపట్నం, జనవరి 10(ఆంధ్రజ్యోతి):** కొండపల్లిలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం హజరత్ సయ్యద్ షాబుఖారి బాబా దర్గా 428వ ఉరుసు మహోత్సవాల్లో రెండో రోజు శుక్రవారం బాబాకు విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు ప్రత్యేక చాదర్‌ను సమర్పించి ప్రార్థనలు చేశారు. ఉరుసు నిర్వహణ కమిటీ చైర్మన్ అల్తాఫ్ బాబా ముస్లిం మతాచారం ప్రకారం సీపీకి స్వాగతం పలికారు. భక్తులకు సీపీ భోజనం వడ్డించారు. ఏడీసీపీ రామకృష్ణ, వెస్ట్‌జోన్ ఏసీపీ దుర్గారావు, ఇబ్రహీంపట్నం సీఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## మట్టి తవ్వుతున్న యంత్రం స్వాధీనం

**వన్‌టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి):** పాతపాడు, నున్న మధ్య పోలవరం కాలువ మట్టిని అనధికారికంగా తరలిస్తున్న వారిపై ఇరిగేషన్ అధికారులు గురువారం రాత్రి దాడి చేశారు. మట్టి తవ్వుతున్న ప్రొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకుని నున్న పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. మట్టి తవ్వుతున్న వారు అక్కడ నుంచి పరారయ్యారు. పాతపాడు, కండ్రిక ప్రాంతానికి చెందిన కొందరు పాతపాడు, నున్న మధ్య పోలవరం కాలువ మట్టిని రాత్రివేళలో తరలిస్తున్నారని ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమవడంతో పోలీసు, ఇరిగేషన్ ఉన్నతాధికారులు స్పందించారు. మూడు రోజుల నుంచి ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ కొత్తూరు తాడేపల్లి, పాతపాడులో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

## పంటనష్టం అక్రమాలపై విచారణ ప్రారంభం

**తోట్లవల్లూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి):** కృష్ణానది వరదతో దెబ్బ తిన్న పంటల నష్టపరిహారం అక్రమాలపై శుక్రవారం విచారణ ప్రారంభమైంది. ఎరువులు, పురుగు మందుల వ్యాపారులకు, బోగస్ రైతులకు అక్రమ పద్ధతిలో నష్టపరిహారం ఇవ్వడంపై ఆంధ్రజ్యోతిలో పలు కథనాలు వచ్చాయి. దీంతో జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ విచారణ అధికారులను నియమించారు. అగ్రికల్చర్ పంటలపై అగ్రికల్చర్ డీడీ ఎస్.మనోహర్, ఏడీ ఎస్.మణిధర్‌ను, ఉద్యాన పంటలపై జిల్లా ఉద్యానాధికారిణి జ్యోతిని నియమించారు. మనోహర్, మణిధర్, తోట్లవల్లూరు వ్యవసాయ కార్యాలయంలో అధికారులను రైతు సూరంశెట్టి సత్యనారాయణ కలిసి తాను అరెకరం చెరకు కౌలు కు సాగుచేసి వరదకు నష్టపోయానని, కౌలురైతు గుర్తింపు ఉందని, అగ్రికల్చర్ అసిస్టెంట్ మౌనికను పదిసార్లు కలిసి వివరాలు సమర్పించి వేలిముద్ర వేసినా పరిహారం రాలేదని తెలిపారు. దీంతో అధికారులు మౌనికను పిలిచి, రైతుముందే ప్రశ్నించారు. గడువు దాటిపోయాక వచ్చాడని మౌనిక అనడంతో రైతు అది నిజం కాదని, తనకంటే వెనుక వచ్చిన రైతులకు పరిహారం వచ్చిందని చెప్పారు. దీంతో రైతు వివరాలను అధికారులు నమోదు చేసుకున్నారు. ఏవో నాగేశ్వరరావు నుంచి వివరాలు తెలుసుకున్నారు. గ్రామ సచివాలయాల సిబ్బందిని గండిగుంట పిలిపించుకుని ఉద్యాన పంటల అక్రమాలపై విచారణను జిల్లా ఉద్యానాధికారి జ్యోతి విచారణ చేశారు. ఈ సమాచారం ఆధారంగా తోట్లవల్లూరు వచ్చి విచారణ చేస్తానని తెలిపారు. విచారణ కొన్ని రోజులపాటు కొనసాగుతుందని అధికారులు తెలిపారు.



తోట్లవల్లూరులో విచారణ అధికారులతో మాట్లాడుతున్న రైతు సూరంశెట్టి సత్యనారాయణ

## అమరావతిలో స్టడీ సర్కిల్ నిర్మాణంతో బీసీలకు మేలు

- బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు పీవీఎల్ఎన్ రాజు

**ధర్నాచౌక్, జనవరి 10(ఆంధ్రజ్యోతి):** రాజధాని అమరావతిలో ఐదు ఎకరాల్లో స్టడీ సర్కిల్ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం మంచి పరిణామమని బీసీ ఐక్య వేదిక నగర అధ్యక్షుడు పీవీఎల్ఎన్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని బీసీ విద్యార్థులకు ఈ స్టడీ సర్కిల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు ఓబన్న జయంతి వేడుకలు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా నిర్వహిస్తున్నందుకు ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మేకప్

## వేడుకల్లో వెలిగిపోవాలంటే

మేకప్ నలుగురినీ ఆకర్షించేలా ఉండాలంటే అందుకు ప్రత్యేకమైన మెలకువలు పాటించాలి. చిన్న చిన్న చిట్కాలు, సులువైన ఉపాయాలు మేకప్‌ను మరింత ఆకర్షణీయంగా కనిపించేలా చేస్తాయి. అవేంటంటే...

**దట్టమైన కనురెప్పల కోసం...**

కంటి మేకప్ ఎంతో సంక్లిష్టమైనది. కంటి మేకప్ వేసుకోవడం ఒక ఎత్తైతే, అది చెదిరిపోకుండా చూసుకోవడం మరొక ఎత్తు. మరీ ముఖ్యంగా మస్కారా కారిపోకుండా, ఐలైనర్ చెరిగిపోకుండా చూసుకోవాలి. అందుకోసం ల్యాష్ ఎక్స్‌టెన్షన్స్ ఎంతో బాగా ఉపయోగపడతాయి. వీటితో కనురెప్పలు దట్టంగా మారడంతో పాటు, మస్కారా అద్దుకునే అవసరం లేకుండా రోజంతా చెక్కుచెదరకుండా ఉంటాయి.



**సెట్టింగ్ స్ప్రే, పౌడర్**

వేసుకున్న మేకప్ చర్మాన్ని అంటిపెట్టుకుని ఉండడం కోసం, సెట్టింగ్ స్ప్రే, పౌడర్‌లను ఎంచుకోవచ్చు. మేకప్ పూర్తయిన తర్వాత, చివర్లో వదులుగా ఉండే పారదర్శకమైన పౌడర్ అద్దుకుంటే మేకప్ చెక్కుచెదరకుండా ఉంటుంది. సెట్టింగ్ పౌడర్ జిడ్డును పీల్చుకుంటుంది కాబట్టి జిడ్డు చర్మం కలిగిన వాళ్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. చర్మానికి తేమ అవసరమయ్యే పొడి చర్మం కలిగిన వాళ్లు మేకప్ పూర్తయిన తర్వాత సెట్టింగ్ స్ప్రే ఉపయోగించాలి.

**ప్రైమర్**

మేకప్ మెరుపు రోజంతా తగ్గిపోకుండా ఉండాలంటే మేకప్‌కు ముందు ప్రైమర్ ఉపయోగించాలి. దీంతో చర్మం నునుపుగా మారి, జిడ్డు, పొడి తత్వం కలిగి ఉండే చర్మ ప్రభావాలు తగ్గిపోతాయి. అలాగే ప్రైమర్‌తో చర్మ రంధ్రాలు, మచ్చలు మాయమైపోతాయి.

**బ్రో ల్యామినేషన్**

కనుబొమలు తీర్చిదిద్దినట్టు కనిపించడం కోసం ఐబ్రో పెన్సిల్ వాడుకుంటాం! అయితే ఈ ప్రభావం వారాల తరబడి కొనసాగాలంటే 'బ్రో ల్యామినేషన్' చేయించుకోవాలి. ఆరు వారాల పాటు నిలిచి ఉండే ఈ సౌందర్య చిట్కాతో కనుబొమల తీరు ఎక్కువ కాలం పాటు చెక్కుచెదరకుండా ఉండిపోతుంది.

## మిద్దె మీద దానిమ్మ తోట

ఎన్నో పోషకాలతో నిండిన దానిమ్మ పండు ఆరోగ్యదాయిని. ఈ చెట్టుని మిద్దె తోటలో లేదా బాల్కనీలో సులభంగా పెంచుకోవచ్చు. రోజంతా ఎండ తగిలే వెసులుబాటు ఉంటే చాలు.. ఏపుగా పెరుగుతుంది.



- దానిమ్మ పండు గింజలను మట్టిలో వేస్తే మొలకలు వస్తాయి. కానీ చాలా సమయం పడుతుంది. అందుకే నర్సరీ నుంచి దానిమ్మ మొక్కను తీసుకొచ్చి వెడల్పాటి కుండీలో నాటాలి.
- కుండీ కనీసం 20 అంగుళాల లోతు ఉండాలి. అప్పుడే మొక్క వేళ్లు కుండీ అంతటా విస్తరిస్తాయి. అడుగు భాగంలో రంధ్రం చేస్తే కుండీలోని అదనపు నీరు బయటికి వెళుతుంది.
- కుండీలో వేసే మట్టి కొద్దిగా ఆమ్ల తత్వంతో ఉండాలి. ఇందులో తోటమట్టి, కంపోస్టు, వేపాకుల ముద్ద, కొద్దిగా కొబ్బరి పీచు, సేంద్రీయ ఎరువు వేసి కలిపితే మొక్క బాగా పెరుగుతుంది.
- ప్రతిరోజూ కుండీకి కనీసం ఆరు గంటలు ఎండ తగిలేలా ఏర్పాటు చేసుకుంటే పూలు బాగా వస్తాయి. మొక్కకు తేమ అందేలా నీరు పోస్తూ ఉంటే పూలు నిలిచి వేగంగా పండ్లు కాస్తాయి.
- మొక్కకు పూలు రావడం మొదలైన తరవాత కుండీలోని మట్టికి రెండు నెలలకోసారి సేంద్రీయ ఎరువు కలపాలి. ఎక్కువగా ఉన్న ఆకులను తుంచేయాలి. అదనపు కొమ్మలను కత్తిరిస్తే పూలకు పోషకాలు బాగా అందుతాయి.
- మొక్కకు క్రిమి కీటకాలు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఒక లీటరు నీటికి అయిదు మిల్లీ లీటర్ల వేప నూనె కలిపి మొక్క అంతటా తగిలేలా పిచికారీ చేయాలి.
- ఇలా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటూ ఉంటే పది నెలల్లో దానిమ్మ పండ్లు చేతికంది వస్తాయి.

సంక్రాంతి వచ్చిందంటే ఇంట్లో పిండి వంటల హడావిడి ప్రారంభ మయిపోతుంది. అరిసెలు, పల్లీ అచ్చులు వంటివి అందరూ చేసుకుంటూ ఉంటారు. అందుకే ఈసారి కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లో సంక్రాంతికి చేసుకొనే వంటలు ఏమిటో చూద్దాం..

వంటిల్లు

# మన సంక్రాంతికి కర్ణాటక రుచులు..!

## గసగసాల పరమాన్నం



**కావాల్సిన పదార్థాలు:**

గసగసాలు- మూడు చెంచాలు, బియ్యం- అరకప్పు, బెల్లం పొడి- అరకప్పు, పాలు- నాలుగు కప్పులు, నీళ్లు- ఒక కప్పు, ఏలకుల పొడి- ఒక చెంచా

**తయారీ విధానం**

- ఒక మూకుడులో బియ్యం, గసగసాలు వేసి వేయించాలి.
- ఒక గిన్నెలో పాలు పోసి దానిలో బియ్యం, గసగసాలు వేయాలి. ఇవి ఉడుకుతున్న సమయంలో నీళ్లు కూడా పోయాలి.
- పాలు బాగా చిక్కబడిన తర్వాత దానిలో బెల్లం పొడి వేయాలి. ఐదు నిమిషాల తర్వాత కిందకు దింపాలి.
- పాయసం కొద్దిగా చల్లారిన తర్వాత ఏలకుల పొడి వేసి కలపాలి.

**జాగ్రత్తలు**

- గసగసాలు ఎక్కువ వేస్తే చేదు వచ్చే అవకాశం ఉంది. అందువల్ల గసగసాలను తక్కువగానే వాడాలి.
- పాలు చిక్కబడిన తర్వాత నీళ్లు పోస్తే మంచిది. ముందే పాలు, నీళ్లు కలిపితే చిక్కబడటానికి ఎక్కువ సమయం పట్టవచ్చు.

## అరివికాలు (చిక్కుడుగింజలు) రైస్‌బాత్

**కావాల్సిన పదార్థాలు:**

బియ్యం- రెండు కప్పులు, చిక్కుడు గింజలు- ఒక కప్పు, నూనె- అరకప్పు, ఆవాలు- ఒక చెంచా, శనగపప్పు- ఒక చెంచా, మినపప్పు- ఒక చెంచా, పల్లీలు- రెండు చెంచాలు, కరివేపాకు- రెండు రెబ్బలు, చింతపండు రసం- పావు కప్పు, బెల్లం పొడి- పావు కప్పు, పసుపు- పావు చెంచా, ఉప్పు- తగినంత, ఎండు మిరపకాయలు- నాలుగు, ధనియాలు- రెండు చెంచాలు, కొబ్బరి తురుము- రెండు చెంచాలు, మిరియాలు- ఒక చెంచా, నెయ్యి- రెండు చెంచాలు, నీళ్లు- తగినన్ని



**తయారీ విధానం**

- చిక్కుడు గింజలను బాగా కడిగి వాటిలో కొద్దిగా ఉప్పు, నెయ్యి కలపాలి. కుక్కర్‌లో వాటిని ఉడికించి బయటకు తీసి చల్లార్చాలి. ఇదే కుక్కర్‌లో బియ్యం పెట్టి అన్నం వండాలి. దీనిని కూడా బయటకు తీసి చల్లార్చాలి.
- ఒక మూకుడులో ఒక చెంచా నూనెను వేడి చేయాలి. దీనిలో ఎండు మిర్చి, శనగపప్పు, మినపప్పు, ధనియాలు వేసి వేయించాలి. ఆ తర్వాత మిరియాలు, కొబ్బరి తురుము వేసి వేయించాలి. ఇవి చల్లారిన తర్వాత వాటిని మిక్సీలో వేసి గుండ చేయాలి.
- అదే మూకుడులో నూనె వేసి వేడి చేయాలి. దీనిలో పల్లీలు, ఆవాలు, కరివేపాకు వేసి వేయించాలి. దానిలో పసుపు, బెల్లం పొడి, చింతపండు రసం వేసి కొద్ది సేపు ఉడకనివ్వాలి.
- ఈ మిశ్రమంలో అన్నం, చిక్కుడు గింజలను వేసి బాగా కలపాలి.

**జాగ్రత్తలు**

- దీనిలో లేత చిక్కుడు గింజలు బావుంటాయి. కానీ వీటిని బాగా ఎక్కువగా ఉడకపెట్టకూడదు.

## పల్లీ బొబ్బట్లు

**కావాల్సిన పదార్థాలు:**

గోధుమ పిండి- రెండు కప్పులు, నెయ్యి- ఒక కప్పు, ఉప్పు- తగినంత, పల్లీలు- ఒక కప్పు, నువ్వులు- పావు కప్పు, గసగసాలు- రెండు చెంచాలు, బెల్లం పొడి- ఒక కప్పు, ఏలకుల పొడి- ఒక చెంచా, నీళ్లు- తగినన్ని

**తయారీ విధానం:**

- ఒక గిన్నెలో గోధుమ పిండిని తీసుకోవాలి. కొద్ది కొద్దిగా నీళ్లు పోసి పిండిని ముద్దగా చేయాలి. 30 నిమిషాలు గిన్నెలో ఉంచాలి.
- ఒక మూకుడులో పల్లీలను, నువ్వులు, గసగసాలను వేసి వేయించాలి. ఇవి చల్లారిన తర్వాత వాటిని మిక్సీలో పొడి చేయాలి.
- ఈ మూకుడులో ఈ మిశ్రమాన్ని, బెల్లం పొడిని, ఏలకుల పొడిని వేసి వేడిచేయాలి. దీనిలో కొద్దిగా నీళ్లు వేసి ముద్దగా చేయాలి. దీనిని మూకుడు నుంచి బయటకు తీసి చల్లార్చి ఉండలుగా చేసుకోవాలి.
- గోధుమ పిండిని చపాతీల మాదిరిగా ఒత్తి- వాటి మధ్యలో పల్లీలు, బెల్లం కలిపిన ఉండలను పెట్టి మూసి వేయాలి. వాటిని మళ్లీ గుండ్రంగా ఒత్తుకోవాలి.
- ఒక పెనం తీసుకొని కొద్దిగా వేడి చేయాలి. దానిపై ఒత్తిన బొబ్బట్లును కొద్ది కొద్దిగా నెయ్యి వేసి కాల్చాలి.



**జాగ్రత్తలు**

- పొట్టు తీసిన పల్లీలు అయితే బొబ్బట్లు తెల్లగా కనిపిస్తాయి.
- నెయ్యి బదులు నూనె కూడా వాడుకోవచ్చు.
- పల్లీ పొడి, బెల్లం పొడి పాకం పట్టేటప్పుడు... ఈ మిశ్రమం గట్టిగా అయిపోకుండా జాగ్రత్తగా చూసుకోవాలి.

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

## తాపహారీ అనే వడియాల అన్నం

అన్నాన్ని వండుకుని అందులో కూర, పప్పు, పచ్చడి, పులుసు లాంటివి కలుపుకుని తినటం కొందరికి అలవాటు. కాలక్రమంలో ఈ అన్నాన్ని వండేప్పుడే పెసర పప్పు, కందిపప్పు లాంటివి కలిపి పులగాన్ని వండుకోవటం మొదలు పెట్టారు. కూరగాయలు కలిపి కిచిడీనీ వండటం ప్రారంభించారు. వివిధ మసాలాలు కలిపి పులావు లాంటి వంటకాల గురించి 10వ శతాబ్దానికి చెందిన నలుడు పాకదర్పణంలో వివరించాడు. అప్పటికి మన దేశంలో మహ్మదీయుల ప్రాపకం ఎక్కువగా లేదు. ఆ తర్వాతి కాలంలో మహ్మదీయుల ఆధిపత్యం పెరిగిన తర్వాత పలావు వంటి వాటికి ఎక్కువ ఆదరణ లభించింది. ఆ సమయంలో అందరి ఆదరణ పొందిన వంట మరొకటి ఉంది. దాని పేరు తాపాహారి. వడియాలతో తినే అన్నం. దీనిని ఎలా చేయాలో భోజన కుతూహలం పాకశాస్త్ర గ్రంథంలో రఘునాథసూరి పండితుడు వివరించాడు.

"ఘృతే హరిద్రాసంయుక్తమాషాణాం భర్జయేద్వటీ
తండులాశ్చాపి నిరధౌతాన్సహైవ పరివర్తయేత్
సిద్ధయోగ్యం జలం తత్ర నిక్షిప్య కుశాలః పచేత్
లవణార్ద్రకహింగూని మాత్రయా తత్ర నిక్షిపేత్"

దీని అర్థాన్ని మనం ఇప్పుడు తెలుసుకుందాం.

**ఘృతే హరిద్రాసంయుక్తమాషాణాం భర్జయేత్:** పసుపు, ఇతర సుగంధ ద్రవ్యాలు కలిపిన మినప్పిండితో పెట్టిన వడియాలు ఎండబెట్టి సిద్ధంగా ఉంచుకోండని దీని అర్థం. మన పూర్వీకులు మినపవడియాల్ని ఉట్ర వడియాలని కూడా పిలిచేవారు. ఉప్పు, కారం, ఇంగువ తగిన పాళ్లలో కలిపి మినప్పిండిని కలిపి వాటిని ఎండబెడతారు. అవి ఎండిన తర్వాత నేతితో వేయిస్తారు.

**తండులాశ్చాపి నిరధౌతాన్సహైవ పరివర్తయేత్:** బియ్యంలో కొద్దిగా నెయ్యి వేసి కమ్మని వాసన వచ్చేవరకూ పైపైన వేగించి సిద్ధంగా ఉంచుకోండనేది దీని అర్థం.

సిద్ధయోగ్యం జలం తత్ర నిక్షిప్య కుశలః పచేత్: ఈ బియ్యంలో తగినన్ని నీళ్లు పోసి అన్నం వండుతూ, ఉడుకుతూ ఉండగా ఇందాక వేగించిన వడియాల్ని కలిపి చాకచక్యంగా వండండి.

**లవణార్ద్రకహింగూని మాత్రయా తత్ర నిక్షిపేత్:** ఈ అన్నంలో తగినంత ఉప్పు, నూరిన అల్లం ముద్ద కలిపి ఇంగువ మొదలైన పోపు ద్రవ్యాలతో నేతి తాలింపు పెట్టండి. ఇదే తాపహారి. ఇది శరీరంలోని వేడిని తగ్గించి బలాన్నిస్తుంది. ఆలస్యంగా అరుగుతుంది. నెయ్యి మిరియాల పొడి కలయిక వలన పిల్లల్లో మేధాశక్తి, జ్ఞాపకశక్తి పెరుగుతుంది.



- మినపవడియాలలో మిరపకారంకన్నా మిరియాలకారానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. దీనివల్ల ఎసిడిటీ వంటి సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.
- మినుముల ఎక్కువగా వాడకం మంచిది కాదు. ఇడ్లీలు దోసెలు, వడలు, పునుగుల పేరుతో రోజూ టిఫిన్ల రూపాన కడుపులోకి అపరిమితంగా మినుములు చేరుతున్నాయి. వీటివల్ల అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. స్థూలకాయం లాంటి సమస్యలకు కారణమవుతున్నాయి.
- ఉదయం, రాత్రి అల్పాహారం కన్నా చిరుధాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వండి. వరి అన్నం బదులుగా చిరుధాన్యాలతో కూడా తాపాహారిని వండుకోవచ్చు. తాపహారికోసం ప్రత్యేకంగా వడియాలు పెట్టుకోవాలి. అవి అందుబాటులో లేనప్పుడు పసుపు, ఇతర సుగంధ ద్రవ్యాలు కలిపిన గారెలు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడతాయి. మినపప్పు మాదిరిగానే పెసలతోను, ఉలవలతోను, ఇతర పప్పు ధాన్యాలతో కూడా వడియాలు తయారుచేసుకోవచ్చు.

● గంగరాజు అరుణాదేవి

సెలబ్ ఫిట్

**మూడున్నర దశాబ్దాల కిందట... 'మైనే ప్యార్ కియా' అంటూ పలుకరించింది భాగ్యశ్రీ. నిన్నటి తరం కలల రాణిగా... తొలి చిత్రంతోనే సంచలన తారగా... దేశంలోని సినీ ప్రేక్షకులందరికీ దగ్గరైన ఆమె... నేటికీ తనదైన శైలిలో తెరపై అలరిస్తోంది. యాభై ఐదేళ్ల వయసులోనూ తరగని అందంతో... అంతే నాజూకుగా... అపు'రూపం'గా ఆకట్టుకొంటోంది.**

# అపురూపం

'కచ్చీ ధూప్' సీరియల్‌తో 1987లో నటనకు శ్రీకారం చుట్టిన భాగ్యశ్రీ పట్వర్ధన్ దసానీ... ఆ తరువాత రెండేళ్లకు 'మైనే ప్యార్ కియా' (ప్రేమ పావురాలు) చిత్రంతో వెండితెరకు పరిచయమైంది. నటిగా ఎదగాలని ఆమె కలలు కనలేదు. అయితే 'కచ్చీ ధూప్' కోసం ముందుగా అనుకున్న ఓ ప్రముఖ నటి చివరి నిమిషంలో రాకపోవడంతో... భాగ్యశ్రీకి అందులో అవకాశం వచ్చింది. ప్రముఖ నటుడు, దర్శకుడు అమూల్ పాలేకర్ అడగడంతో ఆమె వెంటనే ఓకే చెప్పింది. భాగ్యశ్రీది మహారాష్ట్రలోని సంగ్లీ రాజ వంశం. ముగ్గురు సంతానంలో భాగ్యశ్రీ పెద్ద కుమార్తె. మధువని, పూర్ణిమ చెల్లెళ్లు. సీరియల్ చేస్తుండగానే 'మైనే ప్యార్ కియా'లో ఆమెకు అవకాశం లభించింది. 1989లో విడుదలైన ఈ చిత్రం అప్పట్లో ఒక సంచలనం. సల్మాన్‌ఖాన్ హీరోగా నటించిన మొదటి సినిమా అది. కానీ సల్మాన్ కంటే ఎక్కువ క్రేజ్ సంపాదించుకుంది భాగ్యశ్రీ. ఆ ఒక్క చిత్రంతోనే స్టార్ హీరోయిన్ అయిపోయింది. ఫిలిమ్‌ఫేర్ అవార్డు కూడా దక్కించుకుంది. కానీ అనూహ్యంగా అదే ఏడాది హిమాలయ దసానీని పెళ్లాడింది. అతడితో కలిసి మూడు చిత్రాలు చేసింది. వీరికి ఇద్దరు సంతానం. కొడుకు అభిమన్యు దసానీ నటుడు. కూతురు అవంతిక రెండేళ్ల కిందట వచ్చిన 'మిథ్య' వెబ్‌సిరీస్‌లో నటించింది.

ప్రాధాన్యమున్న పాత్రలు వచ్చినప్పుడు, కుదిరినప్పుడు సినిమాల్లో నటిస్తూనే, తరచూ టెలివిజన్ షోస్‌లో కనిపిస్తోంది భాగ్యశ్రీ. పేద బాలికల అభ్యున్నతి కోసం 2015లో తీసుకువచ్చిన పథకానికి మహారాష్ట్ర ప్రభుత్వం 'భాగ్యశ్రీ' పేరు పెట్టింది. అంతేకాదు... పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో కూడా ఆమె చురుగ్గా పాల్గొంటుంది. వృత్తి, సేవా కార్యక్రమాలు, కుటుంబ బాధ్యతలు... ఎడతెరిపి లేని పని ఒత్తిడిలో ఉన్నా దృఢమైన శరీరం కోసం ప్రత్యేక సమయం కేటాయిస్తుంది. నిత్యం కసరత్తులు, క్రమం తప్పని ఆహార నియమాలు ఆమె జీవన విధానంలో ఒక భాగం. 'మహిళలకు నేను





చెప్పదలుచుకొంది ఏంటంటే.. జీవితమనే పరుగులో కింద పడతాం.... కానీ పైకి లేవడానికి ప్రయత్నించాలి. ఎదురుదెబ్బలు తగిలితే వాటిని మాన్చుకోవడం ఎలాగో నేర్చుకోవాలి. విఫలమయ్యామని అంతటితో వదిలేయకుండా విజయం సాధించే వరకూ పోరాడాలి. సాకులవల్ల ప్రయోజనం లేదు. పరనిందలు విమ్మల్ని బలహీనపరుస్తాయి. మన మార్గాన్ని మనమే నిర్మించుకోవాలి. మన సామర్థ్యంపై మనకు విశ్వాసం ఉంటే ఎంతటి లక్ష్యాన్నయినా సాధించగలం' అంటుంది భాగ్యశ్రీ. ఇలాంటి పోస్టులతో తరచూ ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానుల్లో స్ఫూర్తి నింపే ప్రయత్నం చేస్తుంటుంది.

**ఎప్పుడు ఏ ఆహారం...**

న్యూట్రిషనిస్టు కూడా అయిన భాగ్యశ్రీ... తిండి విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకొంటుంది. తన ఆహార నియమాల గురించి తరచూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తుంటుంది. 'వయసు పెరుగుతున్నకొద్దీ విటమిన్ల లోపం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతుంటాయి. దీనికి దూరంగా ఉండాలంటే రోజూ మన ఆహారంలో బాదం, పొద్దు తిరుగుడు గింజలు, పాలకూరను జత చేయాలి. తరచూ చికాకు, కోపం వస్తుంటే విటమిన్-బి లోపం కావచ్చు. రాజ్మా, శనగలు, వేరుశనగలు తీసుకోవాలి. పెళుసు గోళ్లు ఐరన్ లోపం గల వారిలో కనిపించే లక్షణం. పాలకూర, బీట్‌రూట్, బెల్లం మెనూకు జత చేసుకోవాలి. కండరాల కదలికలకు, శరీరం డీహైడ్రేట్ కాకుండా చూసుకోవడానికి అరటిపండ్లు, కొబ్బరి నీళ్లు ఆహారంలో భాగం చేసుకోవాలి. చివరగా పేగుల ఆరోగ్యానికి పెరుగు... ఇడ్లీ, దోక్లా వంటివి మెరుగైన జీర్ణక్రియకు దోహదపడతాయి' అంటుంది భాగ్యశ్రీ.

**ఇవీ వ్యాయామాలు...**

తొంభైల్లో భాగ్యశ్రీకి... ఇప్పటికీ పెద్దగా తేడా ఏమీ కనిపించదు. ఇప్పటికీ ఆమెలో అదే ఉత్సాహం... ముఖంలో అదే మెరుపు. 'జీవితంలో ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. అది మన మానసిక ఉల్లాసానికి దోహదపడుతుంది. ఎంత పని ఒత్తిడిలో ఉన్నా రోజులో కనీసం ఓ అరగంటైనా వ్యాయామాలకు సమయం కేటాయించాలి. అలాగే ఏంతింటున్నాం అనే దాని మీద శ్రద్ధ పెట్టాలి' అంటుంది ఆమె.

- ఉదయం లేవగానే స్ట్రెచింగ్ వ్యాయామాలు. రాత్రంతా విశ్రాంతి తీసుకున్న మనల్ని జిమ్‌కు సిద్ధం చేయడానికి, కండరాలు పట్టేయకుండా శరీరాన్ని ఎటు కావాలంటే అటు వంచడానికి ఇవి దోహదపడతాయి. రక్తప్రసరణను మెరుగు పరుస్తాయి.
- భాగ్యశ్రీ వ్యాయామాల్లో ఎక్కువ శాతం ఇంట్లో చేసుకొనేవే ఉంటాయి. వాటిల్లో మొదటిది యోగా. క్లిష్టమైన యోగాసనాలు ఆమె దైనందిన జీవితంలో భాగం. దీనివల్ల శరీరం చువ్వలా మారడమే కాదు... మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.
- గంటల తరబడి కుర్చీల్లో కూర్చొని పని చేసేవారికి ఆమె ఇచ్చే సలహా... ఏదో ఒక రకంగా శరీరాన్ని కదిలించాలని. కనీసం ఒక అరగంట తేలికపాటి వ్యాయామాలైనా చేయమని, 'కదలికే ఔషధం' అని అంటుంది ఈ భామ.
- వర్కవుట్స్‌కు ముందు ఇరవై నిమిషాలు ట్రెడ్‌మిల్. రన్నింగ్, జాగింగ్‌తో కూడిన కార్డియోతో గుండె మాత్రమే కాదు, శరీరం కూడా ఉత్తేజితమవుతుంది. సామర్థ్యం పెరుగుతుంది.
- వర్కవుట్స్ తరువాత పది నిమిషాలపాటు బ్యాక్ వాకింగ్. అంటే వెనక్కు నడవడం. ఇది మోకాళ్లపై ఒత్తిడిని తగ్గిస్తుందని, తొడ కండరాలు పట్టేయకుండా కాపాడుతుందని చెబుతోంది ఆమె.
- 'చిన్నప్పటి రోజులు గుర్తుకు తెచ్చుకోండి. ఎగిరి గంతులు వేసేవాళ్లం. అయితే అది పిల్లల ఆట మాత్రమే కాదు... అద్భుతమైన కార్డియో వర్కవుట్ కూడా. కండరాలను దృఢంగా మారుస్తుంది. బ్యాలెన్స్‌ను మెరుగుపరుస్తుంది. కటి కండరాలు బలోపేతమవుతాయి' అంటున్న భాగ్యశ్రీ తరచూ తన వర్కవుట్స్‌కు సంబంధించిన వీడియోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తుంది. అక్కడ ఆమెకు పాతిక లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు.

## ముత్యాల ముగ్గు



సి. రాజ్యలక్ష్మీ
హైదరాబాద్

22 చుక్కలు
4 వరుసలు
4 వరకు - సరిచుక్కలు





స్వరూప
హైదరాబాద్

15 చుక్కలు
3 వరుసలు
3 వచ్చేవరకు

ఈ-మెయిల్: features@andhrajyothy.com

# కొత్తవాళ్లు కొట్టేశారు

● మంధాన మెరుపు ఇన్నింగ్స్
● భారత్ ఘన విజయం
ప్రతిక, తేజల్ అర్ధ సెంచరీలు

ఐర్లాండ్‌తో తొలి వన్డే


ప్రతికా రావల్ (89)

రాజ్‌కోట్: విజయాల జోరును భారత మహిళలు కొనసాగిస్తున్నారు. ఐర్లాండ్‌తో శుక్రవారం జరిగిన తొలి వన్డేలో ఆరు వికెట్లతో ఘన విజయం సాధించారు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యం అందుకున్నారు. అంతగా అనుభవంలేని ప్రతికా రావల్ (89), తేజల్ హసబ్నిస్ (53 నాటౌట్) అర్ధ సెంచరీలతో సత్తా చాటగా, కెప్టెన్ మంధాన (29 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 41) మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకుంది. దాంతో 239 పరుగుల లక్ష్య ఛేదనను భారత్ 34.3 ఓవర్లలో 241/4 స్కోరు చేసి ముగించింది. అంతకుముందు ఐర్లాండ్ 50 ఓవర్లలో 238/7 స్కోరు చేసింది. కెప్టెన్ గాబీ లూయిస్ (92), లీ పాల్ (59) హాఫ్ సెంచరీలు సాధించారు. ప్రియా మిశ్రా రెండు వికెట్లు పడగొట్టింది. ప్రతిక 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది.

**ప్రతిక, తేజ శతక భాగస్వామ్యం:** మోస్తరు ఛేదనలో మంధాన, ప్రతిక దూకుడైన ఆరంభం ఇచ్చారు. ఓవర్‌కు ఏడు పరుగుల చొప్పున మొదటి వికెట్‌కు 70 పరుగులు జోడించారు. వెస్టిండీస్‌తో గత టీ20, వన్డే సిరీస్‌ల్లో అద్భుత బ్యాటింగ్‌తో అదరగొట్టిన మంధాన అంతగా అనుభవంలేని ఐర్లాండ్ బౌలర్లను ఆడేసుకుంది. ముఖ్యంగా పేసర్ డెంప్సీ వేసిన ఎనిమిదో ఓవర్‌లో 4,6,4తో స్మృతి కదం తొక్కింది. అయితే అర్ధ శతకానికి చేరువైన మంధానను సార్జంట్ క్యాచవుట్ చేసింది. హర్లీన్ డియోల్ (20), జెమీమా రోడ్రిగ్స్ (9) త్వరగా నిష్క్రమించడంతో 46 పరుగుల తేడాతో భారత్ మూడు వికెట్లు చేజార్చుకుంది. కానీ..చెరో నాలుగేసి అంతర్జాతీయ మ్యాచ్‌ల అనుభవమే కలిగిన ప్రతికా రావల్, తేజల్ ఎంతో పరిణతితో ఆడి భారత ఇన్నింగ్స్‌ను నడిపించారు. ఈక్రమంలో నాలుగో వికెట్‌కు 84 బంతుల్లో 116 పరుగులు జోడించి జట్టును విజయ పథాన నడిపించారు.

**ఆ ఇద్దరు ఆదుకున్నారు:** టాస్ నెగ్గి ఐర్లాండ్ మొదట బ్యాటింగ్ చేపట్టగా..భారత బౌలర్ల ధాటికి 56/4తో తీవ్ర ఇబ్బందుల్లో పడింది. కానీ లూయిస్, పాల్ ఐదో వికెట్‌కు 117 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. భారత ఫీల్డింగ్ చెత్తగా ఉండడం కూడా ఈ జోడీకి కలిసి వచ్చింది. మన ఫీల్డర్లు మూడు క్యాచ్‌లు వదిలేయడంతోపాటు, మిస్‌ఫీల్డింగ్‌తో పరుగులు ఇచ్చేశారు.

**సంక్షిప్తస్కోర్లు: ఐర్లాండ్:** 50 ఓవర్లలో 238/7 (గాబీ లూయిస్ 92, లీ పాల్ 59, అర్లిన్ కెల్లీ 28, ప్రియా మిశ్రా 2/56).
**భారత్:** 34.3 ఓవర్లలో 241/4 (ప్రతిక 89, తేజల్ 53 నాటౌట్, అమీ మెగ్వైర్ 3/57).




### 4 వేల పరుగుల మంధాన..

వన్డేలలో అతి తక్కువ ఇన్నింగ్స్‌లో నాలుగు వేల పరుగులు చేసిన తొలి భారత బ్యాటర్‌గా మంధాన రికార్డు నెలకొల్పింది. 95వ ఇన్నింగ్స్‌లో ఆమె ఈ ఘనత సాధించింది.

## 'వరల్డ్ బెస్ట్' నీరజ్

### ఎంపిక చేసిన అమెరికా మేగజీన్



న్యూఢిల్లీ: భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు అరుదైన ఘనత దక్కింది. అమెరికాకు చెందిన ప్రఖ్యాత మేగజీన్ 'ట్రాక్ అండ్ ఫీల్డ్ న్యూస్' 2024 ప్రపంచ అత్యుత్తమ జావెలిన్ త్రోయర్‌గా నీరజ్‌ను ఎంపిక చేసింది. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకంతో చరిత్ర సృష్టించిన 27 ఏళ్ల చోప్రా..పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకంతో మరో రికార్డు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. గ్రెనడాకు చెందిన రెండుసార్లు ప్రపంచ చాంపియన్ ఆండర్సన్ పీటర్స్‌ను వెనక్కు నెట్టిన నీరజ్ అమెరికా మేగజీన్ ప్రతిష్ఠాత్మక అవార్డు కైవసం చేసుకున్నాడు. 1948లో ఆవిర్భవించిన 'ట్రాక్ అండ్ ఫీల్డ్ న్యూస్' పత్రికను క్రీడల్లో బైబిల్‌గా భావిస్తారు. విశ్వవ్యాప్త ట్రాక్, ఫీల్డ్ విభాగంలో ఈ మేగజీన్‌కు ఎంతో పేరు ప్రఖ్యాతులున్నాయి.

## రేడియో జాకీతో చాహల్ డేటింగ్ ?



ముంబై: భారత జట్టు స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్, ధనశ్రీ వర్మ దంపతులు విడిపోతున్నారంటూ గత కొద్ది రోజులుగా పెద్ద ఎత్తున ఊహాగానాలు వస్తున్నాయి. అయితే ఈ పుకార్లను చాహల్ కానీ ధనశ్రీకానీ ఖండించకపోవడంతో..అవి నిజమేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈనేపథ్యంలో శుక్రవారం నెట్టింట్లో దర్శనమిచ్చిన ఫొటోలు చాహల్ దంపతులు విడిపోతున్నారనే వార్తలకు బలం చేకూర్చింది. తాను, చాహల్ కలిసి ఉన్న ఫొటోలను 28 ఏళ్ల రేడియో జాకీ మహవాష్ ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. క్రిస్మస్ సంబరాలను చాహల్‌తో కలిసి సెలబ్రేట్ చేసుకున్నానని వెల్లడించిన మహవాష్.. 'చాహల్ నా ఫ్యామిలీ' అని రాయడం సంచలనం రేపింది. దాంతో మహవాష్‌తో చాహల్ డేటింగ్‌లో ఉన్నాడంటూ వార్తలు వెల్లువెత్తుతున్నాయి.

# జడ్డూకు చోటు దక్కేనా!



యువ ఆటగాళ్లపై దృష్టి
రేసులో వరుణ్ చక్రవర్తి

న్యూఢిల్లీ: భారత క్రికెట్‌లో ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాది ప్రత్యేక స్థానం. బౌలింగ్, బ్యాటింగే కాకుండా అద్భుతమైన ఫీల్డర్‌గా పేరు తెచ్చుకున్నాడు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో తను కేవలం సుదీర్ఘ ఫార్మాట్‌కే పరిమితమయ్యేలా కనిపిస్తున్నాడు. ఎందుకంటే ఇప్పటికే జడ్డూ టీ20లకు వీడ్కోలు పలకగా.. తాజాగా వన్డేల్లోనూ అతడిని కొనసాగించడంపై సందేహాలు నెలకొన్నాయి. ఈ నెలలో ఇంగ్లండ్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌లతో పాటు ఫిబ్రవరి 19 నుంచి జరిగే చాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టును ప్రకటించాల్సి ఉంది. అంతేకాకుండా 2027 వరల్డ్‌కప్‌ను కూడా దృష్టిలో ఉంచుకుని యువ ఆటగాళ్లకు స్థానం కల్పించాలి. ఈనేపథ్యంలో జడ్డూకు చోటు దక్కడం కష్టమేనన్న వార్తలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు 2023 వన్డే వరల్డ్‌కప్ తర్వాత 50 ఓవర్ల ఫార్మాట్‌లో అతను జట్టుకు ఆడింది లేదు. అలాగే ఆల్‌రౌండర్ విభాగంలో జడ్డూకు అక్షర్, సుందర్, దూబే, రియాన్ పరాగ్ గట్టి పోటీ ఇస్తున్నారు. హార్దిక్‌కు ఎలాగూ బెర్త్ ఖాయమే. దీనికి తోడు ఇటీవలి ఆస్ట్రేలియా పర్యటనలోనూ జడేజా ఆకట్టుకోలేకపోయాడు. అతను ఆడిన మూడు టెస్టుల్లో తీసింది నాలుగు వికెట్లే. బ్యాటింగ్‌లో మాత్రం ఓ అర్ధసెంచరీ చేశాడు. అందుకే భవిష్యత్ టోర్నీల్లో జడ్డూ లేకుండానే ముందుకు వెళ్లాలని సెలెక్టర్లు భావిస్తున్నట్టు బోర్డు వర్గాల సమాచారం. అయితే ఇంగ్లండ్‌తో ఆడబోయే టెస్టు సిరీస్‌లో మాత్రం జడేజా స్థానానికి ఢోకా ఉండకపోవచ్చు. కాగా, మిడిలార్డర్‌లో అనుభవజ్ఞుడైన ఆటగాడు లేకపోవడం అతడికి కలిసొచ్చే అంశం. మరోవైపు అదృష్టం బాగుంటే అతను చాంపియన్స్ ట్రోఫీలోనూ ఆడే అవకాశం లేక పోలేదన్నది కొందరి అభిప్రాయం. ఎందుకంటే ఈ మెగా టోర్నీలో భారత్ ఆడే మ్యాచ్‌లు దుబాయ్‌లో జరగనున్నాయి. అక్కడి పిచ్‌లు ఎక్కువగా స్పిన్నర్లకే అనుకూలిస్తుంటాయి. దీంతో అపార అనుభవం కలిగిన వెటరన్ జడేజా జట్టులో ఉంటే సహాయకంగా ఉంటుందని సెలెక్టర్లు భావిస్తే మాత్రం అతను కూడా దుబాయ్ విమానం ఎక్కే ఆస్కారం ఉంది.

### గౌతీచూపు ఇతనివైపు



ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ తరఫున విశేషంగా ఆకట్టుకున్న లెగ్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తికి చాంపియన్స్ ట్రోఫీలో చోటు దక్కేలా ఉంది. ఈనెల 12 వరకు ఈ టోర్నీలో పాల్గొనే భారత ప్రాథమిక జట్టును ప్రకటించేందుకు గడువు ఉంది. ఇందులో భాగంగా స్పిన్ విభాగంలో వరుణ్ కూడా గట్టి పోటీదారుడుగా ఉన్నట్టు సమాచారం. జడేజా సహా ఇతర స్పిన్నర్లకంటే కూడా తనే రేసులో ముందున్నట్టు చెబుతున్నారు. కుల్దీప్ యాదవ్ ఫిట్‌నెస్‌పై సందేహాలు నెలకొనడంతో కోచ్ గంభీర్ చూపు వరుణ్‌పై పడింది. గతేడాది కేకేఆర్ విజేతగా నిలవడంలో వరుణ్‌ది కీలక పాత్ర. అలాగే ఆ సమయంలో జట్టు మెంటార్‌గా గంభీర్ వ్యవహరించాడు. తొలిసారి 2021 టీ20 వరల్డ్‌కప్‌లో తను జట్టుకు ఎంపికైనా ప్రభావం చూపలేదు. ఆ తర్వాత ఐపీఎల్ ప్రభావంతో గతేడాది తిరిగి చోటు దక్కించుకుని మెరుగ్గా రాణించాడు. అయితే ఇప్పటివరకు వన్డేల్లో మాత్రం అరంగేట్రం చేయలేదు.

## వరుణ్ ఆరోన్ రిటైర్మెంట్



న్యూఢిల్లీ: భారత పేసర్ వరుణ్ ఆరోన్ అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. విజయ్ హజారే ట్రోఫీలో జార్ఖండ్ తరఫున అతడికి చోటు దక్కలేదు. దీంతో 35 ఏళ్ల వరుణ్ ఆటకు అల్విదా చెప్పడమే మేలని భావించాడు. 2023-24 సీజన్‌లో తను ఫస్ట్ క్లాస్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. '20 ఏళ్లుగా క్రికెట్టే శ్వాసగా జీవించాను. అందుకే పూర్తి సంతృప్తితో ఆట నుంచి వైదొలుగుతున్నా' అని వరుణ్ ప్రకటించాడు. 2010-11 విజయ్ హజారే ట్రోఫీలో 150 కి.మీ వేగంతో బంతి విసిరి సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. దీంతో అదే ఏడాది ఆరోన్ భారత్ తరఫున వన్డే, టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. 2015లో చివరి టెస్టు ఆడాడు. ఐపీఎల్‌లోనూ పలు జట్ల తరఫున బరిలోకి దిగిన వరుణ్ మొత్తంగా 9 టెస్టుల్లో 18, 9 వన్డేల్లో 11 వికెట్లు తీశాడు.

## సెమీస్‌కు సాత్విక్ జోడీ

### మలేసియా ఓపెన్



కౌలాలంపూర్: స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి మలేసియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తోంది. ఏడోసీడ్‌గా బరిలోకి దిగిన భారత ద్వయం 26-24, 21-15తో స్థానిక ఫేవరెట్ జంట యే సిన్ ఓంగ్/ఎ యి తియోను చిత్తుచేసి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. 49 నిమిషాల ఈ పోరులో ప్రత్యర్థి నుంచి తొలి గేమ్‌లో ప్రతిఘటన ఎదుర్కొన్న సాత్విక్ జోడీ.. ఆ తర్వాత అద్భుతంగా పుంజుకొని అలవోకగా మ్యాచ్‌ను ముగించింది. గతేడాది ఇక్కడ రన్నరప్‌గా నిలిచిన సాత్విక్/చిరాగ్ జోడీ సెమీఫైనల్లో దక్షిణ కొరియాకు చెందిన వోన్ హో కిమ్/సెంగ్ జే సియోతో అమీతుమీ తేల్చుకోనుంది. కాగా, ఈ టోర్నీలో సెమీస్ చేరడం సాత్విక్ ద్వయానికిది వరుసగా మూడోసారి కావడం విశేషం.

## కోహ్లీ వల్లే యువీ వీడ్కోలు

### రాబిన్ ఊతప్ప



న్యూఢిల్లీ: భారత క్రికెట్‌లో మునుపెన్నడూ లేని రీతిలో ఆటగాళ్లపై మాజీలు సంచలన ఆరోపణలు చేస్తున్నారు. అటు కోచ్ గంభీర్‌పై మనోజ్ తివారీ విరుచుకుపడుతుండగా.. మరోవైపు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై రాబిన్ ఊతప్ప ఘాటు వ్యాఖ్యలు చేశాడు. అతడి వల్లే యువరాజ్ సింగ్ అంతర్జాతీయ కెరీర్ ముగిసిందని ఆరోపించాడు. 'క్యాన్సర్‌ను జయించి తిరిగి క్రికెట్ ఆడిన యువీ ప్రస్థానం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. భారత్‌కు రెండు వరల్డ్ కప్‌లు అందించడంలో కీలకపాత్ర పోషించాడు. కానీ అలాంటి ప్లేయర్‌కు అప్పటి కెప్టెన్ కోహ్లీ నుంచి ఎలాంటి మద్దతూ లభించలేదు. యువీ పడిన కష్టం కోహ్లీకి బాగా తెలుసు. అలాంటిది తన ప్రమాణాలకు సరితూగడం లేదనే సాకుతో యువీని పక్కనబెట్టాడు. అందరూ విరాట్‌లాగే ఫిట్‌గా ఉండాలంటే ఎలా? తన కోసం ఫిట్‌నెస్ టెస్టులో రెండు పాయింట్లు తగ్గించాలని యువీ కోరినా విరాట్ ఒప్పుకోలేదు. ఇందులో తొలుత విఫలమైనా ఆ తర్వాత కష్టపడి జట్టులోకి వచ్చాడు. కానీ చాంపియన్స్ ట్రోఫీలో సరిగా ఆడలేదని యువరాజ్‌ను పక్కకు తప్పించారు. దీంతో అతడు క్రికెట్‌కే వీడ్కోలు పలకాలని నిర్ణయం తీసుకున్నాడు' అని ఊతప్ప వివరించాడు.

# బిజినెస్

## ఈ ఏడాది రూ.14.27 లక్షల కోట్లు

క్యాపిటల్ మార్కెట్ ద్వారా నిధుల సమీకరణలో 21% వృద్ధి



సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఈక్విటీ, డెట్ పథకాల ద్వారా క్యాపిటల్ మార్కెట్ నుంచి కంపెనీల నిధుల సమీకరణ వార్షిక ప్రాతిపదికన 21 శాతం పెరిగి రూ.14.27 లక్షల కోట్లకు చేరుకోవచ్చని సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ అన్నారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో నిధుల సేకరణ రూ.11.8 లక్షల కోట్లుగా నమోదైంది. 2024-25లో గడిచిన 9 నెలల్లో (ఏప్రిల్-డిసెంబరు) కంపెనీలు ఈక్విటీ జారీ ద్వారా రూ.3.3 లక్షల కోట్లు, డెట్ మార్కెట్ నుంచి రూ.7.3 లక్షల కోట్లు కలిపి మొత్తం రూ.10.7 లక్షల కోట్ల వరకు సమీకరించాయని బుచ్ తెలిపారు. ఈ మూడు నెలల్లో (జనవరి-మార్చి) సేకరించనున్న నిధులతో కలిపితే మొత్తం విలువ రూ.14 లక్షల కోట్లు దాటవచ్చని ఎన్ఐఎస్ఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఓ సదస్సులో ఆమె అంచనా వేశారు. మరిన్ని విషయాలు..

- గడిచిన 9 నెలల్లో క్యాపిటల్ మార్కెట్ నుంచి సమీకరించిన మొత్తంలో రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్స్ ట్రస్ట్ (రీట్స్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్స్), మునిసిపల్ బాండ్ల జారీ ద్వారా పోగేసిన నిధుల వాటా చాలా స్వల్పంగా రూ.10,000 కోట్లకు పరిమితమైందని బుచ్ అన్నారు. కానీ, ఈ సాధనాల ద్వారా నిధుల సేకరణ వేగంగా పెరుగుతోందని.. వచ్చే దశాబ్ద కాలంలో ఈక్విటీ, డెట్ మార్కెట్లను విఎంచిపోవచ్చన్నారు.
- అనుమతుల జారీని వేగవంతం చేసే దిశగా సెబీ కృషి చేస్తున్నదని, ఎస్ఎంఈ బోర్డుల ప్రతిపాదనలకు అనుమతుల సమయాన్ని తగ్గించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. ఎస్ఎంఈ ఇష్యూలకు అనుమతిచ్చేందుకు ప్రస్తుతం 3 నెలల వరకు సమయం పడుతోందన్నారు. కాగా, బ్యాంకులు కేవలం 15 నిమిషాల్లో సూత్రపాయ అనుమతులిస్తున్నాయన్నారు.
- చాలా కంపెనీలు పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు ఆసక్తి చూపుతున్నాయని, సెబీకి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయన్నారు. కానీ, ప్రిఫరెన్షియల్ ఇష్యూలు, ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్స్, రైట్స్ ఇష్యూలు వంటి ప్రత్యామ్నాయ మార్గాలూ ముఖ్యమేనని.. ఐపీఓల మోజులో వాటిని గమనించకపోయే ప్రమాదం ఉందన్నారు.
- రైట్స్ ఇష్యూలకు వేగంగా అనుమతులిచ్చేందుకు నియంత్రణ మండలి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. మ్యూచువల్ ఫండ్ల కొత్త ఆఫర్లకు చాలా వేగంగా అనుమతులిస్తున్నామన్నారు.
- కేవలం రూ.250తో క్రమానుగత పెట్టుబడి పథకాన్ని (సిప్) ప్రారంభించే వెసులుబాటును త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. గత కొన్నేళ్లలో మ్యూచువల్ ఫండ్లు వంటి దేశీయ సంస్థాగత ఇన్వెసర్లు (డీఐఐ) ప్రజల నుంచి చిన్న మొత్తాల్లో నిధులు సమీకరిస్తుండటాన్ని బుచ్ ప్రశంసించారు. వీరి నుంచి సమీకరించిన నిధులతో డీఐఐలు భారీగా పెట్టుబడులు పెట్టడం వల్లే మన మార్కెట్ ఒడుదుడుకులను తట్టుకోగలిగిందన్నారు.

## వ్యక్తిగత రుణాలకు స్థిర వడ్డీ రేట్లు తప్పనిసరి

### ఆర్‌బీఐ



ముంబై: నెలవారీ వాయిదాల (ఈఎంఐ) పద్ధతిలో చెల్లించే వ్యక్తిగత రుణాలను బ్యాంకులు తప్పనిసరిగా స్థిర వడ్డీ రేట్లకూ మంజూరు చేయాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) స్పష్టం చేసింది. దీనికి సంబంధించి శుక్రవారం తరచుగా అడిగే కొన్ని ప్రశ్నల (ఎఫ్ఏక్యూ)ను విడుదల చేసింది. అన్ని రకాల వ్యక్తిగత రుణాలకూ ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ రుణాలు మంజూరు చేసేటప్పుడే వార్షిక వడ్డీ రేటును బ్యాంకులు తమ కీ ఫ్యాక్ట్ స్టేట్‌మెంట్ (కేఎఫ్ఎస్), రుణ ఒప్పందంలో తెలియజేయాలని కోరింది. ఏ కారణం చేతనైనా రుణ చెల్లింపు సమయంలో ఈఎంఐ లేదా కాలపరివిుతి మారితే ఆ విషయాన్ని కూడా బ్యాంకులు రుణ గ్రహీతలకు తెలియజేయాలని స్పష్టం చేసింది. ప్రతి మూడు నెలలకు జారీ చేసే స్టేట్‌మెంట్స్‌లోనూ బ్యాంకులు అప్పటి వరకు వసూలు చేసిన అసలు, వడ్డీ వివరాలు, ఈఎంఐ మొత్తం, ఇంకా ఎన్ని ఈఎంఐలు చెల్లించాలి? ఇంకా చెల్లించాల్సిన అసలుపై చెల్లించవలసిన వడ్డీ రేటు కూడా తెలియజేయాలని కోరింది. వడ్డీ రేట్లను సవరించేటప్పుడు బ్యాంకుల వ్యక్తిగత రుణ గ్రహీతలకు తమ బోర్డు ఆమోదించిన విధానానికి అనుగుణంగా స్థిర వడ్డీ రేటుకు మారే అవకాశాన్ని తప్పనిసరిగా కల్పించాలని కూడా ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

## చిన్న సంస్థల రుణాలపై జర జాగ్రత్త




- నిధుల వినియోగం పర్యవేక్షణ తప్పదు
- ఇందుకోసం ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలి
- 8-9 శాతం వృద్ధి రేటుతోనే వికసిత్ భారత్
- ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి

ముంబై: చిన్న కంపెనీలకు ఇచ్చే రుణాల వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) చైర్మన్ సీ శ్రీనివాసులు శెట్టి హెచ్చరించారు. ఈ సంస్థలు అప్పులు లేదా ఈక్విటీ ద్వారా సేకరించే నిధుల తుది వినియోగంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. ఇందుకోసం ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐఎస్ఎం) ఏర్పాటు చేసిన ఒక సదస్సులో ఎస్‌బీఐ చైర్మన్ ఈ విషయాలు చెప్పారు. చిన్నచిన్న కంపెనీలు అప్పులు లేదా ఈక్విటీ ద్వారా సమీకరిస్తున్న నిధులను వేరే అవసరాలకు దారి మళ్లిస్తున్నాయని ఇటీవల పెద్దఎత్తున వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శెట్టి ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం.


**అధికారాలూ ఉండాలి:** కొత్తగా ఏర్పాటు చేసే సంస్థకు.. చిన్న కంపెనీలు అప్పులు లేదా ఈక్విటీ ద్వారా సేకరించే నిధుల తుది వినియోగాన్ని పర్యవేక్షించే అధికారం కూడా ఉండాలని ఎస్‌బీఐ చైర్మన్ శెట్టి స్పష్టం చేశారు. ఇలాంటి సంస్థ ఏర్పాటు అటు రుణదాతలకు.. ఇటు మదుపరులు ఇద్దరికీ మేలు చేస్తుందన్నారు. అప్పుడు చిన్న కంపెనీలు కూడా పోటీ పద్ధతిలో తక్కువ వడ్డీ రేటుకే రుణాలు పొందే సౌలభ్యం ఉంటుందన్నారు. గత ఏడాది మార్చిలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కూడా చిన్న వ్యాపార సంస్థలకు ఇచ్చే రుణాలపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ రుణాల తుది వినియోగాన్ని అప్పులిచ్చిన బ్యాంకులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరింది. బిజినెస్ క్రెడిట్ కార్డులపై తీసుకున్న హామీ లేని రుణాలను కొందరు యువకులు నష్టభయం ఎక్కువగా ఉండే డెరివేటివ్స్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టడంపైనా ఎస్‌బీఐ చీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. యువకుల పెట్టుబడులు డెరివేటివ్ మార్కెట్లకు బదులు ప్రైమరీ మార్కెట్ లేదా మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా 2047 నాటికి మన దేశం అభివృద్ధి చెందిన (వికసిత్ భారత్) దేశంగా ఎదగాలంటే తీసుకోవాల్సిన చర్యలనూ ఎస్‌బీఐ చీఫ్ శెట్టి సూచించారు. ఇందుకోసం 2036 వరకు ఏటా 8-9 శాతం చొప్పున జీడీపీ వృద్ధి రేటు సాధించాల్సి ఉంటుందన్నారు. దీంతో పాటు జీడీపీలో పొదుపు రేటును ప్రస్తుత 30 శాతం నుంచి 33.5 శాతానికి పెంచుకోవాలన్నారు. ఈ విషయంలో క్యాపిటల్ మార్కెట్లది కీలక పాత్ర అన్నారు. సరైన రికార్డుల లేకపోవడంతో ఎంఎస్ఎంఈలకు ఇచ్చే రుణాల రిస్క్‌ను బ్యాంకులు, ఆర్థిక సంస్థలు సరిగా బేరీజు వేయలేకపోతున్నట్టు ఎస్‌బీఐ చైర్మన్ శెట్టి తెలిపారు.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 11వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 490 | విజయవాడ | 515 |
| వరంగల్ | 492 | గోదావరి | 515 |
| చిత్తూరు | 523 | విశాఖపట్నం | 520 |
| | | దజను గుడ్లు రూ. 72 | |

### బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 79,470 ▲ | 72,850 ▲ | 1,01,000 ▲ |
| విజయవాడ | 80,500 ▲ | 75,000 ▼ | 92,500 ▲ |
| విశాఖపట్నం | 78,710 ▲ | 72,150 ▲ | 92,310 ▲ |
| రాజమండ్రి | 79,470 ▲ | 72,850 ▲ | 92,700 ▲ |
| ప్రొద్దుటూరు | 79,600 ▲ | 73,710 ▲ | 92,300 ▲ |
| ముంబై | 78,018 ▲ | 71,465 ▲ | 90,268 ▲ |

### ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 104 | విజయవాడ | 111 |
| వరంగల్ | 104 | గుంటూరు | 110 |
| కరీంనగర్ | 104 | ఒంగోలు | 110 |
| మహబూబ్‌నగర్ | 104 | చిత్తూరు | 95 |
| కర్నూలు | 104 | నెల్లూరు | 100 |
| విశాఖపట్నం | 107 | అనంతపురం | 100 |
| గోదావరి | 111 | | |

## నామినేషన్ల వ్యవస్థ పునర్‌వ్యవస్థీకరణ

### మార్చి 1 నుంచే అమలు: సెబీ

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) ఫోలియోలు, డీమ్యాట్ ఖాతాల నావినేషన్ విధానాన్ని సెబీ పునర్ వ్యవస్థీకరించింది. దీనికి సంబంధించి శుక్రవారం కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ సంవత్సరం మార్చి 1 నుంచే ఇవి అమల్లోకి వస్తాయని తెలిపింది. సెక్యూరిటీస్ మార్కెట్లో పారదర్శకత పెంచడంతో పాటు క్లెయిమ్ చేయని ఆస్తుల తగ్గింపు కోసం సెబీ ఈ చర్య తీసుకుంది. ముఖ్యమైన మార్గదర్శకాలివే..

- సింగిల్ హోల్డింగ్ ఖాతాలకు నామినీ తప్పనిసరి
- జాయింట్ ఖాతాల్లోని చనిపోయిన వ్యక్తి ఆస్తులు నామినేషన్ లేకపోయినా బతికి ఉన్న మిగతా జాయింట్ ఖాతాదారులకు బదిలీ అవుతాయి
- తన తదనంతరం ఎంఎఫ్ ఫోలియోలు, డీమ్యాట్ ఖాతాల్లోని తన ఆస్తులు ఎవరికి ఎవరికి ఎంతెంత చెందాలనే విషయం స్పష్టం చేస్తూ ఖాతాదారులు 10 మందిని నామినేట్ చేసే అవకాశం
- ఖాతాదారుడితో పాటు నామినీల్లో ఎవరైనా చనిపోతే ఆస్తులను దామాషా పద్ధతిలో మిగతా నామినీలకు పంచుతారు
- చనిపోయిన వ్యక్తుల వారసుల తరఫున నామినీలు ట్రస్టీలుగా ఆస్తులు పొందేందుకు ఆమోదం.

## 1 డాలర్ = రూ. 86

- మరింత క్షీణించిన భారత కరెన్సీ
- సరికొత్త కనిష్ఠానికి మారకం విలువ

ముంబై: భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపీ మారకం విలువ మరో 18 పైసలు క్షీణించి రూ.86.04కు చేరింది. ఎక్స్ఛేంజ్ రేటు రూ.86 దాటడం ఇదే తొలిసారి. అంతర్జాతీయంగా డాలర్ బలం పుంజుకుంటుండటంతో పాటు ముడిచమురు ధరల పెరుగుదల, ఈక్విటీ మార్కెట్లో నష్టాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోతుండటం మన రూపాయిని మరింత బలహీనపరిచాయని ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ నెల 20న అమెరికా కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న డొనాల్డ్ ట్రంప్ హయాంలో వాణిజ్య ఆంక్షలు పెరగవచ్చన్న ఆందోళనల కారణంగా దిగుమతిదారుల నుంచి డాలర్‌కు డిమాండ్ పెరిగిందని, దాంతో డాలర్ విలువ రోజురోజుకూ పెరుగుతూపోతోందని ఫారెక్స్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఫారెక్స్ మార్కెట్లో శుక్రవారం రూ.85.88 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీ ట్రేడింగ్.. ఒక దశలో కాస్త బలపడి రూ.85.85 స్థాయికి చేరింది. కానీ, చివరికి 14 పైసల నష్టంతో రూ.86 వద్ద స్థిరపడింది.

### మళ్లీ 80 డాలర్లకు క్రూడ్

ముడిచమురు భగ్గుమంటోంది. బ్రెంట్ క్రూడాయిల్ మళ్లీ 80 డాలర్లు దాటింది. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ పీపా ధర ఒక దశలో 4 శాతానికి పైగా ఎగబాకి 80.75 డాలర్లకు పెరిగింది. బ్రెంట్ క్రూడ్ రేటు ఈ స్థాయికి చేరడం గత ఏడాది అక్టోబరు తర్వాత మళ్లీ ఇదే మొదటిసారి. పెట్రోలియం ఎగుమతి దేశాలైన రష్యా, ఇరాన్‌పై అమెరికా మరిన్ని ఆంక్షలు విధించవచ్చని, దాంతో మార్కెట్లోకి సరఫరా గణనీయంగా తగ్గవచ్చన్న ఆందోళనలు ఇందుకు కారణమయ్యాయి.

## ఐఎంటీఎంఏతో ఏస్ మైక్రోమాటిక్ జట్టు



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెషిన్ టూల్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఐఎంటీఎంఏ)తో ఏస్ మైక్రోమాటిక్ గ్రూప్‌తో వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు ఐఎంటీఎంఏ డైరెక్టర్ జనరల్, సీఈఓ జిబాక్ దాస్‌గుప్తా, ఏస్ మైక్రోమాటిక్ డిజైనర్స్ ఎండీ టీకే రమేష్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. తయారీ రంగంలో ఉత్పాదకతను పెంచేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని ఇరు సంస్థలు ప్రకటించాయి. కాగా 2015 నుంచి ఈ రెండు సంస్థలు సంయుక్తంగా నేషనల్ ప్రొడక్టివిటీ సమ్మిట్‌ను నిర్వహిస్తూ వస్తున్నాయి. తాజాగా ఈ భాగస్వామ్యాన్ని 2025 నుంచి మరో ఐదేళ్ల పాటు కొనసాగించనున్నాయి. ఒప్పందంలో భాగంగా ఈ సమ్మిట్‌కు ఏస్ మైక్రోమాటిక్ గ్రూప్ స్పాన్సర్‌గా వ్యవహరించనుంది. రానున్న సంవత్సరాల్లో నేషనల్ ప్రొడక్టివిటీ సమ్మిట్‌కు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు ఈ ఒప్పందం ఎంతగానో దోహదపడుతుందని ఐఎంటీఎంఏ ప్రెసిడెంట్ ఎస్ రాజమనే అన్నారు.

### సెన్సెక్స్ మరో 241 పాయింట్లు డౌన్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ వరుసగా మూడో రోజూ నష్టపోయింది. సెన్సెక్స్ మరో 241.30 పాయింట్లు క్షీణించి 77,378.91 వద్దకు జారుకుంది. నిఫ్టీ 95 పాయింట్లు కోల్పోయి 23,431.50 వద్ద స్థిరపడింది. ముడిచమురు ధరల పెరుగుదల, డాలర్ బలోపేతం మార్కెట్‌ను మరింత కుంగదీశాయి. మూడు సెషన్లలో సెన్సెక్స్ 820.2 పాయింట్లు నష్టపోయింది. బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ మూడ్రోజుల్లో రూ.12.07 లక్షల కోట్లు తగ్గి రూ.429.67 లక్షల కోట్లకు (5 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
విజయవాడ ● శనివారం 11 జనవరి 2025

## రేసింగ్ ముగిసేవరకు నటనకు దూరం

- హీరో అజిత్ కుమార్



ఇంటర్నేషనల్ కార్ రేసింగ్ పోటీలు ముగిసేవరకు తాను సినిమాల్లో నటించబోనని హీరో అజిత్ కుమార్ వెల్లడించారు. ఇదే విషయంపై ఆయన శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. 18వ యేట నుంచి రేసింగ్ పోటీల్లో పాల్గొంటూ వస్తున్నానని తెలిపారు. అయితే, సినిమాల్లోకి రావడంతో ఈ రేసింగ్ పోటీల్లో పాలుపంచుకోవడం వీలుపడలేదన్నారు. వచ్చే సెప్టెంబరులో కార్ రేసింగ్ పోటీలు జరుగనున్నాయన్నారు. అప్పటివరకు సినిమాల్లో నటించబోనని ఆయన స్పష్టం చేశారు. కాగా, ఇటీవల ఈ రేసింగ్ పోటీల కోసం దుబాయ్‌లో శిక్షణ పొందుతుండగా, అజిత్ కుమార్ కారు ప్రమాదానికి గురైన విషయం తెల్సిందే. ఈ ప్రమాదం నుంచి ఆయన తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. అయినప్పటికీ ఆయన రేసింగ్ పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు. చెన్నై, (ఆంధ్రజ్యోతి)



## ఆ ఆలోచన నుంచే డాకు మహారాజ్ కథ పుట్టింది

నందమూరి బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ హీరోగా బాబీ కొల్లి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'డాకూ మహారాజ్' చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో థియేట్రికల్ ట్రైలర్ విడుదల చేశారు. 'రాయలసీమ మాలూమ్ తేరే కో.. ఓ మేరా అడ్డా ', 'ఎవరన్నా చదవడంలో మాస్టర్స్ చేస్తారు. నేను చంపడంలో చేశా' అంటూ బాలకృష్ణ చెప్పిన పవర్‌ఫుల్ డైలాగులతో ఈ ట్రైలర్ ఆకట్టుకుంటోంది. అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలు, కట్టిపడేసే భావోద్వేగాలతో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా 'డాకూ మహారాజ్' చిత్రాన్ని తీర్చిదిద్దారని ఈ ట్రైలర్ చూడగానే అర్థమవుతుంది. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ 'తిరుమలలో తొక్కిసలాట ఘటన నన్నెంతో కలచివేసింది. ఆ ఘటనలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను. అటువంటి బాధాకర సంఘటన చోటు చేసుకోవడంతో అనంతపురంలో తలపెట్టిన వేడుకలను రద్దు చేశాం. నా అభిమానులు క్రమశిక్షణ కలిగిన సైనికులు. అందుకే వారు మా నిర్ణయాన్ని స్వాగతించారు' అన్నారు. 'డాకు మహారాజ్ చిత్రం గురించి మాట్లాడుతూ 'నేను అప్పట్లో చేసిన 'ఆదిత్య 369' చిత్రంలో కృష్ణదేవరాయల పాత్ర చిరస్థాయిగా నిలిచిపోయింది. అలాంటి పాత్ర చేస్తే బాగుంటుందనే ఆలోచన నుంచి 'డాకు మహారాజ్' కథ పుట్టింది. మూడు వరుస విజయాల తర్వాత వస్తున్న ఈ సినిమా కూడా ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. ఇక ముందు కూడా ఇలాగే మరిన్ని మంచి సినిమాలతో మీ ముందుకు వస్తాను' అన్నారు.

దర్శకుడు కొల్లి బాబీ మాట్లాడుతూ 'అభిమానుల కోసం కొత్తగా ఏదైనా చేయాలని తపించే వ్యక్తి బాలయ్య. అందుకే నా టీమ్‌తో కలసి ఎంతో శ్రద్ధగా ఈ స్క్రిప్ట్ సిద్ధం చేశా. బాలకృష్ణగారితో ఒకసారి కలసి పని చేస్తే ఆయనని ప్రేమిస్తాం, అభిమానిస్తాం ఆయనతో మళ్లీ మళ్లీ కలసి పని చేయాలని అనిపిస్తుంది' అన్నారు.

'వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈ రోజు టికెట్ బుకింగ్స్ ఓపెన్ చేశాం. అందరూ టికెట్స్ బుక్ చేసుకుని బాలకృష్ణగారికి మంచి ఓపెనింగ్స్ ఇస్తారని ఆశిస్తున్నాం' అన్నారు నిర్మాత నాగవంశీ. ఈ చిత్ర బృందం సృష్టించిన డాకు మహారాజ్ ప్రపంచం గొప్పది, చాలా కొత్తగా ఉంటుందని సంగీత దర్శకుడు థమన్ చెప్పారు గొప్ప విజువల్స్ వల్లే మంచి సంగీతం ఇవ్వగలిగానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగ్యా జైస్వాల్, ఊర్వశి రౌతేలా, శ్రద్ధా శ్రీనాథ్ పాల్గొన్నారు.



## కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుంది

- డైరెక్టర్ అనిల్ రావిపూడి

వెంకటేశ్ హీరోగా, మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ హీరోయిన్లుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్‌రాజు, శిరీష్ నిర్మించారు. ఈనెల 14న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి మీడియాతో మాట్లాడుతూ 'కథ అనుకున్నప్పుడు ఫెస్టివల్ ఫిల్మ్ అనుకుని స్టార్ట్ చేశాం. వెంకటేశ్‌తో చేసిన ఎఫ్2 సంక్రాంతికి వచ్చి పెద్ద విజయం సాధించింది. ఎఫ్3 కూడా సంక్రాంతికి రావాల్సింది. కానీ మిస్ అయ్యింది. ఈసారి చేసే సినిమా ఎలాగైనా పొంగల్‌కి తీసుకొస్తే బావుంటుందని అనుకున్నాం. ఈ సినిమా కథ ఒక రెస్క్యూ ఆపరేషన్‌కి సంబంధించింది. సెకండ్ హాఫ్‌లో నాలుగు రోజులు జర్నీ సంక్రాంతికి ముందు ఆరంభం అవుతుంది. కథ అనుకున్నప్పుడే 'సంక్రాంతికి వస్తున్నాం' టైటిల్‌కి ఫిక్స్ అయ్యాం. ఈ సినిమా తప్పకుండా బ్లాక్‌బస్టర్ అవుతుందనే నమ్మకం నాకుంది. మంచి కథ రాసి గొప్పగా తీయగానే సరిపోదు. థియేటర్లకు జనాలు రాకపోతే సినిమాకి రీచ్ ఉండదు. ఇప్పుడు ఆడియన్స్ బాగా సెలెక్టివ్ అయిపోయారు. మన సినిమా వారి అటెన్షన్‌ని గ్రాబ్ చేస్తేనే ఓపెనింగ్స్ తెచ్చుకోగలమని నా అభిప్రాయం. ఈసారి సోషల్ మీడియాపై ఎక్కువగా ఫోకస్ చేశాం. వెంకటేశ్ వంటి పెద్ద స్టార్ రీల్స్ చేయడం ప్రమోషన్స్‌కి చాలా హెల్ప్ అయ్యింది. 'గోదారి గట్టు' పాట గ్లోబల్ సాంగ్ అయ్యింది. 85 మిలియన్స్ వ్యూస్‌ని క్రాస్ చేసింది. భాగ్యం చాలా మంచి క్యారెక్టర్. ఐశ్వర్యకి మంచి పేరు వస్తుంది. వెంకటేశ్‌కి బ్లాక్‌బస్టర్ పొంగల్ సాంగ్ చాలా నచ్చింది. 20 నిమిషాల్లో ఆయనే స్వయంగా పాడారు. భీమ్స్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. బీజీఎం వండర్‌ఫుల్‌గా ఉంటుంది. హీరోలని స్క్రీన్ మీద చూసినప్పుడు ఎలా అభిమానించానో వాళ్లతో సినిమా చేసినప్పుడు కూడా అదే అభిమానంతో ఉంటాను. నేను హీరోలకి ఫ్యాన్ బాయ్‌లానే ఉంటాను. రిలేషన్‌ని పాజిటివ్‌గా ఉంచుతాను కాబట్టి వాళ్ల నుంచి కూడా అంతే ప్రేమ వస్తుంది. విమెన్ సెంట్రిక్‌గా ఒక స్పోర్ట్స్ స్టోరీ చేయాలని ఎప్పటినుంచో ఉంది. కొన్నాళ్ల తర్వాత స్పోర్ట్స్ డ్రామా చేస్తాను. 'ఎఫ్4' సినిమా తప్పకుండా ఉంటుంది. అయితే దానికి కొంత సమయం ఉంది' అని అన్నారు.

## టీఎన్ శేషన్ స్ఫూర్తితో రామ్‌నందన్ పాత్రకు రూపకల్పన?



శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ కథానాయకుడిగా నటించిన 'గేమ్‌చేంజర్' చిత్రం శుక్రవారం విడుదలైన విషయం తెలిసిందే. ఈ చిత్రంలో రామ్‌చరణ్ పోషించిన రెండు విభిన్న పాత్రలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ఓ గొప్ప వ్యక్తి జీవితం స్ఫూర్తితో, ఆయన జీవితంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా కథను తీర్చిదిద్దారనే మాట సినీ విశ్లేషకుల నుంచి వినిపిస్తోంది. ఆ వ్యక్తి మరెవరో కాదు... తాను చేపట్టిన పదవికే వన్నె తెచ్చిన భారత ఎన్నికల సంఘం మాజీ ఛీఫ్ కమిషనర్ టీఎన్ శేషన్. ఆయన భారత ఎన్నికల సంఘానికి 10వ సీఈసీగా బాధ్యతలు నిర్వహించారు. నిబంధనల అమల్లో పెద్ద పెద్ద రాజకీయ నాయకులను సైతం లెక్కచేయకుండా వ్యవహరించారు. ఎన్నికల నిర్వహణలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. టీఎన్ శేషన్ జీవితం ఆధారంగానే 'గేమ్‌చేంజర్' చిత్రంలో రామ్‌చరణ్ పాత్రను రచయిత కార్తీక్ సుబ్బరాజ్ తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. శేషన్ కళాశాల రోజుల్లో విద్యార్థి నాయకుడుగా పనిచేశారు. తర్వాత ఐపీఎస్‌కు, ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. 'గేమ్‌చేంజర్‌లో రామ్‌నందన్ పాత్రలో రామ్‌చరణ్ సైతం స్టూడెంట్ లీడర్, ఐపీఎస్, ఐఏఎస్, ఎన్నికల అధికారిగా కనిపించారు. దీంతో శేషన్ జీవితం ఆధారంగా రాసుకున్న కథ ఇదని సమీక్షకులు అభిప్రాయపడుతున్నారు. శేషన్ పేరు వెల్లడించలేదు గానీ తన పాత్రకు స్ఫూర్తిగా నిలిచిన ఓ మాజీ ప్రభుత్వ అధికారి వీడియోలు, ఆయన పనితీరును నిశితంగా అధ్యయనం చేసినట్లు గతంలో రామ్‌చరణ్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు.

## ఇక జర్మనీ వెళ్లాల్సిన అవసరం లేదు

- రాజమౌళి



భారతదేశంలో మొట్టమొదటి డాల్బీ సర్టిఫైడ్ పోస్ట్‌ప్రొడక్షన్ ఫెసిలిటీని అన్నపూర్ణ స్టూడియోస్‌లో ప్రముఖ దర్శకులు ఎస్.ఎస్.రాజమౌళి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్టూడియో వైస్ ఛైర్మన్, హీరో నాగార్జున అక్కినేని, ఈడీ సుప్రియా యార్లగడ్డ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ 'ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణ సమయంలో మేము సినిమాను డాల్బీ విజన్‌లో గ్రేడ్ చేయాలనుకున్నప్పుడు, జర్మనీ వరకు ప్రయాణించాల్సి వచ్చింది. మన దేశంలోనే డాల్బీ విజన్‌లో నా సినిమాను ఎక్స్ పీరియన్స్ చేయలేకపోవడం కొంచెం నిరుత్సాహపరిచింది. కానీ ఈ రోజు, అన్నపూర్ణ స్టూడియోస్‌లో డాల్బీ విజన్ గ్రేడింగ్ సౌకర్యాన్ని చూసి చాలా థ్రిల్ అయ్యాను' అని అన్నారు. నాగార్జున అక్కినేని మాట్లాడుతూ ' అన్నపూర్ణ స్టూడియోస్ 50వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా డాల్బీతో ఈ సహకారం గొప్ప దార్శనికతకు నిదర్శనం. అన్నపూర్ణలో చేంజ్ ఇన్నోవేషన్ స్వీకరించడం మా లెగసీ, ఇది ఆ ప్రయాణంలో మరో ముందడుగు' అని అన్నారు.

## రష్మికకు గాయం... సికందర్‌కు బ్రేక్



కథానాయిక రష్మిక మందన్న గాయపడ్డారని సమాచారం. జిమ్‌లో వ్యాయామం చేస్తుండగా ఆమెకు తీవ్ర గాయాలైనట్లు శుక్రవారం బాలీవుడ్ మీడియాలో ప్రచారం జరిగింది. వైద్యులు వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని రష్మికకు సూచించారనీ, దీంతో ఆమె సినిమా చిత్రీకరణలను రద్దు చేసుకున్నారనేది ఆ వార్తల సారాంశం. అయితే రష్మిక ఇప్పటివరకూ ఈ ప్రచారంపై స్పందించలేదు. ఆమె ప్రస్తుతం సల్మాన్‌ఖాన్‌సరసన 'సికందర్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రం కోసం రష్మిక కొన్నాళ్లుగా జిమ్‌లో తీవ్రంగా కసరత్తులు చేస్తున్నారు. ముంబైలో సల్మాన్, రష్మికపై కీలక సన్నివేశాల చిత్రీకరణ కోసం భారీ సెట్‌ను ఏర్పాటు చేశారు. రష్మిక గాయపడడంతో శుక్రవారం ఆరంభం కావాల్సిన 'సికందర్' చివరి షెడ్యూల్ నిలిచిపోయినట్లు బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.

## నిర్మాతగా ఝలక్



వరుస సినిమాలతో జోరుమీదున్నాడు బాలీవుడ్ హీరో అజయ్ దేవ్‌గణ్. హీరోగా సినిమాలు చేస్తూనే తన సొంత బేనర్ దేవ్‌గణ్ ఫిల్మ్స్ బేనర్‌పై సినిమాలు నిర్మిస్తున్నారు. తాజాగా పనోరమా స్టూడియోస్‌తో కలసి ఆయన ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సినిమాకు 'ఝలక్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. హారర్ కామెడీ జానర్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో అజయ్ దేవ్‌గణ్ మేనల్లుడు అమన్ దేవ్‌గణ్ హీరోగా నటిస్తున్నాడు. అజయ్ దేవ్‌గణ్ హీరోగా నటించిన 'ఆజాద్' చిత్రంలో అమన్ ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం ఈనెల 26న విడుదలవనుంది. 'మా హృదయాలకు దగ్గరైన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ప్రేక్షకులను భయపెడుతూనే హాస్యం పంచే కొత్త తరహా కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం' అని నిర్మాణ సంస్థ తెలిపింది. సినిమాకు సంబంధించిన ఇతర వివరాలు త్వరలో ప్రకటించనున్నారు.

## అఖండలా బ్రహ్మాండ



ఒగ్గు కళాకారుల జీవితాల నేపథ్యంలో వారి సంస్కృతి, సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ రూపొందించిన చిత్రం 'బ్రహ్మాండ'. రాంబాబు దర్శకత్వంలో దాసరి సురేశ్ నిర్మించారు. ఆమని, జయరామ్, బన్నీరాజ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ నెల చివరివారంలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా నిర్మాత విర్యాల రవీందర్‌రెడ్డి 'బ్రహ్మాండ' ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశార. "అఖండ" చిత్రంలా 'బ్రహ్మాండ' సినిమా కూడా ఘన విజయం సాధించాలి' అని ఆయన ఆకాంక్షించారు. ఈ చిత్రానికి సంగీతం: వరికుప్పల యాదగిరి, సినిమాటోగ్రఫీ: కాసుల కార్తిక్

ఇన్ ప్రోగ్రెస్

## అందరికీ నచ్చేలా..

కిట్టు తాటికొండ, కష్మీరా, రోహిత్, వైశాలి, సునీల్ రావినూతల, శ్రీ గోపి చంద్ కొండ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కరణం గారి వీధి'. దర్శకద్వయం హేమంత్, ప్రశాంత్ తెరకెక్కిస్తున్నారు. అడవి అశోక్ నిర్మిస్తున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే కంప్లీట్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. త్వరలో విడుదలకు



సిద్ధమవుతోన్న ఈ సినిమా పోస్టర్‌ను ప్రముఖ నటుడు మురళీమోహన్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రబృందానికి అభినందనలు తెలిపారు. త్వరలోనే సినిమాను థియేటర్లలో విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు. దర్శకుడు హేమంత్ మాట్లాడుతూ 'ఈ చిత్రంలో మనం నిజ జీవితంలో చూసే వాస్తవిక ఘటనలు ఉంటాయి. అందరికీ నచ్చేలా రూపొందిస్తున్నాం' అని అన్నారు.

## సైకలాజికల్ థ్రిల్లర్



ధన్య బాలకృష్ణ, పూజా రామచంద్రన్, రవి వర్మ ప్రధాన పాత్రల్లో శ్రీవిద్య బసవ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'హత్య'. ఎస్.ప్రశాంత్ రెడ్డి నిర్మాత. ఈనెల 24న విడుదలవుతోంది. నటుడు రవివర్మ చేతుల మీదుగా చిత్రం టీజర్ విడుదలైంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకురాలు శ్రీ విద్య బసవ మాట్లాడుతూ 'ఈ చిత్రాన్ని సీట్ ఎడ్జ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీగా అలరించేలా తెరకెక్కించాను. నరేశ్ అద్భుతమైన బీజీఎంను అందించాడు. అభిరాజ్ విజువల్స్ చక్కగా కుదిరాయి' అని తెలిపారు. నటుడు రవివర్మ మాట్లాడుతూ 'రొటీన్‌కు భిన్నమైన రోల్‌కు శ్రీవిద్య నన్ను ఎంపిక చేశారు. ఇది నాకొక ఛాలెంజింగ్ రోల్' అని అన్నారు.

# రేనాటి వీరుడా వందనం

## నేడు అధికారికంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

(నంద్యాల - ఆంధ్రజ్యోతి)

రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని తెలుగునాట తొలిసారి సవాల్ చేసిన సైరా... ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి మిత్రుడు, జీవితంలోను, పోరాటంలోను, మరణంలోను స్నేహితుడి వెంట నిలిచిన వీరుడు వడ్డే ఓబన్న జయంతి నేడు. రాష్ట్ర ప్రభుత్వం తొలిసారి ఆయనను స్వాతంత్ర సమరయోధునిగా గుర్తించింది. ఇకపై... ప్రతి జనవరి 11న వడ్డే ఓబన్న జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో వడ్డే ఓబన్న చరిత్ర ఇప్పుడు అందరిలో ఆసక్తిని రేపుతోంది. నంద్యాల జిల్లాలోని సంజామల మండలం నొస్సం గ్రామానికి చెందిన వడ్డె సుబ్బయ్య, సుబ్బమ్మ దంపతులకు ఓబన్న 1807 జనవరి 11న జన్మించారు. ఉయ్యాలవాడ తాత చెంచుమళ్ల జయరామరెడ్డిది ఇదే గ్రామం. ఓబన్న తండ్రి గ్రామ రక్షకునిగా(తలారీ)గా పనిచేసేవారు. ఈ రెండు కుటుంబాల మధ్య మంచి సంబంధాలు ఉండేవి. నరసింహారెడ్డి, ఓబన్నల మిత్రత్వం చిన్ననాడే మొదలై, మరణం వరకు కొనసాగింది. అప్పట్లో గ్రామ రక్షకుల జీతాలను తెల్లదొరలు రద్దుచేశారు. ఉయ్యాలవాడ వంశానికి ఎప్పటినుంచో అందుతున్న భరణాలను ఎగ్గొట్టారు. రైతులపై అధిక పన్నులు విధించారు. కరువు, కాటకాలతో పంటలు పండకపోయినా.. బలవంతంగా రైతులనుంచి శిస్తు వసులు చేసేవారు. వస్తుమార్పిడికి విరుద్ధంగా డబ్బులు కట్టాలంటూ హింసించేవారు. దీనికి వ్యతిరేకంగా 1845లో సైరా.. నరసింహారెడ్డి నాయకత్వంలో ఉద్యమం మొదలైంది. ఆయన వెంట ప్రజలు సాయుధులై నిలిచారు. ఈ ఉద్యమం ఏడాది సాగింది. వడ్డే ఓబన్న తన స్నేహితుడికి బాసటగా ఉద్యమంలో ముందువరుసలో నిలిచారు. ఆయనను ఈ పోరాటానికి సైన్యాధికారిగా సైరా.. ప్రకటించారు. నరసింహారెడ్డి తన అనుచరులతో కలిసి 1846 జూలై 10న కోవెలకుంట్ల సబ్ ట్రెజరీపై దాడి చేశారు. అక్కడినుంచి 3నెలల పాటు, అంటే అక్టోబరు 6 వరకు బ్రిటీష్ పాలకులతో వీరోచితంగా పోరాడారు. అధికారులపై మెరుపు దాడులు సాగించిన తర్వాత నల్లమలలోకి వెళ్లి ఓబన్న నాయకత్వంలో కొత్త దాడులకు వ్యూహరచన సాగించేవారు. దీంతో తెల్లదొరలు ఇతర ప్రాంతాల్లోని బలగాలను రప్పించి అణచివేతను తీవ్రతరం చేశారు. ఇన్‌ఫార్మర్ వ్యవస్థను ఏర్పాటుచేసుకుని పోరాటవీరుల సమాచారం సేకరించారు. సంజామల మండలం గిద్దలూరు గ్రామ సమీపంలోని జగన్నాథకొండ వద్ద నరసింహారెడ్డి, ఓబన్న తమ బలగాలతో ఉన్నట్టు ద్రోహి ఇచ్చిన సమాచారంతో బ్రిటిష్ బలగాలు అక్కడకు పెద్దఎత్తున చేరుకున్నాయి. సైరా సేనలను ఓబన్న.. బ్రిటిష్ సైన్యాన్ని లెఫ్ట్‌నెంట్ వాట్సన్, కెప్టెన్ రసూల్ నడిపారు. 1846 అక్టోబరు 6న జగన్నాథకొండ వద్ద భీకర పోరాటం సాగింది. నరసింహారెడ్డి అనుచరుల్లో చాలామంది మరణించారు. అయినా, ఓబన్న, సైరా.. చివరివరకు పోరాడారు. ముందుగా వడ్డే ఓబన్న వీరమరణం పొందారు. అప్పటికి ఆయన వయసు 39 ఏళ్లు. ఆ తర్వాత నరసింహారెడ్డిని బందీగా పట్టుకుని కోవెలకుంట్లలో గుమ్మానికి ఉరితీశారు.



### ప్రతి ఉగాదికీ భోజనాలు

"వడ్డే ఓబన్నకు ముందు తరం నొస్సంలో స్థిరపడింది. ఓబన్నని చంపేసిన తర్వాత నొస్సంలోని ఆయన స్థావరాలు, వంశీయులపై తెల్లదొరలు దాడులు చేశారు. దీంతో నొస్సం వదిలి, అదే మండలంలోని రూపనగుడికి 10 కుటుంబాలు వెళ్లి స్థిరపడ్డాయి. అక్కడ కూడా అణచివేత కొనసాగడంతో ఉయ్యాలవాడ మండలం ఆర్.పాపంపల్లికి వచ్చాయి. ఓబన్న వంశంలో నాది ఐదోతరం. నా సోదరులందరూ చనిపోయారు. నేను ఒక్కడినే బతికి ఉన్నా. నేను, నా చిన్న కుమారుడు ఇక్కడే వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాం. వంశీయులందరం కలిసి కొన్నేళ్ల పాటు ప్రతి ఉగాదికీ ఆయన జయంతి రోజు అన్నదానం చేసేవాళ్లం. ప్రభుత్వం మా వడ్డె ఓబన్నను గుర్తించడం సంతోషంగా ఉంది"

- వడ్డే వెంకటేశులు, ఐదోతరం వారసుడు

### నమ్మినబంటుగా ఉండేవారు

"ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి వడ్డే ఓబన్న నమ్మినబంటుగా ఉండేవారు. ఆంగ్లేయుల నుంచి వచ్చే భరణాన్ని ఓబన్న తీసుకుని వచ్చి నరసింహారెడ్డికి ఇచ్చేవారు. అంతగా నమ్మి ఉండేవారు. సైన్యాధిపతిగా ఎన్నో సేవలందించారని మా పూర్వీకులు చెప్పేవారు"

- కర్నాటి ప్రభాకర్‌రెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వంశీయుడు, రూపనగుడి

### చాలా సంతోషం

"వడ్డెర జాతికే కాదు.. ప్రపంచానికే రేనాటి వీరుడు వడ్డే ఓబన్న చరిత్రను తెలియ జేసే విధంగా ఆయన జయంతిని అధికారింగా ప్రకటిస్తూ చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది. వందల సంవత్సరాలు మరుగునపడిన ఆయన ఖ్యాతిని వెలుగులోకి తెచ్చిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, సవిత, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి కృతజ్ఞతలు"

- వడ్డే బాల నరసింహుడు, ఆరో తరం వారసుడు

# త్వరలో 8 వేల ఖాళీల భర్తీ

» ఆరోగ్య శాఖలో 25.97% సిబ్బంది కొరత: మంత్రి సత్యకుమార్

అమరావతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో సేవలను మరింత మెరుగు పరిచేదుందుకు త్వరలోనే 7 నుంచి 8 వేల పోస్టులు భర్తీ చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. దీనికోసం ప్రాధాన్యతల ఆధారంగా వెంటనే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. వైద్య ఆరోగ్యశాఖపై శుక్రవారం సచివాలయంలో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆరోగ్య శాఖలోని ప్రధాన విభాగాల్లో 1,01,125 పోస్టులు ఉంటే.. వాటిలో 26,263 ఖాళీలున్నాయని మంత్రి తెలిపారు. సిబ్బంది కొరత 25.97 శాతం ఉన్నప్పటికీ దీన్ని 'జీరో వేకెన్సీ' అంటూ గత ప్రభుత్వంలో ప్రచారం చేసుకున్నారని విమర్శించారు. సమీక్షలో ఉన్నతాధికారులు ఎంటీ కృష్ణబాబు, వాకాటి కరుణ, ఎ.సిరి, పద్మావతి, నరసింహం పాల్గొన్నారు.

## రాష్ట్రానికి రూ.7 వేల కోట్ల నిధులు

న్యూఢిల్లీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు వాటాల పంపిణీ కింద ఏపీకి రూ.7,002.52 కోట్లు విడుదలయ్యాయి. తెలంగాణకు ఇదే పద్దుకింద కేంద్రం రూ.3,637 కోట్లను విడుదల చేసింది. జనవరి నెలకుగాను ఇవ్వాల్సిన పన్నుల వాటా పంపిణీ నిధులను కేంద్ర ఆర్థిక శాఖ గురువారం విడుదల చేసింది. దేశంలోని 28 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కలిపి మొత్తం రూ.1,73,030 కోట్లను విడుదల చేసినట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది.

## వచ్చే ఏడాది నుంచి 9, 10 తరగతుల్లో 'రాష్ట్ర హిందీ'

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరం నుంచి 9, 10 తరగతుల విద్యార్థులకు హిందీ పాఠ్యాంశంలో రాష్ట్ర విద్య పరిశోధనా, శిక్షణా మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) సిలబస్‌నే అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ప్రస్తుతం ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ అమలు చేస్తున్నారు. అది ఉత్తరాది రాష్ట్రాలకు అనుకూలంగా, దక్షిణాది విద్యార్థులకు క్లిష్టంగా ఉండటంతో.. వచ్చే ఏడాది నుంచి రాష్ట్ర హిందీ సిలబస్‌నే అమలుచేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఉపాధ్యాయ సంఘాలతో శుక్రవారం జరిగిన సమావేశంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి. విజయరామరాజు ఈ విషయాన్ని వెల్లడించారు.

## ప్రభుత్వ శాఖలకు ఆర్టీజీఎస్ సహకారం: సీఎస్

ప్రభుత్వంలోని వివిధ శాఖలు తమ పనితీరు మెరుగుపరచుకోవడానికి వీలుగా రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) సాంకేతిక సహకారాన్ని అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. శుక్రవారం అమరావతి సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, ఇకపై ఆర్టీజీఎస్ కార్యకలాపాలను తాను కూడా ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తానని చెప్పారు. ప్రజలందరికీ అర్థమయ్యేలా ఇంగ్లిష్, తెలుగు భాషల్లో వాట్సాప్ గవర్నెన్స్ ఉండాలన్నారు.

## తులసిబాబు బెయిల్ పిటిషన్ వేరే బెంచ్‌కు

కామేపల్లి తులసిబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ విచారణ నుంచి తప్పుకొంటున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి శుక్రవారం ప్రకటించారు. పిటిషన్ మరో బెంచ్ ముందు విచారణకు వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీని ఆదేశించారు. విచారణను ఈ నెల 17కి వాయిదా వేశారు. వ్యాజ్యంలో ప్రతివాదిగా ఉన్న రఘురామ తరపున గతంలో తాను హాజరైనందున విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు.

## ఆదివాసీల జీవితాల్లో వెలుగులు: మంత్రి గొట్టిపాటి

ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపుతామని విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. విద్యుత్తు సదుపాయం లేని 1,750 ఆదివాసీ గృహాలను గుర్తించామని, రూ.2.20 కోట్లతో ఆరు గ్రామాల్లోని గిరిజన తాండాల్లో 956 ఇళ్లకు కరెంట్ ఇచ్చామన్నారు. టైగర్ రిజర్వ్ ఫారెస్టు జోన్‌లో ఉన్న మరో 611 ఇళ్లకు సోలార్ బ్యాటరీతో నిరంతర విద్యుత్తు అందిస్తామని శుక్రవారం వెల్లడించారు. గిరిజన గ్రామాల్లోని చెంచులు పేదరికంతో జీవిస్తున్నారని, వారికి విద్యుత్తు అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు.

## జగనన్న కాలనీలు.. ఇకపై ఎన్టీఆర్ నగర్‌లు

గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో 'నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల పేరు మారుస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జగనన్న కాలనీలకు 'పీఎంఏవై-ఎన్టీఆర్ నగర్‌లు'గా నామకరణం చేయాలని ఆదేశిస్తూ రాష్ట్ర గృహ నిర్మాణశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు.

## మద్యం కొరత రానీయొద్దు.. సమీక్షలో ఉన్నతాధికారులు

సంక్రాంతి నేపథ్యంలో లిక్కర్, బీరును లైసెన్సీలకు సరిపడా అందుబాటులో ఉంచేలా చూడాలని, కొరతతో మద్యం ప్రియులు ఇబ్బంది పడకూడదని ఎక్సైజ్ డైరెక్టర్ నిషాంత్‌కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ ఎక్సైజ్ అధికారులకు స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లాల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సారా తయారీ గ్రామాల్లో దాడులు పెంచాలని, నకిలీ మద్యం, కల్తీ తాటి కల్లు విక్రయాలపైనా దృష్టి పెట్టాలన్నారు.

# బ్రాండ్ ఏపీ!

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నాయి. అన్ని రంగాలు పతానవస్థకు చేరుకొన్నాయి. ఎటు చూసినా విధ్వంసం, అంధకారమే. ప్రజలు మమ్మల్ని నమ్మి 93శాతం మంది అభ్యర్థులను గెలిపించారు. ఆ నమ్మకాన్ని నిలుపుకొంటూ రాష్ట్ర పునర్నిర్మాణాన్ని ప్రారంభించాం. రెండు రోజుల క్రితమే ప్రధాని మోదీ విశాఖకు వచ్చి రూ.2.08 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇప్పుడిప్పుడే పెట్టుబడులు వస్తున్నాయి.. విశ్వాసం పెరుగుతోంది. బ్రాండ్ ఏపీ మళ్లీ ముందుకెళ్తోంది' అని సీఎం చెప్పారు. భవన నిర్మాణ రంగంలో ఏపీ నూతన విధానం శెభాష్ అనేలా ఉంటుందని, ఏ ఇతర రాష్ట్రమైనా దాన్ని ఆదర్శంగా తీసుకొనేలా చేస్తామని చంద్రబాబు తెలిపారు. '2నెలల్లోనే భవన నిర్మాణాలకు ప్రత్యేక డ్యాష్‌బోర్డును తెస్తున్నాం. అందులో సంబంధిత అన్ని శాఖల సేవలు అందుబాటులో ఉంటాయి. ఎన్‌వోసీలు, ఇతర అనుమతుల కోసం వాటిచుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. బిల్డింగ్, లేఅవుట్ ప్లాన్లను ఏ శాఖ ఎన్ని రోజుల్లో క్లియరెన్స్ చేసిందో కూడా తెలియజేస్తాం. నిర్దిత వ్యవధిలో దరఖాస్తు క్లియర్ కాకపోతే ఆటోమేటిక్‌గా అనుమతులు వచ్చేలా చేసి జాప్యానికి బాధ్యులైన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకొంటాం' అని ప్రకటించారు.

### అవకాశాలను అందిపుచ్చుకుంటాం

అభివృద్ధికి దోహదం చేసే కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ఇక్కడ టీడీపీ, కేంద్రంలో ఎన్డీయే ముందుంటాయని చంద్రబాబు అన్నారు. 'పరిశ్రమలు, వ్యవసాయం, పర్యాటకం వృద్ధి కావాలి. అప్పుడే రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం అభివృద్ధి సాధిస్తుంది. రాష్ట్రంలో 35లక్షల మంది దీనిపై ఆధారపడి ఉన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇసుక లభించక నిర్మాణ రంగం కుదేలైంది. పనులు దొరక్క కార్మికులు రోడ్డెక్కారు. మేం అధికారంలోకి వస్తూనే ఉచిత ఇసుక విధానం తెచ్చి నిర్మాణ రంగానికి ఊతమిచ్చాం. ఇసుకను దబాయించి తీసుకొనే హక్కు కల్పించాం. ఈ విషయంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలకు తగిన ఆదేశాలు జారీచేసి అసాంఘిక శక్తులను కట్టడి చేసి సులభతరం చేశాం. ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలంటే నిర్మాణ రంగం నిరంతరం అభివృద్ధి చెందాలి. ఈ రంగానికి ప్రభుత్వం అండగా ఉంటుంది. సమస్యలను రియల్ టైంలో పారదర్శకంగా పరిష్కరిస్తాం' అని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.



గుంటూరులో నరెడ్కో ప్రాపర్టీ షోను ప్రారంభించి మాట్లాడుతున్న సీఎం

### భూకబ్జాలు చేసేవారిని వదిలిపెట్టం

'వైసీపీ హయాంలో రికార్డులు తారుమారు చేసి భూకబ్జాలను ప్రోత్సహించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తీసుకొచ్చి ఇష్టానుసారం చేశారు. మేం ఆ చట్టాన్ని రద్దు చేశాం. ఎప్పుడూ చూడని విధంగా భూ సమస్యలపై దరఖాస్తులు వస్తున్నాయి. వాటి పరిష్కారానికి ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ యాక్టు తీసుకొచ్చాం. ఇకపై భూకబ్జా చేస్తే ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదు. స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌ని రూపొందించాం. తలసరి ఆదాయం పెంచేందుకు ప్రణాళికలు రూపొందించాం. ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం. ఏపీని గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మార్చబోతున్నాం. ఎన్టీపీసీ, జెన్‌కో సహకారంతో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నాం. రిలయన్స్ సంస్థ బయో ఇంధనంతో ముందుకొచ్చింది. దాదాపుగా రూ.10 లక్షల కోట్ల విలువ చేసే ప్రాజెక్టులు త్వరలో రాబోతున్నాయి. భవిష్యత్తులో రాష్ట్రంలోని అనేక ప్రాంతాలు ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లుగా మారతాయి' అని చంద్రబాబు తెలిపారు. బిల్డర్లు ఎవరూ తప్పులు చేయొద్దని సీఎం హితవు పలికారు. 'అడ్డదారుల్లో పోవాలని చూడొద్దు. అక్రమ నిర్మాణాలు, లేఅవుట్ల విషయంలో బిల్డర్లు, రియల్టర్లు స్వీయ నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. ఇప్పుడు డ్రోన్ టెక్నాలజీ వచ్చింది. ఎవరైనా తప్పు చేస్తే ఇట్టే తెలిసిపోతుంది. టెక్నాలజీని అనుసంధానం చేసుకొని నూతన ఒరవడులకు శ్రీకారం చుట్టాలి. కృత్రిమ మేధస్సుని వినియోగించుకొని మరింతగా అభివృద్ధి చెందాలి' అని చంద్రబాబు ఆకాంక్షించారు.

# ప్రజలపై విద్యుత్ భారం ఉండదు

» 14,683 కోట్ల లోటును ప్రభుత్వమే భరిస్తుంది

» ఏపీఈఆర్‌సీ చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్ వెల్లడి



కర్నూలులోని ఏపీఈఆర్‌సీ భవన్‌లో చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్, సభ్యుడు పీవీఆర్ రెడ్డి

కర్నూలు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారం ఉండబోదని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్ స్పష్టం చేశారు. డిస్కంలు కూడా పెంపు ప్రతిపాదనలు చేయలేదన్నారు. ఆదాయ లోటు రూ.14,683 కోట్లను ప్రభుత్వమే సబ్సిడీగా భరిస్తుందని తెలిపారు. ఏపీఎస్‌పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ పంపిణీ సంస్థలు 2025-26కి సంబంధించి సమర్పించిన ఆదాయ వనరులు, ప్రతిపాదిత టారిఫ్‌లపై 7,8 తేదీల్లో విజయవాడలో బహిరంగ విచారణ జరిపిన కమిషన్.. శుక్రవారం కర్నూలులోని ఏపీఈఆర్‌సీ కార్యాలయంలో చివరిరోజు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. ఈ సందర్భంగా చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్ మాట్లాడుతూ.. 2025-26లో సుమారు రూ.14,683 కోట్లు లోటు ఉంటుందని, ఆ మొత్తాన్ని ప్రభుత్వమే సబ్సిడీగా భరిస్తుందని స్పష్టంచేశారు. మూడ్రోజుల ప్రజాభిప్రాయ సేకరణలో ఉదయం వ్యక్తిగతంగా అభ్యంతరాలు వినిపించేవారికి అవకాశం ఇచ్చామని.. ఆన్‌లైన్, వర్చువల్ విధానంలో పాల్గొన్నవారి నుంచి మధ్యాహ్నం అభిప్రాయాలు సేకరించామని తెలిపారు. 3రోజుల విచారణలో మొత్తం 94మంది పాల్గొన్నారని, వారినుంచి స్వీకరించిన అభ్యంతరాలు, సూచనలు, సలహాలపై డిస్కంలను వివరణ కోరామని.. వాటి వివరణపై ప్రజలు, నిపుణులు, ఇతరులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, ఆక్షేపణలను రికార్డు చేశామని.. వాటన్నింటినీ కమిషన్ పరిశీలించి.. 2025-26 రిటైల్ సప్లై టారిఫ్ ఆర్డర్‌ను ఖరారు చేస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు కమిషన్ సభ్యుడు పి.వెంకటరామరెడ్డి పాల్గొన్నారు.

### సాగుకు పగటిపూటే 9 గంటల ఉచిత కరెంటు!

» ఏపీఈఆర్‌సీకి ఇంధన శాఖ నివేదన

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి 9గంటల ఉచిత విద్యుత్‌ను పగటిపూటే అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ 'పీఎంకుసుమ్(ప్రధానమంత్రి కిసాన్ ఉర్జా సురక్ష-ఉత్థాన్ మహాభియాన్)' పథకం కింద రాష్ట్రంలో లక్ష వ్యవసాయ పంపుసెట్లకు సౌర విద్యుత్‌ను అందిస్తామని స్పష్టంచేసింది. మరో 4 లక్షల పంపుసెట్లకు ఈ స్కీంను విస్తరించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామని తెలిపింది. ఆమోదం వచ్చిన వెంటనే వాటికీ సౌర విద్యుత్ అందిస్తామని వెల్లడించింది. ఉచిత పథకాలకు సబ్సిడీ నిధులు సమకూరుస్తామని పేర్కొంది. శుక్రవారం కర్నూలులో ఏపీఈఆర్‌సీ ఇన్‌చార్జి చైర్మన్ ఠాకూర్ రామసింగ్, సభ్యుడు పి.వెంకటరామిరెడ్డితో కూడిన కమిషన్ ముందు రాష్ట్ర ఇంధన శాఖ సంయుక్త కార్యదర్శి కుమార్‌రెడ్డి ఓ ప్రకటన చేశారు. 2024 నాటికి విద్యుత్‌రంగంలో రూ.71,762 కోట్ల పైబడి అప్పులు ఉన్నాయని.. రూ.29,377 కోట్ల నష్టాలున్నాయని తెలిపారు. ప్రభుత్వం గృహ, పరిశ్రమలు, ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు, రైతులకు అందిస్తున్న విద్యుత్‌కు సబ్సిడీ నిధులు ఇస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి దోహదపడేలా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటించారు. గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు రోజంతా సరసమైన ధరలకు కరెంటు అందిస్తామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా.. ఆక్వా, ఎస్సీ, ఎస్టీ కాలనీలు, వివిధ రంగాలకు సబ్సిడీపై విద్యుత్ ఇవ్వడానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. 'గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధిని పెంచేందుకు.. రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్‌డీఎస్‌ఎస్) కింద ప్రీపెయిడ్ మీటర్లను బిగిస్తాం. కేంద్రం ప్రకటించిన ఈ స్కీం వల్ల రూ.13,405 కోట్ల మేర నిధులు సమకూరుతాయి. ఇందులో రూ.6,192 కోట్లు కేంద్రం నుంచి గ్రాంటుగా వస్తాయి. గృహ వినియోగదారులకూ స్మార్ట్ మీటర్లు బిగిస్తాం. మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. ఇలాంటి చర్యలతో నష్టాలను గణనీయంగా తగ్గించుకుంటాం. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు నెలకు 200 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్ సరఫరాకు కట్టుబడి ఉన్నాం. వారికి 2కిలోవాట్ల దాకా ఉచితంగా రూఫ్‌టాప్ సౌర విద్యుత్ ఫలకాలు అమరుస్తాం. ఒక్కో సోలార్ ప్యానెల్‌పై 60శాతం సబ్సిడీ అందిస్తాం. 25,054 గిరిజన గృహాలకు విద్యుత్ సర్వీసుల కోసం రూ.127కోట్లు మంజూరు చేస్తున్నాం. పారదర్శక విధానంలో విద్యుత్ కొనుగోళ్లు చేపట్టి భారాన్ని తగ్గిస్తాం. విద్యుత్ నష్టాలను తగ్గించడానికి ఆధునీకరణ చర్యలు చేపడతాం' అని ఇంధన శాఖ వివరించింది. వినియోగదారుల సంక్షేమమే లక్ష్యంగా, మెరుగైన సేవలు అందించడానికి సాంకేతిక, వాణిజ్య నష్టాలు తగ్గించే చర్యలు చేపడతామని ప్రకటనలో పేర్కొంది.



నైపుణ్య గణన చేపట్టేందుకు మంత్రి లోకేశ్ సమక్షంలో ఇన్ఫోసిస్ సంస్థతో ఒప్పందం చేసుకుంటున్న అధికారులు

# బతిమలాడి రప్పిస్తున్నాం

» మళ్లీ జగన్ రాడనే గ్యారెంటీని పారిశ్రామికవేత్తలు అడుగుతున్నారు

» మంత్రివర్గ ఉపసంఘం భేటీలో లోకేశ్

అమరావతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): 'రాబోయే ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాల కల్పన ప్రభుత్వ లక్ష్యం. అందుకు అనుగుణంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి' అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్‌కమిటీ మొదటి సమావేశం ఆయన అధ్యక్షతన శుక్రవారం ఉండవల్లిలోని సీఎం నివాసంలో జరిగింది. పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్, చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ... 'గత ఐదేళ్లలో చెప్పుకోదగ్గ స్థాయిలో పెట్టుబడులు రాలేదు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు మనకంటే ముందున్నాయి. పెట్టుబడులు సాధించడం అంత ఈజీ కాదు. మళ్లీ జగన్ అధికారంలోకి రాడనే గ్యారెంటీని పారిశ్రామిక వేత్తలు అడుగుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పీపీఏలను రద్దు చేశారు. అనేక పరిశ్రమలను పొరుగు రాష్ట్రాలకు తరిమేశారు. వారిని బతిమలాడి తిరిగి రాష్ట్రానికి తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెట్టుబడిదారులకు అనుమతులు, భూకేటాయింపులు త్వరగా మంజూరయ్యేలా చూడాలి. కూటమి పాలనలో మళ్లీ మంచి రోజులు వచ్చాయి. పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు. ఇక్కడకు రావాల్సిన పెట్టుబడి ఒక్కటి కూడా ఇతర రాష్ట్రాలకు వెళ్లడానికి వీల్లేదు' అని పేర్కొన్నారు.

### నైపుణ్య గణనకు ఇన్ఫోసిస్‌తో ఒప్పందం: లోకేశ్

నైపుణ్య గణనలో సాంకేతిక సహకారం అందించేందుకు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఇన్ఫోసిస్‌తో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒప్పందం చేసుకుంది. మంత్రి లోకేశ్ సమక్షంలో శుక్రవారం ఉండవల్లిలోని సీఎం నివాసంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 'కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద నైపుణ్య గణనకు సహకారం అందించేందుకు ఇన్ఫోసిస్ ముందుకు రావడం అభినందనీయం. 3.59 కోట్ల మందిలో ఉన్న నైపుణ్యాలపై ఇన్ఫోసిస్ ప్రీవాలిడేషన్ చేస్తుంది' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్ఫోసిస్ ప్రతినిధులు సంతోశ్, తిరుమల, రాష్ట్ర ఉన్నతాధికారులు కోన శశిధర్, గణేశ్ కుమార్, దినేశ్ కుమార్ పాల్గొన్నారు.

### త్వరలో రాష్ట్రవ్యాప్తంగా నైపుణ్య గణన

త్వరలో రాష్ట్రవ్యాప్త నైపుణ్య గణనకు శ్రీకారం చుడతామని మంత్రి లోకేశ్ వెల్లడించారు. నైపుణ్య గణన విధివిధానాలపై శుక్రవారం ఉండవల్లిలోని నివాసంలో అధికారులతో సమీక్షించారు. మంగళగిరిలో చేసిన పైలెట్ ప్రాజెక్టు అనుభవనాలను పరిగణలోకి తీసుకుని, మరింత సులభతరంగా నైపుణ్య గణన చేయాలన్నారు. ఈ గణనలో సేకరించే డేటా యువతకు జీవితకాలం ఉపయోగపడాలన్నారు. వ్యవస్థీకృత రంగాలతో పాటు అసంఘటిత రంగాల్లో ఉన్నవారి నైపుణ్యాలను సేకరించాలని స్పష్టం చేశారు. నైపుణ్యం కలిగిన వారికి టీడీపీ కేంద్ర కార్యాలయంలో సొంత నిధులతో శిక్షణ ఇస్తున్నారని, దానిని నమూనాగా తీసుకుని విదేశాల్లో ఉద్యోగాలు సాధించేలా యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్నారు. దీనివల్ల 2 లక్షల మందికి విదేశాల్లో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కాలేజీ విద్యార్థులకు జర్మన్, జపనీస్ భాషలు కూడా నేర్పించాలన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే నైపుణ్య గణన లక్ష్యమని లోకేశ్ చెప్పారు.

# మున్సిపల్స్‌కే అనుమతుల అధికారం

## ఆర్డినెన్స్‌లు జారీ చేస్తూ ఉత్తర్వులు విడుదల

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణాలకు, లేఅవుట్లకు అనుమతి కోసం ప్రస్తుతమున్న విధానంతో విసిగిపోతున్న రియల్ వ్యాపారస్తులు, నిర్మాణ రంగ పెట్టుబడిదారులు కొత్త పాలసీ కోసం ఎదురుచూస్తున్నారు. దానికి అనుగుణంగా పట్టణ స్థానిక సంస్థలకు మాత్రమే భవన నిర్మాణ, లేఅవుట్ల అనుమతులిచ్చే అధికారం కల్పించి, పట్టణాభివృద్ధి అథారిటీలకు ప్రాజెక్టుల అభివృద్ధి బాధ్యతలు కల్పించాలని ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చింది. దీనికి అనుగుణంగా గతంలో ఉన్న ఏపీ భవన నిర్మాణ నిబంధనలు-2017, ఏపీ ల్యాండ్ డెవలప్‌మెంట్ రూల్స్-2017ను సవరిస్తూ గెజిట్‌లను జారీ చేస్తున్నట్లు పేర్కొంటూ శుక్రవారం జీవోలు జారీ చేశారు. దానికి సంబంధించి యాప్ రూపొందించాలని నిర్ణయించారు. దీంతో భవన నిర్మాణాలు ఊపందుకుంటాయని, రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటుందని భావిస్తున్నారు.

### పట్టణ ప్రజలకు ఊరట కలిగించేందుకు...

పట్టణాభివృద్ధి అథారిటీలకు భవనాల నిర్మాణాలు, లేఅవుట్ల అనుమతులిచ్చే అధికారం తొలగించి మున్సిపాలిటీలకు అప్పగించాలని నిర్ణయించడంతో రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు విశాఖపట్నం, విజయవాడ నగరపాలక సంస్థల్లో మినహా మిగిలిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో భవన నిర్మాణాలు, లేఅవుట్లకు అనుమతులివ్వడంలో కొన్ని పరిమితులున్నాయి. భారీ భవంతులు, భారీ విస్తీర్ణంలోని లేఅవుట్ల అనుమతుల కోసం దరఖాస్తులను పట్టణ స్థానికసంస్థల ద్వారా పట్టణాభివృద్ధి సంస్థలకు పంపుతున్నారు. వాటికి అనుమతి లభించడంలో జాప్యం జరగడంతో పాటు, పట్టణ స్థానికసంస్థల్లోను, ఇటు పట్టణాభివద్ధి అథారిటీల్లోనూ రెండింటా అక్రమ వసూళ్లతో దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ ప్రజలకు రెండు చోట్ల అనుమతులు పొందడంలో ఇబ్బంది కలగడంతో పాటు రెండు చోట్ల వ్యయం కూడా ఎక్కువగా ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని సరళతరం చేయాలని నిర్ణయించింది. మున్సిపల్ శాఖ సిఫారసులతో గత కేబినెట్‌లో దీనిపై చట్టం తెచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ నెల 2న జరిగిన కేబినెట్ సమావేశంలో దానికి సంబంధించి ఆర్డినెన్స్ తెచ్చేందుకు ఆమోదించారు. శుక్రవారం ఆర్డినెన్స్ విడుదల చేశారు.

### వైసీపీ కాలంలో అథారిటీలతో దోపిడీ

వైసీపీ హయాంలో ఎక్కువ పట్టణాభివృద్ధి అథారిటీలు ఏర్పాటు చేశారు. గతంలో పట్టణాభివృద్ధి అథారిటీలకు విశేష అధికారాలను తెచ్చుకుని మన రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, అథారిటీ చైర్మన్లు ప్రజల నుంచి భారీగా వసూళ్లు చేపట్టారు. వైసీపీ కార్యకర్తలు, కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, మంత్రులు అప్పట్లో భవన నిర్మాణాల అనుమతులు, టీడీఆర్ బాండ్ల విడుదలలో కీలకపాత్ర పోషించేవారు. భారీగా సొమ్ము చేసుకున్నారు.

# 'రియల్' బూమ్ కోసం సడలింపులు

» ఎన్‌బీసీకి అనుగుణంగా విధానాలు: మంత్రి నారాయణ

గుంటూరు, అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భవన నిర్మాణం, రియల్ ఎస్టేట్ రంగాలు ఊపందుకొనేలా అనుమతుల్లో అనేక సడలింపులు తీసుకొచ్చామని మునిసిపల్ మంత్రి నారాయణ అన్నారు. శుక్రవారం గుంటూరులో ప్రారంభమైన నరెడ్కో ప్రాపర్టీ షోలో సడలింపులను వివరించారు. 'గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రియల్ ఎస్టేట్ రంగం నాశనం అయింది. రియల్ ఎస్టేట్ పటిష్ఠంగా అభివృద్ధి చెందాలని సీఎం నాకు చెప్పారు. బిల్డర్లు, రియాల్టర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నేషనల్ బిల్డింగ్ కోడ్, కేంద్ర ప్రభుత్వ మోడల్ బిల్డింగ్ బైలాస్‌కు అనుగుణంగా ఉత్తమ విధానాల అమలు చేస్తాం' అని అన్నారు.

- గేటెడ్ కమ్యూనిటీలకి సంబంధించి విధివిధానాలు సరిగా లేవని బిల్డర్లు చెప్పారు. దానికి సంబంధించి గ్రూప్ డెవలప్‌మెంట్ స్కీమ్‌కి ఏవైతే విధానాలు ఉన్నాయో వాటినే అమలు చేస్తాం.
- రైల్వే, రక్షణ శాఖ నుంచి ఎన్‌వోసీ తెచ్చుకోనిదే బిల్డింగ్ ప్లాన్ ఇవ్వరు. దానికి కూడా మార్పులు చేశాం. వాళ్ల నిబంధనలకు అనుగుణంగా బిల్డింగ్ ప్లాన్ పెడితే మునిసిపల్ శాఖ అనుమతులు ఇస్తుంది. ఎలాంటి ఎన్‌వోసీలు తెచ్చుకోవాల్సిన పని లేదు.
- అదే విధంగా 500 మీటర్ల పైన ఉన్న రెసిడెన్షియల్ బిల్డింగ్స్‌కు సెల్లార్ పర్మిషన్ ఇస్తాం.
- 55 నుంచి 75 మీటర్ల వరకు అయితే 17 మీటర్ల సెట్ బ్యాక్, 75 నుంచి 120 మీటర్ల లోపు అయితే 18 మీటర్లు, 120 మీటర్లు దాటితే 20 మీటర్ల సెట్ బ్యాక్ ఉండాలి.
- 10 అంతస్తులు దాటిన భవనాలకు ఒక ఫ్లోర్ ఎక్స్‌ట్రాగా ఇస్తున్నాం. దానిని గార్డెన్, గ్రీనరీ, స్పాకి వినియోగించుకోవచ్చు.
- రోడ్ల విస్తరణలో టీడీఆర్ బాండ్ లేకుండానే ఎంత స్థలం అయితే పోతుందో దానికి సమానంగా అంతస్తు నిర్మించుకోవచ్చు.
- 4 వేల చదరపు మీటర్ల కలిగిన గ్రూపు డెవలప్‌మెంట్ చేసేటప్పుడు 10 శాతం ఓపెన్ స్పేస్ వదలాలి. దీనికి అదనంగా స్విమ్మింగ్ పూల్‌కి స్థలం చూపించాలి. అయితే ఓపెన్ స్పేస్ 10 శాతంలో.. 15 శాతం లోపల స్విమ్మింగ్ పూల్ కట్టుకోవచ్చు.
- పౌల్ట్రీ ఫాంలు అగ్రికల్చర్ జోన్‌లో ఎక్కడైనా పెట్టుకోవచ్చు.
- టీడీఆర్ బాండ్లను ఖరారు చేయడానికి కొత్త జీవోలో మునిసిపల్ కమిషనర్, ఆర్‌డీడీ టౌన్‌ప్లానింగ్, యూఎల్‌బీలో రెవెన్యూ అధికారిని చేర్చాం. ఇక బాండ్ల ప్రక్రియ సులభతరం అయింది.
- 5 అంతస్తుల లోపల బిల్డింగ్స్‌కి సెల్ఫ్ డిక్లరేషన్‌తో పర్మిషన్లు.


తిరుమల శ్రీవారి ఆలయం ముందు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన బాధితులు

## స్విమ్స్ నుంచి 32 మంది డిశ్చార్జి

- వీఐపీ బ్రేక్‌లో వైకుంఠద్వార దర్శనం
- స్వస్థలాలకు తరలించడానికి ఏర్పాట్లు
- ఆస్పత్రిలో మరో ఐదుగురికి చికిత్స

తిరుపతి(వైద్యం)/తిరుమల, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో గాయపడి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న 37 మందిలో పూర్తిగా కోలుకున్న 32 మందిని శుక్రవారం డిశ్చార్జి చేశారు. వీరందరినీ తిరుమలకు పంపి శ్రీవారి దర్శనం కల్పించి, ప్రత్యేక వాహనాల్లో స్వస్థలాలకు తరలించేందుకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఏర్పాట్లు చేశారు. వైజాగ్‌కు చెందిన దంపతులు నాగరాజు(46), ఈశ్వరమ్మ(36), అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం నరసాపురానికి చెందిన సిద్ధఫుగారి నరసమ్మ(35), తిమ్మక్క(40), రెడ్డెమ్మ(32) ఇంకా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ముగ్గురి కుటుంబానికే చెందిన రఘు, గణేష్, వెంకటేశ్, నందీశ్, చిన్నపయ్యకు స్వల్పగాయాలయ్యాయి. తమవారికి తోడుగా వీరూ ఆస్పత్రిలోనే ఉన్నారు. చికిత్స పొందుతున్న ఐదుగురి పరిస్థితి మెరుగ్గానే ఉందని, ఒకట్రెండు రోజుల్లో వీరినీ డిశ్చార్జి చేసి, శ్రీవారి దర్శన భాగ్యం కల్పించి స్వగ్రామాలకు పంపిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయాన్ని కూడా అందరికీ అందిస్తామని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ మౌర్య, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ పాల్గొన్నారు. కాగా, వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సందర్భంగా బుధవారం రాత్రి తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో గాయపడిన వారికి టీటీడీ శుక్రవారం వీఐపీ బ్రేక్ కోటాలో వైకుంఠద్వార దర్శనం కల్పించింది. స్విమ్స్ నుంచి డిశ్చార్జి అయిన 32మందితో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా కలిపి మొత్తం 52 మందికి వేకువజామున వీఐపీలతో పాటే దర్శనం చేయించారు. అనంతరం క్షతగాత్రులు ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఏదో పొరపాటున తొక్కిసలాట జరిగిందని, దానికి ఎవరూ బాధ్యులు కాదని తెలిపారు. సీఎం చంద్రబాబు సకాలంలో స్పందించి జాగ్రత్తగా చూసుకోమని చెప్పడంతో పాటు మంచి దర్శనం కల్పించారని సంతృప్తి వ్యక్తం చేశారు. స్వామి వారి ఆశీస్సులతో బతికి బయటపడ్డామని, తమను బాగా చూసుకున్న సీఎం, డిప్యూటీ సీఎం, టీటీడీ బోర్డు, అధికారులందరికి ధన్యవాదాలు తెలిపారు. కంటికి రెప్పలా చూసుకుని తిరిగి ఇంటికి పంపుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. వీరందరినీ ఆస్పత్రి నుంచే అధికారులు ప్రత్యేక వాహనాల్లో తిరుమలకు తీసుకొచ్చారు.

## టీటీడీని లూటీ చేసినప్పుడు గుర్తు రాలేదా?

- నాడు జగన్ ఒక్క బాధితుడినైనా పరామర్శించారా?
- వైసీపీ నేతలపై టీడీపీ ధ్వజం

అమరావతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇప్పుడు పెడబొబ్బలు పెడుతున్న వైసీపీ నేతలకు తాము అధికారాన్ని అడ్డు పెట్టుకొని టీటీడీని లూటీ చేసినప్పుడు స్వామివారు గుర్తుకు రాలేదా అని తెలుగుదేశం పార్టీ ప్రశ్నించింది. శుక్రవారం ఇక్కడ ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ విలేకరులతో మాట్లాడారు. 'వైసీపీ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో తిరుమల ఆలయాన్ని ఏటీఎం మిషన్ మాదిరిగా వాడుకున్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా రాష్ట్రంలో అనేక దుస్సంఘటనలు జరిగినా ఏనాడూ ఇంటి నుంచి కదలలేదని.. ఒక్క బాధితుడిని కూడా పరామర్శించలేదు" అని విమర్శించారు.

## జగన్‌వి శవ రాజకీయాలు: మంత్రి సవిత

- వైసీపీ ఉనికిని కాపాడుకోవడానికే ఆరోపణలని వ్యాఖ్య

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారని మంత్రి సవిత అన్నారు. 'తిరుపతిలో భక్తుల రద్దీ వల్ల దురదృష్టకర సంఘటన జరిగింది, కానీ ఆ ఘటనను కూడా జగన్ అండ్‌కో రాజకీయాలకు ఆపాదించడం సిగ్గుచేటు. గతంలో అన్నమయ్య జిల్లాలో వరదలు వచ్చినప్పుడు ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయి 32 మంది మరణిస్తే.. కనీసం బాధిత కుటుంబాలను కూడా పరామర్శించని జగన్ ఇప్పుడు ఎందుకు మాట్లాడుతున్నారు' అని ప్రశినంచారు.

## ప్రభుత్వ వైఫల్యంతోనే తొక్కిసలాట : బొత్స

విశాఖపట్నం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే తిరుపతిలో తొక్కిసలాట చోటుచేసుకుందని శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. 'ప్రభుత్వ నిర్లక్ష్యం, అసమర్థత వల్ల ఆరు నిండు ప్రాణాలు బలయ్యాయి. ఈ ఘటనకు బాధ్యుడిని చేస్తూ ఒక ప్రాంతంలో ఉన్న డీఎస్పీని సస్పెండ్ చేశారు. మిగిలినచోట్ల ఉన్న అధికారుల సంగతి ఏమిటి? ఈ ఘటనకు సంబంధించి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్షమాపణలతో సరిపెట్టారు. క్షమాపణ ఒక్కటేనా? దీక్ష ఏమైనా చేస్తారా? తొక్కిసలాట నెపాన్ని వైసీపీపైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారు. క్షతగాత్రులను పరామర్శించేందుకు వెళ్లిన జగన్‌ను అడ్డుకోవడం సరికాదు. తొక్కిసలాట ఘటనను హైకోర్టు సుమోటోగా తీసుకుని సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి.' అని బొత్స అన్నారు.

## తిరుపతిలో తొక్కిసలాటపై హైకోర్టులో పిల్

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో తొక్కిసలాటపై హైకోర్టు సిట్టింగ్ లేదా విశ్రాంత జడ్జితో జ్యుడీషియల్ విచారణకు ఆదేశించాలని కోరుతూ కర్నూలు జిల్లాకు చెందిన గుడిబండ ప్రభాకర్‌రెడ్డి హైకోర్టులో శుక్రవారం ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. అత్యవసరంగా పిల్‌ను విచారణ జరపాలని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ నేతృత్వంలోని ధర్మాసనాన్ని పిటిషనర్ తరఫున న్యాయవాది శివప్రసాద్‌రెడ్డి అభ్యర్థించారు. అయితే, సంక్రాంతి వెకేషన్ బెంచ్ ముందు లిస్ట్ చేసేందుకు కోర్టు అనుమతించింది.

## అమిత్ షాను బర్తరఫ్ చేయాలి : పీసీసీ చీఫ్ షర్మిల

- విశాఖలో గాంధీ విగ్రహం వద్ద మౌన దీక్ష

విశాఖపట్నం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. పార్టీ నాయకత్వం పిలుపు మేరకు ఆమె శుక్రవారం ఉదయం విశాఖలో 'జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమం నిర్వహించారు. తొలుత నగర పార్టీ కార్యాలయంలో షర్మిల మీడియాతో మాట్లాడారు. పార్లమెంటులో అంబేడ్కర్ గురించి అమిత్ షా హేళనగా మాట్లాడారన్నారు.


విశాఖలో జీవీఎంసీ ఎదుట గాంధీ విగ్రహం వద్ద వైఎస్ షర్మిల మౌనదీక్ష

అంటరానితనాన్ని నిర్మూలించేందుకు అంబేడ్కర్ తన జీవితకాలం పోరాటం సాగించారని, అటువంటి మహనీయుడిని హేళన చేసిన విషయాన్ని దేశమంతా గమనిస్తోందన్నారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి, ఎంపీ మాణిక్కం ఠాగూర్ మాట్లాడుతూ అంబేద్కర్‌పై ఇష్టం వచ్చినట్టు మాట్లాడిన అమిత్ షా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ సీనియర్, పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడారు. అనంతరం పలువురు మహిళలు, వృద్ధులకు షర్మిల దుప్పట్లు పంపిణీ చేశారు. అంతకుముందు 'జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమ పోస్టరును విడుదల చేశారు. అనంతరం, జీవీఎంసీ కార్యాలయం ఎదురుగాగల గాంధీ విగ్రహం వద్ద షర్మిల 40నిమిషాలపాటు మౌన దీక్ష చేపట్టారు.

# ఆగని రచ్చ!

(మొదటి పేజీ తరువాయి)

బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. దీంతో... శుక్రవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన శుక్రవారం తిరుమలలో పాలక మండలి భేటీ అయ్యింది. ఇతర రాష్ట్రాలకు చెందిన ఇద్దరు ముగ్గురు సభ్యులు మినహా మిగిలిన సభ్యులు... ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఇతర అధికారులు ఈ భేటీకి హాజరయ్యారు. సీఎం ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ భేటీ కూడా 'అధికారులు వర్సెస్ పాలకమండలి'గా మారింది. సమావేశ ప్రారంభంలోనే చైర్మన్ నాయుడు టీటీడీ అధికారుల తీరుపై తన అసంతృప్తి వ్యక్తం చేశారు. 'అధికారులు తమ ఇష్టానుసారం పనిచేస్తున్నారు. పాలక మండలి చైర్మన్‌కు గానీ, సభ్యులకుగానీ ఏ సమాచారం ఇవ్వడం లేదు. కలుపుకొని పోవడం లేదు. తిరుపతిలో కేవలం రెండు మూడు వేల మందిని ఒక పద్ధతి ప్రకారం నిలబెట్టి టోకెన్లు ఇవ్వలేకపోయాం. ఇంతకంటే ఎక్కువమంది జనం హాజరైన కార్యక్రమాలను నిర్వహించిన అనుభవం ఉన్నవాళ్లమే. కానీ, ఆ అనుభవాన్ని ఉపయోగించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు మారాలి" అని బీఆర్ నాయుడు అన్నారు. ఆ తర్వాత వరుసగా పాలక మండలి సభ్యులు భాను ప్రకాశ్ రెడ్డి, పనబాక లక్ష్మి, జ్యోతుల నెహ్రూ, ఎంఎస్ రాజు, ఆనంద సాయి, మహేందర్ రెడ్డి తదితరులు కూడా ఈవో వ్యవహార శైలిపై ధ్వజమెత్తారు. 'జరిగిన సంఘటనలో మన పొరపాట్లు ఉన్నాయి. ఆత్మ విమర్శ చేసుకోకపోతే ఇవి ఇంకా కొనసాగుతాయి. ఎక్కడ పొరపాటు జరిగిందో చర్చించి... ఎవరి వల్ల అవి జరిగాయో నిర్దిష్టంగా తేల్చితే అవి ఆగుతాయి' అని భాను ప్రకాశ్ రెడ్డి అన్నారు. అయితే... అవన్నీ ఇప్పుడు వద్దని, తర్వాత మాట్లాడుకొందామని ఈవో అన్నారు. 'ఫర్వాలేదు. మాట్లాడనివ్వండి' అని చైర్మన్ చెప్పారు. 'ఎందుకు మాట్లాడ కూడదు?' అని భాను ప్రకాశ్ కూడా స్వరం రెట్టించారు. జరిగిన విషాదంపై కనీసం ఇంట్లో భార్యాబిడ్డలకు కూడా సమాధానం చెప్పుకోలేకపోతున్నామన్నారు. 'తమాషాలు చేస్తున్నారు' అని అధికారులను ఉద్దేశించి వ్యాఖ్యానించినప్పుడు ఈవో దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అటువంటి మాటలు మాట్లాడవద్దని గట్టిగా చెప్పారు. తొక్కిసలాటలో చనిపోయిన ఒక మహిళకు ఉన్న ఇద్దరు పిల్లల చదువు బాధ్యతను టీటీడీ తీసుకుంటుందని ప్రకటిద్దామని భాను ప్రకాశ్ రెడ్డి ప్రతిపాదించినప్పుడు... ఈ ప్రకటనలు ఇప్పుడు వద్దని, అన్నీ చూసి తర్వాత చెబుదామని ఈవో అన్నారు. దీనిపైనా కొంత వాదోపవాదాలు జరిగాయి.


మీడియాతో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు. చిత్రంలో బోర్డు సభ్యులు, అధికారులు

### ఎంఎస్ రాజు ధ్వజం..

అధికారులు తీసుకునే తప్పుడు నిర్ణయాలకు తాము రాజకీయంగా మూల్యం చెల్లించాల్సి వస్తుందని బోర్డు సభ్యుడు, టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. అధికారులు ఎక్కడైనా ఉద్యోగాలు చేసుకుంటారని... ప్రజా క్షేత్రంలో తాము సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందని గుర్తుంచుకోవాలని సూచించారు. "పాలక మండలి సభ్యులకు అధికారులు కనీస గౌరవం ఇవ్వడం లేదు. మమ్మల్ని తిరుమలలో గదులు అమ్ముకొనే వారిని చూసినట్లు చూస్తున్నారు. మా ఫోన్లు తీయరు. ఏం జరుగుతోందో... ఏ నిర్ణయాలు తీసుకున్నారో మాకు చెప్పరు. పాలక మండలి ఎందుకు ఉందో మాకు అర్థం కావడం లేదు" అని ఆయన ధ్వజమెత్తారు. వైకుంఠ ఏకాదశికి భక్తులు భారీగా వస్తారని అందరికీ తెలిసిందేనని... ఈ విషయంలో అధికారుల ప్రణాళిక ఏవిటో, దీనిని ఏ రకంగా నిర్వహించదల్చుకున్నారో తమకు సమాచారం లేదని ఒక సభ్యుడు చెప్పారు. పాలక మండలిని కలుపుకొని పనిచేయడానికి అధికారులు కనీస శ్రద్ధ చూపించలేదని, అధికారం మొత్తం తమ గుప్పిట్లో ఉందని ప్రదర్శించుకొనే తత్వమే వారిలో కనిపిస్తోందని మరో సభ్యుడు ఆరోపించారు. అధికారులు పనిచేయడానికి పాలక మండలి అడ్డంగా ఉందని భావిస్తే ప్రభుత్వానికి చెప్పి తమను తొలగించినా తాము బాధపడబోమని, ఉన్నప్పుడు మాత్రం కలుపుకొని వెళ్లాలని మరో సభ్యుడు వ్యాఖ్యానించారు. పాలక మండలి సభ్యుల విమర్శలను ఈవో సహా అధికారులంతా మౌనంగా విన్నారు. అవసరం అయిన చోట మాత్రమే తమ అభిప్రాయం చెప్పారు. ప్రస్తుత పాలక మండలి ఏర్పాటైన తర్వాత అధికారుల వ్యవహార శైలిపై ఇంత స్థాయిలో చర్చ జరగడం ఇదే మొదటిసారి అని అంటున్నారు.

# మొదలైన పోలీస్ విచారణ

- తిరుపతికి ప్రత్యేక దర్యాప్తు బృందం
- సంఘటనా స్థలాల పరిశీలన
- పోలీసు అధికారులతో సమావేశం
- తొక్కిసలాటపై వివరాలు ఆరా
- పునరావృతం కాకుండా చర్యలు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 10(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనపై పోలీసు విచారణ మొదలైంది. ఒకవైపు డీఐజీ శెముషీ బాజ్‌పాయ్ ఆధ్వర్యంలో విచారణ జరుగుతుండగానే.. మరోవైపు విశాఖ డీఐజీ గోపీనాథ్ జెట్టి, టీటీడీ మాజీ సీవీఎస్‌వో, తూర్పు గోదావరి ఎస్పీ నరసింహకిషోర్‌ను దర్యాప్తు అధికారులుగా నియమించారు. వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ కేంద్రాల వద్ద సమన్వయ లోపం ఎక్కడ జరిగింది? అధికారుల నిర్లక్ష్యం ఎంతనే దానిపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేయనున్నారు. శుక్రవారం వారు తిరుపతికి చేరుకున్నారు. టోకెన్ల జారీ కేంద్రాల వద్ద ఎక్కడెక్కడ ఎవరెవరు ఇన్‌చార్జులుగా ఉన్నారు? వారిలో పోలీసు, టీటీడీ అధికారులు ఎవరనే వివరాలు తీసుకున్నారు. అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో అత్యవసరంగా సమావేశమైనట్లు తెలిసింది. తొక్కిసలాట ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించినట్లు సమాచారం. సాయంత్రం పోలీసు అధికారులతో కలసి టోకెన్ల జారీ కేంద్రాలను పరిశీలించారు. ఎక్కడెక్కడ ఎలాంటి సౌకర్యాలు కల్పించారు? భక్తులు అధిక సంఖ్యలో వస్తే ముందస్తుగా ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అందుకు చేపట్టాల్సిన జాగ్రత్తలు, పోలీసు బందోబస్తు, టీటీడీ తీసుకోవాల్సిన చర్యలు, మౌలిక వసతులు వంటి విషయాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. బైరాగిపట్టెడ, విష్ణునివాసం వద్ద ఘటనలు జరిగిన తీరు, చోటు చేసుకున్న పరిణామాలపై ఆరా తీశారు. ఈ ఘటనకు టీటీడీ ఎంత వరకు బాధ్యత వహించిందనే కోణంలోనూ పరిశీలిస్తున్నారు. వారి వెంట అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, వెంకట్రావు, డీఎస్పీ వెంకటనారాయణ, సీఐలు రామకృష్ణ, రాంకిషోర్, ఎస్‌ఐలు ఉన్నారు. పొరపాటు ఎక్కడ జరిగిందనేది తెలుసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టేందుకు ఈ విచారణ జరుపుతున్నట్లు తెలిసింది.


తిరుపతి విష్ణునివాసం వద్ద పోలీసులు అధికారులు

# కుప్పం బందోబస్తుతో సంబంధం లేదు

- తిరుపతిలో టోకెన్ల జారీ కేంద్రాల వద్ద 1500 మంది పోలీసులను నియమించాం
- బందోబస్తు లేదనేది అవాస్తవం: డీఐజీ శెముషీ



తిరుపతి(నేరవిభాగం), జనవరి 10(ఆంధ్రజ్యోతి): కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటనకు ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తుకు, తిరుపతిలో వైకుంఠ ఏకాదశి కౌంటర్ల వద్ద భద్రతకు సంబంధం లేదని అనంతపురం రేంజ్ డీఐజీ శెముషీ బాజ్‌పాయ్ స్పష్టం చేశారు. తిరుపతిలోని ఎనిమిది కౌంటర్ల వద్ద దాదాపు 1500 మంది పోలీసులను నియమించామని చెప్పారు. తిరుమలలో ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడారు. సీఎం పర్యటనకు అధిక సంఖ్యలో పోలీసులను పంపి, తిరుపతిలో అవసరమైన బందోబస్తు లేకపోవడం వల్లే ఘటన చోటు చేసుకుందని వస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్నారు. తిరుపతిలో బుధవారం రాత్రి రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఘటనలకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర దర్యాప్తు చేస్తున్నామన్నారు. వైకుంఠ ఏకాదశి టోకెన్లు జారీ చేస్తున్న కేంద్రాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకున్న తర్వాత గేట్లు తెరిచారా? లేదా నిర్లక్ష్యంతో గేట్లు తీసి భక్తులను ఒక్కసారిగా వదిలారా? అనేది విచారిస్తున్నామన్నారు. విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా, తగిన జాగ్రత్తలు తీసుకునేలా ఆ ఘటనకు సంబంధించి అన్ని వర్గాల నుంచీ ఆధారాలు, సమగ్ర సమాచారం సేకరిస్తున్నామని తెలిపారు. అలాగే సాంకేతిక పరమైన సాక్ష్యాలైన సీసీ కెమెరాల ఫుటేజీలు, మొబైల్ వీడియోలు, ఫొటోలు, ఇతర వివరాలనూ సేకరిస్తున్నామన్నారు. వీటి ఆధారంగా సంఘటన ఎలా జరిగిందనేది విశ్లేషిస్తామని డీఐజీ వివరించారు. ప్రజలు, వివిధ వర్గాల వారు ఈ సంఘటనకు సంబంధించి తమ వద్ద ఏవైనా వీడియోలు, ఫొటోలు, ఇతర ఆధారాలుంటే దర్యాప్తు అధికారులకు ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు. తిరుమలలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా సమగ్ర ప్రణాళికతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. తిరుమల, తిరుపతి ఆలయాల్లో ఏకాదశి బందోబస్తు కోసం దాదాపు 2,424 మందిని నియమించామన్నారు. తిరుపతిలోని బైరాగిపట్టెడ వద్ద జరిగిన ఘటనలో భక్తులు మృతిచెందడం చాలా బాధాకరమన్నారు. ఈ కేంద్రం వద్ద ఒక్కసారిగా ఊహించని విధంగా భక్తుల రద్దీ పెరగడంతో ఈ సంఘటన జరిగిందన్నారు. అక్కడ విధుల్లో ఉన్న వారు సరైన నిర్ణయం తీసుకోవడంలో విఫలం కావడం వల్లే సంఘటన జరిగినట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. టోకెన్లు జారీ క్యూలైన్‌లో జరిగిన విషాదకర ఘటనకు బాధ్యులు ఎవరనేది విచారణలో తేలుతుందని, వారిపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## డబ్బులిచ్చి చంద్రబాబును తిట్టించారు

**జగన్ మనిషి ఆసుపత్రిలో 18 మందికి డబ్బులు పెట్టిన తెల్ల కవర్లు పంచారు**

- ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో ఉన్నాయి
- ఇంత నీచానికి దిగజారడానికి సిగ్గులేదా?: మంత్రి ఆనం



నెల్లూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి దుర్ఘటన బాధితులను పరామర్శించేందుకు జగన్ ఆసుపత్రిలోకి అడుగు పెట్టకముందే ఆయన వెంట ఉండే దుష్టచతుష్టయాల్లో ఒకరు లోపలికి ప్రవేశించారని, సీఎం చంద్రబాబుకు వ్యతిరేకంగా మాట్లాడమని 18 మందికి డబ్బులు పెట్టిన తెల్ల కవర్లు పంచారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయన్నారు. ఇంత నీచానికి దిగజారడానికి సిగ్గులేదా? అని ఘాటుగా విమర్శించారు. జగన్, ఆయన అనుచరగణం తిరుపతి లో శవాల మీద పేలాలు ఏరుకునే రాజకీయం చేశారని, వాళ్లు మనుషులేనా? అని మండిపడ్డారు. ఆసుపత్రి వద్దకు వచ్చిన జగన్ ఒక మాజీ ముఖ్యమంత్రిగా ప్రవర్తించ లేదు. 'అయ్యా.. ఆసుపత్రిలో ఉప ముఖ్యమంత్రి ఉన్నారు.. ఒక్క 15 నిమిషాలు ఆగండి.. ఆయన వెళ్లిన తరువాత మిమ్మల్ని అనుమతిస్తామని పోలీసులు ప్రాధేయపడినా జగన్, ఆయన అనుచరులు వినలేదు. పోలీసుల మీద దౌర్జన్యం చేసి ఆసుపత్రిలోకి దూరారు. వీరి ప్రవర్తనకు ఆసుపత్రి వర్గాలు, రోగులు భయభ్రాంతులకు గురయ్యారు. సెలైన్ స్టాండ్లు కింద పడిపోయాయి. బాధితులను పరామర్శించే పద్ధతా ఇది? ఆసుపత్రి వద్ద పరామర్శకు వచ్చిన నాయకుడు ఎలా ఉండాలి.. ఈయన వెంట వచ్చిన జనం చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడ ఉన్న పవన్ కల్యాణ్ అభిమానులు నినాదాలు చేయడానికి ప్రయత్నించారు. కానీ పవన్ నినాదాలు ఆపించారు. కానీ జగన్ ఆపమని చెప్పలేదు. ఇంకా రెచ్చగొట్టేలా ప్రవర్తించారు. సీఎం, డిప్యూటీ సీఎంలు ఒకరిద్దరిని వెంటబెట్టుకొని ఆసుపత్రిలో పరామర్శలకు వెళ్లారు. జగన్ మాత్రం వందల మందిని పోగేసుకొని ఆసుపత్రిలోకి జొరబడ్డారు. గాయపడిన వారు ఐసీయూలో ఉన్నారు. అక్కడికి వందల మందిని వెంటబెట్టుకొని వెళ్లారు. ఐసీయూ నిబంధనలు ఏమిటో జగన్‌కు తెలియదా? ప్రజలు ప్రతిపక్ష పాత్ర కూడా ఇవ్వకుండా బుద్ధి చెప్పినా జగన్‌లో ఇంకా మార్పు రాలేదు. వైసీపీ నేతలకు సనాతన ధర్మం తెలియదు. ఆగమ శాస్త్రాల నిబంధనలు పాటించిన పాపాన పోలేదు. వేదపండితులను మరచిపోయారు. నిగమ, ఆగమ సాంప్రదాయాలు మరిచిపోయారు. చివరికి తిరుపతిలో జరిగిన దురదృష్టకర సంఘటనను తన రాజకీయానికి అనుకూలంగా మలుచుకోవాలని ప్రయత్నించారు. ఇంత నీచంగా వ్యవహరించడానికి సిగ్గులేదా?ఏం సంస్కృతి మీది? మృగాల మధ్య బతకాల్సినవారు జనంలో తిరుగుతున్నారు" అని ఆనం దుయ్యబట్టారు.



**అందుకే క్షమాపణలు**

ప్రజలంతా ఎంతో నమ్మకంతో చంద్రబాబు నాయకత్వంలో ఎన్‌డీఏ కూటమికి ఓటు వేశారు. అందుకే తప్పు ఎవరి వల్ల జరిగినా ప్రభుత్వంలో భాగస్వామిని కాబట్టి క్షమాపణలు అడిగా. ఎవరు తప్పు చేసినా బాధ్యత తీసుకోవాలి. జపాన్ ప్రధాని మూడు తరాలకు ముందు జరిగిన తప్పునకు క్షమాపణ చెప్పారు.

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

# క్షమాపణలు చెప్పాల్సిందే!

## మీకు మరో దారి లేదు

- ప్రజలు మిమ్మల్ని చూస్తున్నారు
- టీటీడీ చైర్మన్, ఈవో, బోర్డు సభ్యులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరిక

కాకినాడ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనకు సంబంధించి టీటీడీ చైర్మన్, ఈవో, బోర్డు సభ్యులు క్షమాపణలు చెప్పాల్సిందేనని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. జరిగిన తప్పిదానికి తానే క్షమాపణ కోరానని, చైర్మన్, పాలకమండలి సభ్యులు సహా అధికారులకు నామోషీ ఎందుకని ప్రశ్నించారు. ప్రజలంతా చూస్తున్నారని చైర్మన్, ఈవో, బోర్డుకు వేరే దారి లేదని పేర్కొన్నారు. జరిగిన దానికి తమకు బాధ్యత లేదని తప్పించుకుంటే ఎలా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో నిర్వహించిన బహిరంగసభలో పవన్ కల్యాణ్ ప్రసంగించారు. తిరుపతి తొక్కిసలాట ఘటనపై మరోసారి స్పందించారు. ఆ ఘటన తనను చాలా బాధించిందన్నారు. బాధితులు తనతో చెప్పిన మాటలు విన్నప్పుడు కన్నీళ్లు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి ఘటనతో తనకు సంబంధం లేకపోయినా.. ప్రజలను ఓట్లడిగి గెలిచినందున బాధ్యతగా క్షమాపణ చెప్పానని తెలిపారు. జరిగిన తప్పును దృష్టిలో పెట్టుకుని పాలకమండలి చైర్మన్, ఈవో, ఏఈవో, సభ్యులు ప్రెస్‌మీట్ పెట్టి క్షమాపణలు చెప్పాలన్నారు. తాను బాధ్యత మీదేసుకుని క్షమాపణ చెప్పినప్పుడు బోర్డు చైర్మన్, అధికారులకు క్షమాపణలు చెప్పడానికి నామోషీ ఎందుకని ప్రశ్నించారు. కచ్చితంగా బాధ్యత తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. "తొక్కిసలాటతో తమకు సంబంధం లేదని చైర్మన్, అధికారులు అంటే ఎలా? క్షమాపణ చెప్పడం నాకు సరదానా? నేను దోషిగా నిలబడాలా? ఈ ఘటనలో చనిపోయినవారు చాలా గొప్పవాళ్లు. ఎలా ఉందని అడిగితే తమను దేవుడే బయటకు తెచ్చాడని అంటున్నారు. ఒకరకంగా వారంతా పెద్దమనసుతో ఉన్నారు. ఆ మాటలు వింటుంటే నాకు కన్నీళ్లు వచ్చాయి. అలాంటప్పుడు వీరికి కాకపోతే ఇంకెవరికి క్షమాపణలు చెబుతాం" అని పవన్ అన్నారు. బాధితుల్లో ప్రతిఒక్కరి బాధ వింటే అర్థం అవుతుందని బోర్డు చైర్మన్, పాలకమండలి సభ్యులు, అధికారులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అందుకే వీరంతా ప్రజలకు క్షమాపణలు చెప్పి తీరాలని, వేరేదారి లేదని ఉద్ఘాటించారు. కూటమి ప్రభుత్వంలో తామందరం గెలిస్తేనే బోర్డు వచ్చిందనితెలిపారు. చేయని తప్పునకు జపాన్ ప్రధాని పార్లమెంట్‌లో క్షమాపణ చెప్పారని గుర్తు చేశారు.

### మీరు బాధ్యతగా చేస్తే..

ఎన్నికల సమయంలో ప్రజల నుంచి ఓట్లు అడిగినప్పుడు జవాబుదారీగా ఉంటానని చెప్పానని పవన్ అన్నారు. "తిరుపతిలో వైకుంఠ ఏకాదశి దర్శనాల టోకెన్ల వ్యవహారంలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు చనిపోయి, 39 మంది గాయపడడంతో మనసుకు క్షోభ కలిగింది. గరుడ వాహన సేవకు నాలుగు లక్షల మంది వస్తే క్రౌడ్ మేనేజ్‌మెంట్ చేశారు. కానీ, వైకుంఠ ఏకాదశి సందర్భంగా 2,500 మందిని మేనేజ్ చేయలేకపోయారు. టీటీడీలో ఎవరి బాధ్యతలు వారు నెరవేరిస్తే సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు అక్కడకు వెళ్లాల్సిన అవసరం ఉండేది కాదు. ఒక అధికారి చేసిన తప్పునకు ఎస్పీ బలయ్యారు. గత ప్రభుత్వంలో అలవాట్లు ఇంకా కొంతమంది అధికారులకు పోలేదు. కొందరు నిర్లక్ష్యంగా ఉంటున్నారు. నాకు పనిచేయడం తప్ప వేరేది తెలియదు" అని ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

## 'సారీ'పై సారీ!

**బేషరతు క్షమాపణ చెప్పిన చైర్మన్**

తొక్కిసలాట ఘటనపై క్షమాపణలు చెప్పాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ డిమాండ్... దీనిపై పాలకమండలి చైర్మన్ బీఆర్ నాయుడు ప్రతిస్పందనతో కొంత కలకలం చెలరేగింది. 'మీరు క్షమాపణ చెబుతున్నారా?' అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా... 'క్షమాపణ చెప్పడంలో తప్పులేదు. చెప్పినంతమాత్రాన చనిపోయినవారు బతికిరారు కదా! ఎవరో ఏదో మాట్లాడితే స్పందించాల్సిన అవసరం లేదు' అని బీఆర్ నాయుడు వ్యాఖ్యానించారు. దీంతో... పవన్ డిమాండ్ చేసినా క్షమాపణలు చెప్పడం లేదని ప్రచారం జరిగింది. ఈ విషయాన్ని కొందరు సన్నిహితులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో... అప్పటికప్పుడు 'క్షమాపణ' చెబుతూ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇది కూడా సరిపోదనే ఉద్దేశంతో... పది నిమిషాల్లోనే మరోసారి బీఆర్ నాయుడు మరోసారి ప్రెస్ మీట్ పెట్టారు. డిప్యూటీ సీఎం సూచనల మేరకు... బాధితులందరికీ బేషరతుగా క్షమాపణలు చెబుతున్నామన్నారు. "భవిష్యత్తులో పూర్తిగా అధికారులపై వదిలేసి ఉండాలని అనుకోవడం లేదు. కొంతమంది అధికారులు అత్యుత్సాహంతో మేము ఏదైనా చేసేస్తామనుకోవడంతోనే ఈ ఘటన జరిగింది" అని తెలిపారు. ఇకపై కూడా అధికారులు బోర్డు మాట వినకపోతే సీఎం దృష్టికి తీసుకెళతామని తెలిపారు. బోర్డు నిర్ణయాలను అధికారులు తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనన్నారు.

# బాధాకరమైన ఘటన!

- చిన్న పొరపాటుతో పెద్ద విషాదం
- టీటీడీ బోర్డు సమావేశంలో తీర్మానాలు
- పునరావృతం కాకుండా చర్యలు: చైర్మన్

తిరుమల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తొక్కిసలాటలో చనిపోయిన ఆరుగురి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని టీటీడీ పాలక మండలి తీర్మానించింది. అలాగే... వారి పిల్లల చదువుల బాధ్యతను కూడా స్వీకరించాలని నిర్ణయించింది. మృతుల కుటుంబాల నుంచి ఒక్కొక్కరికి టీటీడీలో నియామకాలకు ఏర్పాటు చేసిన కార్పొరేషన్ ద్వారా ఉద్యోగం ఇవ్వాలని తీర్మానించింది. శుక్రవారం తిరుమలలో జరిగిన పాలకమండలి సమావేశం అనంతరం చైర్మన్ బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడారు. తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన ఇద్దరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని, గాయపడిన మరో 31 మందికి రూ.2 లక్షల చొప్పున అందిస్తామని చెప్పారు. "పరిహారం చెక్‌లను సిద్ధం చేశాం. వాటిని బోర్డు సభ్యులు, స్థానిక మంత్రులతో కలిసి రెండుమూడు రోజుల్లో బాధితులకు అందజేస్తారు" అని తెలిపారు.

**బాధాకరం...** "ఈ ఘటన జరగడం చాలా బాధాకరం. ఇలా జరగకుండా ఉండాల్సింది. చిన్న చిన్న పొరపాట్ల కారణంగా పెద్ద ఘటన చోటుచేసుకుంది" అని బీఆర్ నాయుడు విచారం వ్యక్తం చేశారు. దీనిపై సీఎం జుడీషియల్ విచారణకు ఆదేశించారని.. బాధ్యులు ఎంత పెద్దవారైనా తప్పనిసరిగా కఠినమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. "మళ్లీ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్త వహిస్తామన్నారు. టోకెన్ల జారీ కేంద్రాల్లో ఒకటి రెండు చోట్ల మాత్రమే ఇబ్బంది జరిగింది. 13వ తేదీ నుంచి ఏరోజు టోకెన్లు ఆ రోజే జారీ చేస్తాం" అని తెలిపారు. వైకుంఠ ద్వార దర్శనాలపై బోర్డులో చర్చించి, ఆగమశాస్త్ర పండితుల సలహాల మేరకు మార్పులు చేస్తామని బీఆర్ నాయుడు చెప్పారు. మరోవైపు... బాధితులకు తమ వంతు సహాయంగా బోర్డు సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి, సుచిత్రా ఎల్లా చెరో రూ.10 లక్షలు అందిస్తామని చెప్పారు. సభ్యుడు ఎంఎస్ రాజు రూ.3 లక్షల చెక్కును బోర్డు చైర్మన్‌కు అందించారు.

# చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఎదురుదెబ్బ

**» పోక్సో కేసులో క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు**

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. మైనర్ బాలికపై లైంగికదాడి జరిగిందని మీడియాలో తప్పుడు ప్రచారం చేసినందుకు గాను పోక్సో చట్టం కింద ఆయనపై నమోదైన కేసును కొట్టివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. అలాగే పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. తన మైనర్ కుమార్తెపై లైంగికదాడి జరిగిందని సాక్షి మీడియాలో ప్రకటన చేసిన చెవిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని బాలిక తండ్రి ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా యర్రవారిపాలెం పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ చెవిరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై ఇరువైపుల వాదనలు ముగియడంతో నిర్ణయాన్ని వాయిదా వేసిన న్యాయమూర్తి శుక్రవారం తీర్పు వెల్లడించారు. 'బాలిక అత్యాచారానికి గురైందంటూ చెవిరెడ్డి చెప్పిన మీదటే ఆ పత్రికలో కథనం ప్రచురితం అయినట్లు కేసు డైరీని పరిశీలిస్తే తెలుస్తోంది. బాలికపై అత్యాచారం జరగకపోయినా, జరిగిందని మీడియాకు చెప్పడం చట్టనిబంధనలకు విరుద్ధమన్న పీపీ వాదనతో ఏకీభవిస్తున్నాం. చెవిరెడ్డితో బాలిక తండ్రి కుమ్మక్కు అయ్యారని ప్రాసిక్యూషన్ చెబుతున్న వ్యవహారంపైనా విచారణ జరగాల్సిన అవసరం ఉంది. సున్నితమైన ఇలాంటి కేసుల్లో జోక్యం చేసుకోలేం. అందువల్ల క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నాం' అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

### సుప్రీంకోర్టులో క్వాష్ పిటిషన్ వేస్తా: చెవిరెడ్డి

తనపై నమోదైన పోక్సో కేసుకు సంబంధించి క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసినా... సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తానని చెవిరెడ్డి భాస్కరరెడ్డి చెప్పారు. తన వద్దనున్న ఆధారాలను సుప్రీంకోర్టు ముందుంచుతానని శుక్రవారం ఓ ప్రకటనలో వివరించారు. ముందస్తు బెయిల్ మాత్రం కోరనని చెప్పారు. ఎప్పటికైనా తనకు న్యాయం జరుగుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

## జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ ప్రభావతికి షాక్

**» రఘురామ కేసులో ముందస్తు బెయిల్ నిరాకరించిన హైకోర్టు**

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ ప్రభావతికి హైకోర్టు షాక్ ఇచ్చింది. నరసాపురం మాజీ ఎంపీ, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజును హత్య చేసేందుకు పన్నినకుట్రలో భాగస్వామి అయ్యారనే ఆరోపణలతో నమోదైన కేసులో ఆమెకు ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ శుక్రవారం తీర్పుఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రఘురామకృష్ణరాజును సీఐడీ పోలీసులు కస్టోడియల్ టార్చర్‌కు గురిచేశారు. మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు అప్పటి జీజీహెచ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వైద్యుల బృందం వైద్య పరీక్షలు నిర్వహించి ఆయన ఒంటిపై ఎలాంటి గాయాలూ లేవని నివేదిక ఇచ్చింది. అనంతరం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వైద్య పరీక్షలు చేసిన సికింద్రాబాద్ ఆర్మీ ఆసుపత్రి వైద్యులు రఘురామను కస్టోడియల్ హింసకు గురిచేసినట్లు నిర్ధారించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తనను కస్టోడియల్ హింసకు గురిచేసిన సీఐడీ పోలీసులతో పాటు తప్పుడు వైద్య నివేదిక అందజేసిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రఘురామకృష్ణరాజు గుంటూరు, నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ప్రభావతి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వీరారెడ్డి, ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, రఘురామ తరఫున న్యాయవాది వీవీ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు ముగియడంతో న్యాయమూర్తి నిర్ణయాన్ని వాయిదా వేశారు. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ నిర్ణయాన్ని వెల్లడించారు.

### ప్రాథమిక ఆధారాలున్నాయి

'సీఐడీ పోలీసు కస్టడీలో తన పాదాలపై దారుణంగా కొట్టారని రఘురామ రాజు నిర్దిష్టంగా చెబుతున్నప్పటికీ కాలివేళ్లు విరిగిన ప్రాంతాన్ని వదిలిపెట్టి పాదాలను ఎక్స్‌రే తీశారు. హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాలతో మెడికల్ బోర్డు ఏర్పడిన నేపథ్యంలో కోర్టుకు సమర్పించిన రిపోర్టులు, ఎక్స్‌రే ఫిలింలన్నీ సక్రమంగా ఉన్నాయా? లేవా? చూడాల్సిన బాధ్యత మెడికల్ బోర్డు చైర్‌పర్సన్‌గా ప్రభావతిపై ఉంది. రఘురామ విషయంలో తీసిన పాక్షిక ఎక్స్‌రేపై అభ్యంతరం తెలపకుండా ప్రభావతి దానిని పరిగణనలోకి తీసుకున్నారని, కుట్రలో ఆమెకు పాత్ర ఉందన్న ప్రాసిక్యూషన్ వాదనలతో ఏకీభవిస్తున్నాం. ఈ మొత్తం వ్యవహారంలో ప్రభావతి పాత్ర లేదని చెప్పలేం. కోర్టు ఉత్తర్వులను గౌరవించడంతో పాటు వైద్య విలువలకు కట్టుబడి ఉండాల్సిన బాధ్యత డాక్టర్లపై ఉంది. పిటిషనర్ విషయంలో ప్రాథమిక ఆధారాలు ఉన్నందున ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నాం' అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణ

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువగా, కొన్ని చోట్ల తక్కువగా ఉన్నారు. రేషనలైజేషన్ ప్రక్రియతో దీనిని సరిదిద్దేందుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. సీఎం చంద్రబాబు శుక్రవారమిక్కడ గ్రామ/వార్డు సచివాలయ శాఖపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా సిబ్బంది హేతుబద్ధీకరణపై చర్చ జరిగింది. రాష్ట్రంలో ప్రస్తుతం 11,162 గ్రామ సచివాలయాలు, 3,842 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వాటిలో 1,27,175 మంది పనిచేస్తున్నారు. ప్రతి సచివాలయంలో 10 మంది ఉద్యోగులు ఉండేలా ఈ విభాగాన్ని డిజైన్ చేయగా.. చాలా ప్రాంతాల్లో తక్కువ మందితోనే నడిపిస్తున్నారు. రేషనలైజేషన్‌లో భాగంగా మల్టీపర్పస్ ఫంక్షనరీస్, టెక్నికల్ ఫంక్షనరీస్‌గా వారిని విభజించాలనే ప్రతిపాదన ఉంది. మల్టీపర్పస్ విభాగంలోకి గ్రామ సచివాలయ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్-ఎడ్యుకేషన్ అసిస్టెంట్, గ్రామ మహిళా పోలీసు వస్తారు. వార్డు సచివాలయంలో అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శి, విద్య-డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వెల్ఫేర్-డెవలప్‌మెంట్ సెక్రటరీ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి వస్తారు. టెక్నికల్ విభాగంలో.. గ్రామ సచివాలయ పరిధిలో వీఆర్వో, ఏఎన్ఎం, సర్వే అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్ సెక్రటరీ, ఎనర్జీ అసిస్టెంట్ ఉంటారు. వార్డు సచివాలయంలోకి వార్డు రెవెన్యూ సెక్రటరీ, హెల్త్ సెక్రటరీ, ప్లానింగ్ సెక్రటరీ, ఎమినిటీస్ సెక్రటరీ, శానిటేషన్, వార్డు ఎనర్జీ సెక్రటరీ వస్తారు. ప్రతి 2,500-3,500 మంది జనాభాకు ముగ్గురు మల్టీపర్పస్ సిబ్బంది, నలుగురు టెక్నికల్ సిబ్బంది కలిపి ఏడుగురు ఉంటారు. 3,500కి మించి జనాభా ఉంటే.. నలుగురు మల్టీపర్పస్, నలుగురు టెక్నికల్ ఉద్యోగులు కలిపి 8 మంది ఉంటారు. ఈ విధంగా రేషనలైజేషన్ చేస్తే.. 2,500లోపు జనాభా కలిగిన ప్రాంతంలో ఆరుగురు సిబ్బందితో 3,562 గ్రామ/వార్డు సచివాలయాలు ఉంటాయి. 2,500-3,500 జనాభా కలిగిన ప్రాంతంలో ఏడుగురు సిబ్బందితో 5,388 సచివాలయాలు ఉంటాయి. 3,500కు పైగా జనాభా కలిగిన ప్రాంతంలో 8 మంది సిబ్బందితో 6,054 గ్రామ/వార్డు సచివాలయాలు ఉంటాయి. మొత్తం 15,004 గ్రామ/వార్డు సచివాలయాలు ఉంటారు.

### యాస్పిరేషనల్ సెక్రటరీ..

ప్రతి సచివాలయంలో ఒక సెక్రటరీని యాస్పిరేషనల్ సెక్రటరీగా నియమించాలని, వారి ద్వారా ఏఐ, డ్రోన్ వంటి కొత్త టెక్నాలజీని గ్రామాల్లోకి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటినీ జియోట్యాగింగ్ చేయాలన్నారు. కనీసం 2,500 మంది జనాభాకు.. లేదా 5 కి.మీ పరిధిలో ఒక సెక్రటేరియట్ ఉండాలన్నారు. ఏజెన్సీల్లో అవసరమైతే అదనంగా పెంచాలని తెలిపారు. గతంలో ప్రతిపాదించిన విధానం ప్రకారం.. మొత్తం 1,61,000 సచివాలయ ఉద్యోగులు ఉండాలి. ప్రస్తుతం 1,27,000 మంది మాత్రమే పనిచేస్తున్నారు. అయితే ఉన్న వీరినే సమర్థంగా ఉపయోగించుకోవడం ద్వారా మెరుగైన సేవలు అందించనున్నారు. కొత్త విధానం అమలుపరిస్తే 15 వేల మంది సచివాలయ సిబ్బంది అదనంగా ఉంటారు. వీరిలో సాంకేతిక అవగాహన ఉన్న వారికి శిక్షణ ఇచ్చి యాస్పిరేషనల్ కార్యదర్శిగా నియమించాలని సీఎం చెప్పారు. సమాచారం లేనివారి నుంచి పూర్తి వివరాలు తీసుకునే ప్రక్రియను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. సచివాలయాల పనితీరును అంచనా వేసిన వారికి బహుమతి ఇవ్వాలన్నారు. 'సచివాలయ విభాగానికి పంచాయతీ కార్యదర్శి/వార్డు పరిపాలనా కార్యదర్శి అధిపతిగా ఉంటారు. గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థల ద్వారా కార్యనిర్వాహకులకు సాంకేతిక శిక్షణ అందించాలి. ఈ నెల 20నాటికి గృహాలన్నీ జియోట్యాగింగ్ పూర్తి చేయాలి. సచివాలయాల ద్వారా జారీచేసే సర్టిఫికెట్లపై నా ఫొటోలు ముద్రించవద్దు. వాటిపై ప్రభుత్వ లోగో మాత్రమే ఉండాలి. పిల్లలందరికీ ఆధార్ జారీ ప్రక్రియ ఫిబ్రవరి 15కల్లా పూర్తి చేయాలి' అని సూచించారు.

# సంక్రాంతికి వస్తున్నాం

**» ఏపీకి కదిలిన తెలంగాణ జనం**

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

సంక్రాంతి పండుగను సొంతూరిలో జరుపుకోవడానికి హైదరాబాద్‌లో ఉంటున్న ఏపీ వాసులు బయలుదేరారు. పెద్దసంఖ్యలో తరలివస్తున్న ప్రయాణికులతో అక్కడి రోడ్లన్నీ రద్దీగా మారాయి! బస్సులు, రైళ్లు కిక్కిరిసిపోతున్నాయి. శుక్రవారం మొదలైన ఈ రద్దీ శనివారం నుంచి విద్యాసంస్థలకు సెలవులు కావడంతో మరింతగా పెరగనుంది. పండుగ నేపథ్యంలో టీఎస్ఆర్టీసీ ప్రత్యేకంగా 6,432 బస్సులను నడపనుంది. ఈ స్పెషల్ బస్సుల్లో అదనంగా 50శాతం చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు మండిపడుతున్నారు. ఇక సంక్రాంతి సందర్భంగా 366 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద వాహనాలు బారులు తీరాయి. 16 గేట్లకు 10 గేట్ల ద్వారా విజయవాడ వైపు వాహనాలు పంపించారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్, టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది.



ఏపీకి బయలుదేరిన బస్సులు, జనంతో రద్దీగా ఉన్న కూకట్‌పల్లి

### ప్రత్యేక హైటెక్, వోల్వో బస్సులు

హైదరాబాద్ నుంచి ఏపీలోని వేర్వేరు ప్రాంతాలకు ప్రత్యేకంగా హైటెక్, వోల్వో బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ (టీజీటీడీసీ) అధికారులు తెలిపారు. విజయవాడ, ఏలూరు, కాకినాడ, విశాఖపట్నం, తిరుపతికి ఈ బస్సులు నడుస్తాయని చెప్పారు. మరిన్ని వివరాలకు 9848540371, 9848125720లో సంప్రదించాలని, వెబ్‌సైట్ (www.tgtdc.in) ద్వారా సీట్లు బుకింగ్ చేసుకోవచ్చునని చెప్పారు.

## జైళ్ల శాఖలో 400 పోస్టుల భర్తీకి చర్యలు

**» 200 మంది ఖైదీల క్షమాభిక్షకు ప్రతిపాదనలు: ఏపీ జైళ్ల శాఖ ఐజీ**

ఆరిలోవ (విశాఖపట్నం), జనవరి 10(ఆంధ్రజ్యోతి): జైళ్ల శాఖలోని వివిధ విభాగాల్లో 400 పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతున్నట్లు ఏపీ జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన విశాఖ కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జైళ్లలో నూతన భవనాల నిర్మాణం, ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.100 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు.రాజమహేంద్రవరం కారాగారంలో భవనాల నిర్మాణానికి రూ.33.5 కోట్లు, ఆధునికీకరణ, పాలనాపరమైన అంశాలకు రూ.10.7 కోట్లు, విశాఖ సెంట్రల్ జైలులో అదనపు భవనాల నిర్మాణానికి రూ.15 కోట్లు, ఆధునికీకరణకు రూ.24 లక్షలు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం విశాఖ జైలులో 73 మంది మహిళా ఖైదీలు ఉన్నారన్నారు. ఇక్కడ డీ ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. ఈ కారాగారంలో 496 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జైళ్ల నుంచి 200 మంది ఖైదీల క్షమాభిక్షకు ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. కాగా, ఇటీవల విశాఖ జైలులో నాలుగు సెల్‌ఫోన్లు లభించిన ఘటనలపై దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. విశాఖ జైలులో ఖైదీలు ఎక్కువగా ఉండడంతో 200 మంది రిమాండ్ ఖైదీలను రాజమహేంద్రవరం తరలించనున్నట్లు ఐజీ తెలిపారు.

## బెనిఫిట్ షోలు రద్దంటూ..
## స్పెషల్ షోకు అనుమతులా?

**» పునఃసమీక్షించాలంటూ హోంశాఖ ముఖ్య కార్యదర్శికి టీ హైకోర్టు ఆదేశాలు**

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సినిమా బెనిఫిట్ షో, స్పెషల్ షోలకు అనుమతులు, టికెట్ల రేట్ల పెంపు అంశంలో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. గేమ్ చేంజర్ సినిమాకు తెల్లవారుజామున 4 గంటలకు స్పెషల్ షోతోపాటు అదనపు షోలు వేయడానికి, టికెట్ల రేట్లు పెంచుకోవడానికి అనుమతినిస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఇచ్చిన మెమోను పునఃసమీక్షించి మళ్లీ నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. పుష్ప-2 సినిమా తొక్కిసలాట నేపథ్యంలో బెనిఫిట్ షోలకు అనుమతివ్వబోమని చెప్పి స్పెషల్ షో పేరిట అనుమతివ్వడాన్ని తప్పుబట్టింది. అలాగే ఏ నియమ నిబంధనల ఆధారంగా టికెట్ రేట్లు పెంచారని నిలదీసింది. తాము ఇచ్చే ఆదేశాలతో ప్రభుత్వం కళ్లు తెరవాలని వ్యాఖ్యానించింది. అసలు రాత్రి 12 గంటల తర్వాత సినిమాలను, పబ్బులను నిషేధించాలని.. 16 ఏళ్ల లోపు పిల్లలు సినిమాలకు అనుమతించకుండా రూల్స్ తేవాలని పేర్కొంది. బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వమని పేర్కొంటూనే గేమ్ చేంజర్ సినిమాకు అదనపు షోల ప్రదర్శనకు, టికెట్ల రేట్ల పెంపునకు అనుమతినిస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి మెమో జారీచేయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో వేర్వేరు పిటిషన్‌లు దాఖలయ్యాయి. వీటిపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది.

## మూడు రెట్లు పెరిగిన టికెట్ ధరలు

**» విమానయాన సంస్థలకు కాసుల వర్షం**

**» హైదరాబాద్ నుంచి విశాఖకు రూ. 18వేలు**

సంక్రాంతి పండగ విమానయాన సంస్థలకు కాసుల వర్షం కురిపిస్తోంది. పండుగ వేళ హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి వెళ్లే విమాన సర్వీసుల టికెట్ల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. హైదరాబాద్ నుంచి విశాఖపట్నంకు శని, ఆదివారాల్లో గరిష్ఠంగా రూ.17 నుంచి రూ. 18వేల మధ్య టికెట్ ధరలు ఉన్నాయి. హైదరాబాద్ నుంచి విజయవాడకు ఆదివారం టికెట్ ధర రూ. 16,976లు ఉండగా రాజమండ్రికి రూ. 15,086లు ఉంది. బెంగుళూరు నుంచి విశాఖ, రాజమండ్రి, విజయవాడకు రెండు, మూడు రెట్లు పెరిగాయి. బెంగుళూరు నుంచి విశాఖ టికెట్ ధర రూ. 17,391ఉండగా రాజమండ్రికి 16,357గా ఉంది.

## నాలుగు రైళ్లు రద్దు

విజయవాడ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కీలకమైన రద్దీ సమయంలో విజయవాడ - విశాఖపట్నం మధ్యన రెండు రోజుల పాటు ముఖ్యమైన షెడ్యూల్ సర్వీసులను రైల్వే శాఖ రద్దు చేసింది. వందే భారత్‌కు డిమాండ్ పెంచుకోవటంలో భాగంగానే రైల్వే ఈ నిర్ణయం తీసుకుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఆటోమేటిక్ సెక్షన్ పనులేవీ వందేభారత్ అడ్డురాకపోవడాన్ని పలువురు గుర్తు చేస్తున్నారు. సికింద్రాబాద్, విశాఖపట్నం మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్ 20834/20833)కు 2 ఎగ్జిక్యూటివ్ కోచ్‌లు, 14 చైర్ కార్ కోచ్‌లు ఉంటాయి. పండగ రద్దీని దృష్టిలో ఉంచుకుని రద్దు చేసిన నాలుగు రైళ్ల స్థానంలో వందే భారత్ వైపు ప్రయాణికులను ఆకర్షించటం కోసం చైర్ కార్ కోచ్‌లను 18కి పెంచింది. అదే సమయంలో పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకొని జనసాధారణ్ రైళ్లను చర్లపల్లి - విశాఖపట్నం మధ్యన నడుపుతున్నట్టు ప్రకటించింది. నాలుగు రైళ్లను రద్దు చేసి, మరో నాలుగు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నామని రైల్వే ప్రకటించడం వెనుక ప్రయాణికుల ప్రయోజనాలు ఏమేరకు ఇమిడి ఉన్నాయన్న ప్రశ్నకు అధికారులే సమాధానం చెప్పాలి.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.